ఆదివారం
11•2•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 245
• పేజీలు : 16 + (24/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

కాళేశ్వరం.. మిషన్ భగీరథ

దేశానికే నమూనా

మిషన్ భగీరథ అన్ని రాష్ట్రాలకూ ఆదర్శం. ప్రజల జీవన ప్రమాణాలు మార్చనున్న పథకమిది. మంచినీటితోపాటు ఇంటర్నెట్ ఇవ్వడం అద్భుతం.
-అరవింద్ మెహతా

అతి తక్కువ కాలంలో అద్భుతంగా పనులు
అంతర్జాతీయ ప్రమాణాల్లో కాళేశ్వరానికి ఎన్నో ప్రత్యేకతలు
దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానున్న ప్రాజెక్టు

హైదరాబాద్/సిద్దిపేట/జయశంకర్ జిల్లా ప్రతినిధి నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు దేశంలో అన్ని రాష్ట్రాలకు రోల్‌మోడల్ కానున్నదని పదిహేనో ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా ప్రశంసించారు. ఇంటింటికీ సురక్షిత మంచినీటినందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపట్టిన మిషన్ భగీరథ పథకం అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. మిషన్ భగీరథతో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు కచ్చితంగా మెరుగవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంత భారీ ప్రాజెక్టును ఇంత తక్కువ కాలంలో పూర్తిచేస్తుండటం అభినందనీయమని మెహతా అన్నారు. మంచినీటితోపాటు ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించడం అద్భుతమని పేర్కొన్నారు. దేశ సాగునీటిరంగ చరిత్రలో కాళేశ్వరం ప్రాజెక్టు ఒక నమూనాగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం గొప్పదని అభివర్ణించారు. ఈ ప్రాజెక్టుతో 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు

మిగతా 2వ పేజీలో



- అతితక్కువ విద్యుత్‌తో చరిత్ర సృష్టించనున్న తెలంగాణ
- 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అభినందన
- క్షేత్రస్థాయిలో అన్నారం బరాజ్ పనుల పరిశీలన
- కోమటిబండ మిషన్ భగీరథ సంప్‌హౌజ్ సందర్శన
- నాలుగునెలల్లో సంఘం సభ్యులందరితో కలిసి వస్తామని వెల్లడి
- తెలంగాణకు అధిక నిధుల కేటాయింపునకు కృషిచేస్తామని హామీ

సిద్దిపేటజిల్లాలో కోమటిబండపై మిషన్ భగీరథ సంప్‌హౌస్‌ను పరిశీలించి.. మీడియాతో మాట్లాడుతున్న 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా. చిత్రంలో సీఎస్ ఎస్‌కే జోషి, మిషన్ భగీరథ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ఉన్నారు.



13 వేల మంది ఉద్యోగులకు

రైల్వేశాఖ ఉద్వాసన!

అనధికారికంగా విధులకు గైర్హాజరు అవుతున్న వారిపై క్రమశిక్షణ చర్యలు 3

మార్చి 8న వీ-హబ్

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రారంభం

ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 14 శాతం

త్వరలో ఎలక్ట్రిక్ వాహనాల పాలసీ

సీఐఐ దక్షిణాది రాష్ట్రాల మండలి సభ్యుల సదస్సులో మంత్రి కేటీఆర్

ప్రపంచంతో దీటుగా పోటీపడాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పిలుపు



శనివారం బేగంపేటలో సీఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఔత్సాహిక మహిళాపారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి దేశంలోనే మొదటిసారిగా విమెన్ ఎంటర్‌ప్రైన్యూర్ హబ్ (వీ-హబ్) ను ప్రపంచ మహిళా దినోత్సవం మార్చి 8న ప్రారంభించనున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి కల్వకుంట్ల తారకరామారావు వెల్లడించారు. గత నవంబర్‌లో జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్) ముగింపు సమావేశంలో ప్రకటించిన విధంగా వీ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలపై త్వర లో ప్రముఖ మహిళాపారిశ్రామికవేత్తలు, సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. శనివారం బేగంపేటలో సీఐఐ సదరన్ రిజినల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఇంకా ముందుండాలంటే మనం దీటుగా పోటీపడాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. భారత్‌లోని

మిగతా 2వ పేజీలో

మరోసారి రెచ్చిపోయిన జైషే మొహమ్మద్

కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి

ఓ కల్నల్, సైనికాధికారి కూతురు సహా తొమ్మిదిమందికి గాయాలు

ఎదురుకాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులు హతం



36 బ్రిగేడ్ ఆర్మీ క్యాంప్‌లో చొరబడిన ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు సిద్ధమైన జవాను

జమ్మూ ఆర్మీ శిబిరంపై ఉగ్రవాదుల దాడి

జమ్మూకశ్మీర్‌లోని సైనిక శిబిరంపై ఉగ్రమూక మరోసారి దాడిచేసింది. జమ్మూ-పఠాన్‌కోట్ మార్గంలో అంతర్జాతీయ సరిహద్దుకు అత్యంత సమీపంలోని 36బ్రిగేడ్ ఆర్మీ క్యాంప్‌లో శనివారం తెల్లవారుజామున పాకిస్థాన్‌లోని జైషే మొహమ్మద్‌కు చెందిన 'అఫ్జల్‌గురు స్క్వాడ్' చొరబడి కాల్పులకు తెగబడింది. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అంతకుముందు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పాఠశాలకు వెళ్తున్న ఆర్మీ అధికారి కూతురు, ఓ కల్నల్‌స్థాయి అధికారి సహా తొమ్మిదిమంది గాయపడ్డారు. 5

త్వరలో ఆహారశుద్ధి విధానం

ప్రతిపాదనల కోసం మంత్రివర్గ ఉపసంఘం నియామకం

సబ్‌కమిటీ చైర్మన్‌గా మంత్రి పోచారం, కన్వీనర్‌గా ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి.. మూడు నెలల్లో నివేదిక 2

ఎంపీ కవితకు పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

లోక్‌సభలో మద్దతిచ్చినందుకు ధన్యవాదాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలంటూ పవన్‌కల్యాణ్ శనివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లోక్‌సభలో మద్దతు తెలిపిన టీఆర్‌ఎస్ ఎంపీ చెల్లెలు కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు అంటూ ట్వీట్‌చేశారు. విభజన హామీలు అమలు చేయాలంటూ గత కొన్నిరోజులుగా ఏపీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన వ్యక్తంచేస్తుండగా, ఎంపీ కవిత కూడా ఈ అంశంపై లోక్‌సభలో మాట్లాడారు. విభజన హామీలను నెరవేర్చాలని కేంద్రాన్ని కోరారు.

బోదకాలు బాధితులకు పెన్షన్ అభినందనీయం

సీఎం కేసీఆర్ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ ప్రశంస



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బోదకాలు బాధితులకు ప్రతినెల రూ.వెయ్యి పెన్షన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ శనివారం ట్విటర్‌లో హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని 46,476 మంది బోదకాలు బాధితులకు వచ్చే ఆర్థికసంవత్సరం నుంచి పెన్షన్ ఇవ్వాలని మానవీయకోణంలో సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు.

త్వరలో ఆహారశుద్ధి విధానం

ప్రతిపాదనలకోసం మంత్రివర్గ ఉపసంఘం నియామకం

సబ్‌కమిటీ చైర్మన్‌గా మంత్రి పోచారం.. మూడునెలల్లో నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పెరుగుతున్న ఆయకట్టుకు అనుగుణంగా ఆహారశుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) విధానం రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంచేయడానికి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. శనివారం సీఎస్ ఎస్కే జోషి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. సబ్‌కమిటీ కన్వీనర్‌గా వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, సభ్యులుగా ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను నియమించారు. మంత్రివర్గ ఉపసంఘం మూడునెలల్లో ఈ విధానానికి సంబంధించి ప్రతిపాదనలు అందజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. రాష్ట్రంలో సాగు పరిస్థితులు మెరుగైన నేపథ్యంలో వ్యవసాయ పద్ధతుల్లో రావాల్సిన మార్పులు, కొత్తగా నెలకొల్పనున్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు మార్గదర్శకాలను సబ్‌కమిటీ సభ్యులు ప్రతిపాదిస్తారు. జిల్లాలవారీగా సాగవుతున్న వివిధ రకాల పంటలు, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై మంత్రివర్గ ఉపసఘం ప్రతిపాదనలు చేస్తుంది.



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచారం బర్త్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం దంపతులు కేక్ కట్ చేశారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు మంత్రి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **–బాన్సువాడ/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ వద్ద నిర్మించిన మిషన్ భగీరథ సంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్కే జోషి, మిషన్ భగీరథ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో రంగనాయక సాగర్ రిజర్వాయర్ సొరంగంలో సర్జిపూల్ పంప్‌హౌస్ పనులు పరిశీలిస్తున్న 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా, సీఎస్ ఎస్కే జోషి తదితరులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అన్నారం బరాజ్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిని మ్యాప్ ద్వారా అరవింద్ మెహతాకు వివరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్కే జోషి

దేశానికే నమూనా

మొదటిపేజీ తరువాయి...

సాగునీరు అందడంతోపాటు మరో 18 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తాగు, పారిశ్రామిక అవసరాలకు సైతం నీటిని అందించనుండటాన్ని తెలుసుకున్న ఆయన.. దేశ ఆర్థిక పురోగతిలో కాళేశ్వరం నిస్సందేహంగా కీలకం కానున్నదని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి, మెహతా, ఇతర సభ్యులు పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లా పరిధిలో జరుగుతున్న రంగనాయకసాగర్ రిజర్వాయర్ నిర్మాణం, టన్నెల్ పనులను పరిశీలించారు. అంతకుముందు సిద్దిపేట జిల్లాలో మిషన్ భగీరథ పనులను క్షేత్రస్థాయిలో చూశారు.

భౌగోళిక స్వరూపాన్ని బాగా వినియోగించుకొన్నారు

గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండలో నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్‌ను సందర్శించిన మెహతా తెలంగాణ ఏర్పడిన తర్వాతనే మిషన్ భగీరథ ఆలోచన, ఆచరణ జరిగిందని తెలుసుకొని ఆశ్చర్యచకితులయ్యారు. అక్కడ ఫొటో ఎగ్జిబిషన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి మిషన్ భగీరథ ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. ఇరవై ఏండ్ల క్రితం సిద్దిపేటలో ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్ ప్రారంభించిన తాగునీటి పథకమే మిషన్ భగీరథకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. 98 శాతం నీటి సరఫరా గ్రావిటీతోనే జరుగుతుందని అధికారులు చెప్పిన వివరాలు విన్న మెహతా తెలంగాణ భౌగోళిక స్వరూపాన్ని అద్భుతంగా వినియోగించుకొన్నారని వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ దేశం మొత్తానికి అనుసరణీయమని ప్రశంసించారు. ఇతర రాష్ట్రాల ఇంజినీర్లు, అధికారులు ఈ ప్రాజెక్టు నుంచి ఎంతో నేర్చుకోవచ్చని చెప్పారు. ఎన్నో వ్యాధులకు అపరిశుభ్రంగా ఉండే తాగునీరే కారణమని, మిషన్‌భగీరథతో ప్రజలకు సురక్షిత తాగునీరు హక్కుగా దొరుకుతుందని చెప్పారు. దీర్ఘకాలంలో తెలంగాణ సమాజంపై మిషన్‌భగీరథ సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కూడా సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని స్పష్టంచేశారు. ప్రతీఒక్కరికీ రక్షిత మంచినీటిని అందించాలన్న తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి తొమ్మిది నెలల కాలంలోనే పూర్తయిన కోమటిబండ హెడ్‌వర్క్స్ పనులే నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అతితక్కువ కరంటును వినియోగించడంతో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఇంటింటికీ మంచినీటితోపాటు ఇంటర్నెట్ అందించి తెలంగాణ చరిత్ర సృష్టించబోతున్నదని అభినందించారు. ఆ తర్వాత మాట్లాడిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి.. మిషన్ భగీరథ టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచిందన్నారు.

నిర్దిష్ట గడువులోగా పూర్తిచేస్తాం: సీఎస్ ఎస్కే జోషి

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శైలేంద్రకుమార్ జోషి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోపు పూర్తిచేయనుందని, అందుకోసం ప్రణాళిక బద్ధంగా ఎలా పనిచేస్తున్నదో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పట్టుదల, రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కృషితో దేశంలో ఎక్కడా లేనిరీతిలో తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును షెడ్యూల్ ప్రకారం పూర్తిచేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని వెల్లడించారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఎలా పర్యవేక్షణ, సమీక్షలు నిర్వహిస్తున్నారో సీఎస్.. మెహతాకు వివరించారు. ఇప్పటికే 80 శాతం మేర కాళేశ్వరం పనులు పూర్తయ్యాయని వివరించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం వద్ద జరుగుతున్న బరాజ్ పనులు

సాగునీటి ప్రాజెక్టులతోనే ఆర్థిక పురోగతి
అరవింద్ మెహతా, కార్యదర్శి 15వ ఆర్థిక సంఘం

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారానే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధ్యమవుతుందని ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు. మరో నాలుగునెలల్లో 15వ ఆర్థికసంఘం ప్రతినిధులందరితో కలిసి ప్రాజెక్టు సందర్శనకు వస్తామని తెలిపారు. దేశంలో సమగ్ర గ్రామీణాభివృద్ధి కేంద్ర ఆర్థిక సంఘం ముఖ్యోద్దేశం అని మెహతా చెప్పారు. దేశ ఆర్థిక తలసరి ఆదాయం పెరుగాలనే ఉద్దేశంతో 15వ ఆర్థిక సంఘం వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలరీత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న బరాజ్‌లు, పంప్‌హౌజ్‌లు, గ్రావిటీ కెనాల్స్, టన్నల్స్‌లో స్ట్రక్చర్లు, ప్రణాళిక, పనుల వేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని అరవింద్ మెహతా అన్నారు. రేయింబవళ్లు మూడు షిఫ్టుల్లో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానకాలం నాటికి కాళేశ్వరం మొదటి మైలురాయిని దాటుతుందనే విషయంలో తనకు సందేహం లేదని పేర్కొన్నారు. ఈ తరహా వేగవంతమైన పనులను తాను ఎక్కడా చూడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టువల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ప్రశంసించారు. సకాలంలో ప్రాజెక్టు పూర్తయితే, ప్రాజెక్టు వ్యయం పెరగదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక సవాలుగా తీసుకున్నట్లుగా తమ పరిశీలనలో అర్థమైందని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధుల సేకరణ, వాటిని ఖర్చు చేస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యం ఇతర రాష్ట్రాలు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి అధికంగా వచ్చేలా పరిశీలిస్తామని తెలిపారు. రాష్ట్రాలకు కేంద్రం ఇస్తున్న నిధులను తెలంగాణ చక్కగా సద్వినియోగం చేసుకొంటున్నదని తెలిపారు.

మిగులు బడ్జెట్‌లోనే తెలంగాణ:
రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి

రాష్ట్రాల్లో నిధుల వినియోగంపై ఆర్థిక సంఘం తనిఖీలో భాగంగా 15వ ఆర్థిక సంఘం తెలంగాణలో పర్యటిస్తున్నట్టు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. తెలంగాణ ఏర్పడి కొద్ది కాలంలోనే ఇంతటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంపై ఆర్థిక సంఘం సంతోషాన్ని వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను అత్యంత వేగంగా అమలు చేసేందుకే అప్పులు చేస్తున్నట్లు వివరించారు. మిగులు బడ్జెట్‌తోనే తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టు రామకృష్ణారావు స్పష్టంచేశారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అందుతున్న ఫలాలను బేరీజు వేసిన తర్వాతే నిధులను ఆచితూచి ఖర్చుచేస్తున్నట్లు ఆయన వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలకోసం నిధుల సేకరణ, వాటిని ఖర్చు చేస్తున్న తీరుపట్ల ఆర్థిక సంఘం సంతృప్తి వ్యక్తం చేసిందని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి పర్యటన కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ పీ వెంకట్రామరెడ్డి, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల జాయింట్ కలెక్టర్లు పద్మాకర్, అమేయ్‌కుమార్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్లు వెంకటేశ్వర్లు, హరిరాం, ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, వేణు, ఈఈ ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి, భగీరథ ఎస్‌ఈ చక్రవర్తి, గడా హన్మంతరావు, ఈఈ రాజయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశ్చర్యపరిచిన కాళేశ్వరం

మిషన్ భగీరథ పనుల పరిశీలన అనంతరం అరవింద్ మెహతా బృందం హెలికాప్టర్ ద్వారా సండ్లాపూర్‌లోని రంగనాయక్ సాగర్‌కు చేరుకొని అక్కడ జరుగుతున్న రిజర్వాయర్, టన్నెల్ పనులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మ్యాప్‌ల ద్వారా ప్రాజెక్టు గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు మెహతాకు వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం, దీనికి అవసరమైన నిధులు, ఖర్చు వివరాలు, కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు లెక్కలను తెలియజేశారు. ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు లక్ష్యాలను అరవింద్ మెహతా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను సాగునీటిశాఖ ఇంజినీర్లు మెహతాకు వివరించారు. అనంతరం జయశంకర్ జిల్లా అన్నారం చేరుకొని అక్కడ గోదావరినదిపై జరుగుతున్న బరాజ్ పనులను పరిశీలించారు. తెలంగాణలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకోసం ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్న తీరుపట్ల కేంద్ర ఆర్థికసంఘం సంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా కాళేశ్వరం పనుల వేగాన్ని చూసి సంఘం కార్యదర్శితోపాటు సభ్యులు ఆశ్చర్యపోయారు. అతి తక్కువ వ్యవధిలో ఇంత అద్భుతంగా పనులు జరుగటం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.48 గంటలకు

సూర్యాస్తమయం: 6.12 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, కృష్ణపక్షం, ఏకాదశి సాయంత్రం 5.26 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: మూల రాత్రి 11:00 వరకు, తదుపరి పూర్వాషాఢ. అమృత ఘడియలు: మధ్యాహ్నం 3.46 నుంచి 5.22 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.47 నుంచి 6.12 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.41 నుంచి 5.27 వరకు, వర్జ్యం: తె. 4.56 నుంచి 6.32 వరకు.

లోకం పోకడ



విదేశీ ప్రయాణాలకు ఆ మాత్రం కావల్సిందేమరి..!

నాగార్జున వర్సిటీని పరిశీలించిన

హైకోర్టు జడ్జీల బృందం

హైకోర్టు తాత్కాలిక భవనాలపై సమాలోచన



గుంటూరు-విజయవాడ మధ్యనున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం భవనాలను శనివారం పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జీల బృందం

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటు కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసిన తాత్కాలిక భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తుల కమిటీ శనివారం అమరావతిలోని పలు ప్రాంతాలను సందర్శించింది. జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ సునీల్‌చౌదరి, జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తితో కూడిన బృందం గుంటూరు-విజయవాడ మధ్యనున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని పలు భవనాలను పరిశీలించింది. గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ ఈ బృందానికి యూనివర్సిటీలోని భవనాల గురించి వివరించారు. అనంతరం వర్సిటీ ఉన్నతాధికారులతో ఈ బృందం సమావేశమై పలు అంశాలపై చర్చించింది. వర్సిటీ వైస్ చాన్సలర్ యూనివర్సిటీ భవనాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన మ్యాప్‌ను అందజేశారు. హైకోర్టును రాయలసీమలో ఏర్పాటుచేయాలని కోరుతూ రాయలసీమ సాధన కమిటీ జడ్జీల బృందానికి వినతిపత్రం అందజేసింది.

నేలపాడును సందర్శించిన బృందం

అమరావతి ప్రాంతంలోని నేలపాడులో హైకోర్టుకు శాశ్వత భవనాన్ని నిర్మించనున్న నేపథ్యం లో ఆ ప్రాంతాన్ని కూడా జడ్జీల బృందం పరిశీలించింది. సీఆర్డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్ వారికి ఆ ప్రాంతాన్ని చూపించారు. తొలుత ఈ బృందం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయాన్ని కూడా సందర్శించింది.

మూలకణ చికిత్సతో ప్రాణం పోసిన నిమ్స్

ఒకరికి ఆరోగ్యశ్రీ.. మరొకరికి ఈహెచ్‌ఎస్ పథకంలో ఉచిత చికిత్స



చికిత్స అనంతరం [illegible]

ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: అరుదైన వ్యాధితో బాధపడుతున్నవారికి నిమ్స్ ప్రాణం పోసింది. ఖమ్మం జిల్లాకు చెందిన రామకృష్ణ ఎప్లాస్టిక్ అనేమియా వ్యాధితో పదిరోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేరగా, హెమటాలజీ వైద్య విభాగాధిపతి నరేందర్ నేతృత్వంలో మూలకణం (స్టెమ్‌సెల్) మార్పిడి చికిత్స అందించారు. అతని సోదరుడి నుంచి మూలకణం తీసుకొని రామకృష్ణకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన లక్ష్మీప్రసన్న కూడా అదే వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె తండ్రి జలమండలిలో ఉద్యోగి కావటంతో ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద ఆమెకు ఈ చికిత్సను ఉచితంగా అందించారు. ప్రైవేటు దవాఖానల్లో వీరు చికిత్స పొందితే రూ. [illegible] లక్షలు ఖర్చయ్యేవి.

మార్చి 8న వీ-హబ్

మొదటిపేజీ తరువాయి...

ఇతర పట్టణాలతో హైదరాబాద్‌కు పోలిక లేనేలేదని, హైదరాబాద్ ప్రపంచంలోని గొప్ప గొప్ప నగరాలతో పోటీ పడుతున్నదని వివరించారు. యాపిల్ సంస్థ తన పెట్టుబడులను పెట్టడానికి ప్రపంచంలోని టాప్ 26 నగరాలను పరిశీలించాక హైదరాబాద్‌లో పెట్టాలని నిర్ణయించిందన్నారు. ఇలా ప్రపంచంలోని నగరాలతో పోటీపడే విధంగా మన విధానాలు, సౌకర్యాలు, ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం ఉండాలని పేర్కొన్నారు. టెక్స్‌టైల్ రంగంలో తమిళనాడు, గుజరాత్‌లాంటి వాటితో కాకుండా బంగ్లాదేశ్, శ్రీలంకలాంటి దేశాలతో పోటీపడాలని ఉదహరించారు. భారత్‌లో సౌరవిద్యుత్ ఉత్పత్తిని 175 గిగావాట్ల పెంచాలనే లక్ష్యం.. పరోక్షంగా చైనాకు బాగా ఉపయోగపడుతుందని.. ఎందుకంటే సోలార్ ప్యానెళ్లు చైనాలో తయారవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకొన్న ప్యానెళ్ల నుంచి సోలార్ విద్యుత్‌ను తయారుచేస్తున్నామని, ఆ ప్యానెళ్లను ఇక్కడే తయారు చేయడంపై దృష్టిపెట్టాలని మంత్రి కేటీఆర్ కోరారు. ఇండస్ట్రీ..అకాడమీ అనుసంధానం మరింత పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు సూచించారన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో మ్యానుఫాక్చరింగ్ విభాగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించడం శుభ పరిణామమన్నారు.

ఐటీ ఎగుమతుల్లో ముందంజ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 40 నెలల్లో తమ ప్రభుత్వం అనేక అంశాలపై విధానాలు, సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. సులభ వాణిజ్య విధానం (ఈవోడీబీ) లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ ఎగుమతుల్లో దేశంలోనే టాప్ -5 రాష్ట్రాల్లో తెలంగాణ నిలిచిందని వివరించారు. 70 శాతం ఎగుమతులు ఐదు రాష్ట్రాల నుంచే జరుగుతున్నాయని ఆర్థిక సర్వేలో వెల్లడైందని వివరించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులు, అవకాశాల ఆధారంగా 14 రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తించామని వెల్లడించారు. దీనికోసం ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. లైఫ్‌సైన్సెస్ విభాగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో 35 శాతం తెలంగాణలోనే తయారవుతున్నాయని పేర్కొన్నారు. ఐటీ ఎగుమతుల్లో జాతీయ స్థాయి సగటు 9 శాతం ఉండగా తెలంగాణలో 14 శాతం ఉన్నదని, రాష్ట్ర వృద్ధిరేటు 17 శాతం ఉన్నదని చెప్పారు. 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నదని, ఇందుకనుగుణంగా రాష్ట్రంలో కూడా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడానికి ప్రత్యేక పాలసీని తీసుకొస్తామని ప్రకటించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు ఇక్కడ పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయన్నారు. భౌగోళికంగా భారతదేశ సున్నితమైనదని, అందుకే రక్షణరంగ బడ్జెట్ కేటాయింపులు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. స్విట్జర్లాండ్‌లో రక్షణశాఖకు ఆ దేశ బడ్జెట్‌లో కేవలం 0.7 శాతం కేటాయిస్తారని చెప్పారు. ప్రపంచంలోని టాప్ -5 ఐటీ కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్ , యాపిల్, అమేజాన్ సంస్థలు.. అమెరికా తరువాత హైదరాబాద్‌లోనే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికరంగం, నైపుణ్యాభివృద్ధి, మానవవనరుల్లో వస్తున్న మార్పులపై సీఐఐ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ టీ హబ్‌ను ప్రారంభించామని, దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ఈ స్ఫూర్తితోనే టీ హబ్‌ను ఫేజ్-2ను ప్రారంభించామని వివరించారు. టీ - వర్క్స్ పేరుతో అతిపెద్ద ప్రొటోటైపింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ సీఐఐ ప్రభుత్వానికి, పారిశ్రామికవర్గాలకు అనుసంధానంగా వ్యవహరిస్తున్నదని, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, కార్మిక, ఉపాధి, డిఫెన్స్ ఇతర రంగాల్లో సేవలందిస్తుందని వెల్లడించారు. ఇటీవలే వరంగల్ జిల్లాపై విజన్ 2028 పేరుతో డాక్యుమెంట్‌ను రూపొందించామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్, సీఐఐ తెలంగాణ వైస్‌చైర్మన్ సంజయ్ కే సింగ్‌తోపాటు ఆరు రాష్ట్రాలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.




బేగంపేటలో సీఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు.

13 వేల మంది ఉద్యోగులకు
రైల్వేశాఖ ఉద్వాసన!



న్యూఢిల్లీ: ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్న వారిని ఉద్యోగాల నుంచి తొలిగించాలని రైల్వే శాఖ భావిస్తున్నది. ఇందులో భాగంగా 13 వేల మంది ఉద్యోగులపై క్రమశిక్షణచర్యలు ప్రారంభించింది. చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగుల్లో నైతికస్థైర్యాన్ని పెంపొందించి మరింత కష్టపడి పనిచేసేలా తీర్చిదిద్దాలని రైల్వేశాఖ భావిస్తున్నది. 'చాలా కాలంగా అనధికారికంగా విధులకు దూరంగా ఉంటున్న సిబ్బంది వివరాలను రైల్వే శాఖ సేకరించింది. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మొత్తం 13లక్షల మంది ఉద్యోగుల్లో 13వేల మంది చాలాకాలంగా అనధికారికంగా సెలవులో ఉన్నట్లు గుర్తించాం' అని రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అనధికారికంగా సెలవుల్లో ఉన్నవారిని ఉద్యోగం నుంచి తొలిగించేందుకు నియమాల ప్రకారం క్రమశిక్షణచర్యలు ప్రారంభించింది.

గ్లోబల్ వార్మింగ్‌పై రేపటినుంచి జాతీయ సదస్సు
హైదరాబాద్‌లోని ఈపీటీఆర్ఐ క్యాంపస్‌లో నిర్వహణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) తన క్యాంపస్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో గ్లోబల్ వార్మింగ్‌పై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నది. 'హై-రిసొల్యూషన్ క్లైమేట్ ప్రొజెక్షన్స్ అండ్ ఇంట్రడక్షన్ ఆఫ్ కామన్ మెథడ్స్'తోపాటు ఇండియాలో, తెలంగాణలో వాతావరణ మార్పుల అంశంపై ఈ సదస్సు జరుగనున్నది. అమెరికా, ఇండియా వాతావరణ మార్పుల విభాగాల భాగస్వామ్య సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాపికల్ మెట్రాలజీ, పుణె, ది యూఎస్ నేషనల్ సెంటర్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్‌ఫర్మేషన్ యూనివర్సిటీ, ది కో-ఆపరేటివ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ శాటిలైట్ నార్త్ కరోలినా సంస్థలు పాలుపంచుకుంటున్నాయి. టెక్సాస్ టెక్ యూనివర్సిటీ క్లైమేట్ సైన్స్ సెంటర్ శాస్త్రవేత్తలతోపాటు దేశంలోని పలువురు ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్తలు సదస్సులో మాట్లాడనున్నారు. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులను తట్టుకోవడానికి ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలి? ఏ విధంగా పర్యావరణాన్ని పరిరక్షించాలి? పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా ఏ విధంగా స్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చునే అంశాలపై ఈ సదస్సు కొన్ని నిర్దిష్టమైన సూచనలను చేయనున్నది.

నేడు, రేపు చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు
ద్రోణి ప్రభావంతో చల్లబడిన వాతావరణం: టీఎస్‌డీపీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం చల్లబడిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులు ఇదే రకమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని, ఆకాశం మేఘావృతంగా మారడంతో రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయని చెప్పింది. శనివారం కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, మిగిలిన అన్నిప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 నుంచి 20 డిగ్రీల మధ్య నమోదయ్యాయని వెల్లడించింది.

పిప్రి ఎత్తిపోతల సర్వేకు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల పరిధిలో శ్రీరాంసాగర్ జలాశయం ఫోర్‌షోర్‌లో పిప్రి ఎత్తిపోతల పథకం నిర్మాణంపై సమగ్ర సర్వే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు అనుమతినిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. ఇందుకు రూ.14.75 లక్షలను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా ముథోల్ నియోజకవర్గంలో 4200 ఎకరాలకు నీరు అందనుంది.

చేనేత సంఘాల పదవీకాలం
6 నెలలు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాథమిక చేనేత సహకార సంఘాల పదవీకాలాన్ని ఆరునెలలు పొడిగిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఐదేండ్ల క్రితం ఎన్నికైన ఈ సంఘాల పదవీకాలం శనివారంతో ముగిసిపోయింది. ఎన్నికైన ప్రతినిధులందరు ఆరునెలలపాటు పర్సన్స్-ఇంచార్జి హోదాలో కొనసాగాలని రాష్ట్ర సహకారశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

ఆబ్కారీ కానిస్టేబుల్ అభ్యర్థులకు
15 నుంచి శరీర సామర్థ్య పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 17 వరకు శరీర సామర్థ్య పరీక్షను నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఫిజికల్ క్వాలిఫైయింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ) బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల 15న పురుష అభ్యర్థులకు, 16, 17 తేదీల్లో మహిళా అభ్యర్థులకు పీఈటీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఫ్రాన్స్‌లో టీవీ షో నుంచి
తప్పుకొన్న ముస్లిం గాయని!

ప్యారిస్, ఫిబ్రవరి 10: తీవ్రవాదుల దాడుల గురించి ఫేస్‌బుక్‌లో గతంలో చేసిన కామెంట్ల కారణంగా ఫ్రెంచ్ ముస్లిం గాయని ఓ టీవీ టాలెంట్ షో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. 22 ఏండ్ల ముస్లిం విద్యార్థిని మెన్నెల్ ఇబిత్సీమ్ టీవీ షోలో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన ఓ టీవీ షోలో టాప్ పొజిషన్‌కు చేరుకుని, సంచలనం సృష్టించింది. అయితే, ఆ మరుసటి రోజే ఆమె ఆ షో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌లో 2016లో 86మందిని పొట్టనబెట్టుకున్న తీవ్రవాదుల దాడులపై ఆందోళన వ్యక్తంచేస్తూ ఫేస్‌బుక్‌లో వరుసగా పెట్టిన పోస్టులే ఇందుకు కారణమయ్యాయి. ఆమె అటు తీవ్రవాదులను, ఇటు ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఆనాటి ఆ పోస్టులే ఇప్పుడామెకు ప్రతిబంధకంగా మారాయి. ఫేస్‌బుక్‌లో ఆనాటి పోస్టులను తొలిగించి, క్షమాపణ చెప్పుకొన్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది.

బిల్డర్లలో నూతనోత్సాహం

- సరికొత్త స్ఫూర్తినింపిన వక్తల ప్రసంగాలు
- 23 రాష్ట్రాల నుంచి 800 యువబిల్డర్లు హాజరు
- ముగిసిన క్రెడాయ్ యూత్‌కాన్ - 2018
- కేటీఆర్ వంటి లీడర్ మాకు కావాలి: తమిళనాడు యువ బిల్డర్ ఆకాంక్ష



క్రెడాయ్ యూత్‌కాన్‌కు హాజరైన జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ యువనేత సచిన్ పైలట్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశీయ నిర్మాణ రంగం ఉవ్వెత్తున ఎగిసిపడేందుకు హైదరాబాద్‌లో పునాది పడింది. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ జరిగిన క్రెడాయ్ యూత్‌కాన్ సదస్సు ద్వారా యువ డెవలపర్లకు ఎక్కడలేని ప్రోత్సాహం లభించింది. నిర్మాణ పద్ధతులపై అవగాహన మరింత పెరిగింది. ప్రపంచ నిర్మాణరంగంలో చోటుచేసుకునే తాజా పోకడలను తెలుసుకోగలిగారు. జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ యువనేత సచిన్ పైలట్ వంటి దిగ్గజాల నుంచి నవబిల్డర్లు సరికొత్త స్ఫూర్తిని పొందారు. లీడర్లకు ఉండాల్సిన కీలకమైన లక్షణాలపై అవగాహన పెంచుకున్నారు. దేశంలోని 23 రాష్ట్రాల నుంచి హాజరైన 800కిపైగా యువ డెవలపర్లకు మంత్రి కేటీఆర్ ప్రసంగం విశేషంగా నచ్చింది. వారసత్వం అనేది కేవలం ప్రాథమిక స్థాయి వరకే పనికొస్తుందని, ఆ తర్వాత కష్టపడితేనే విజయం దక్కుతుందన్న కేటీఆర్ మాటలు కొత్త బిల్డర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంత్రి కేటీఆర్ దేశీయ యువ డెవలపర్లలో నూతనోత్సాహాన్ని నింపారు. కేటీఆర్ ప్రసంగం విన్నాక తమిళనాడుకు చెందిన యువ డెవలపర్.. కేటీఆర్ వంటి నాయకుడు తమకు లేకపోవడం పెద్దగాలోటుగా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు వంటి వాటిని చూసిన దేశీయ యువ డెవలపర్లు ఆశ్చర్యపోయారు. శంషాబాద్ నుంచి హైటెక్స్ మార్గంలో స్వచ్ఛతను చూసి ప్రశంసించారు.

నగరానికొచ్చిన 800 మంది యువ డెవలపర్లు

మన దేశంలో 12 వేల మంది సభ్యులున్న క్రెడాయ్ జాతీయ సంఘానికి అనుబంధ సంస్థగా క్రెడాయ్ యూత్ వింగ్ ఆవిర్భవించింది. పుణెకు చెందిన లలిత్‌కుమార్ జైన్ అధ్యక్షుడిగా, మన తెలంగాణకు చెందిన సీ శేఖర్‌రెడ్డి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడే క్రెడాయ్ యూత్ వింగ్ ఏర్పాటైంది. ఆ తర్వాత సీ శేఖర్‌రెడ్డి జాతీయ అధ్యక్షుడు కావడంతో క్రెడాయ్ యూత్‌వింగ్‌ను మరింతగా అభివృద్ధి చేశారు. క్రెడాయ్ యూత్‌కాన్ సదస్సుకి 66 నగరాలు, పట్టణాల నుంచి 800కి పైగా యువ బిల్డర్లు, 200 వరకూ ఇతర డెవలపర్లు పాల్గొన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగిన క్రెడాయ్ యూత్‌కాన్ సదస్సు.. కొత్తతరం డెవలపర్లలో నెలకొన్న అనేక సందేహాలకు పరిష్కారాలను సూచించింది. ఆధునిక పరిజ్ఞానం సాయంతో అద్భుతాలను సృష్టించవచ్చని తెల్చిచెప్పింది. నిర్మాణ రంగం ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేస్తామన్న సందేశాన్నిచ్చింది. యువ బిల్డర్ల రంగప్రవేశంతో నిర్మాణాల్లో మొబైల్ యాప్‌ల వినియోగం గణనీయంగా పెరిగింది. వీటి సాయంతో నిర్మాణ పనులు సులువుగా జరుగుతున్నాయి.

తమిళనాడులో రజనీ ఉన్నారు: కేటీఆర్

తమిళనాడుకు చెందిన యువ బిల్డర్ మంత్రి కేటీఆర్‌ను ప్రశంసించారు. 'మీలాంటి వ్యక్తి మా తమిళనాడు రాజకీయాల్లో లేకపోవడం తీరని లోటు. ఆ విషయంలో నాకు కొంత ఈర్ష్యగా ఉంది. మీరు తమిళనాడు రాజకీయాలను టేకోవర్ చేస్తారా?' అని సదస్సులో కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. దీనికి మంత్రి కేటీఆర్ చిరునవ్వుతో స్పందించారు. తమిళనాడులో తమ అవసరం రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. అక్కడి రాజకీయాలను చూసుకునేందుకు రజనీకాంత్ వంటివారున్నారని కేటీఆర్ నవ్వుతూనే సమాధానమిచ్చారు.

టీఆర్టీపై కాంగ్రెస్ కుట్రలు

కాంగ్రెస్‌తో కుమ్మక్కై కోదండరాం విషప్రచారం
టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఉస్మానియా యూనివర్సిటీ: టీఆర్టీ నిర్వహణపై విద్యార్థులు ఆందోళన చెందవద్దని, టీఎస్‌పీఎస్సీ షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయని టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. పరీక్షల నిర్వహణపై కాంగ్రెస్ సహా కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కోరారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం టీచర్ పోస్టులను భర్తీ చేసిందని, ఇప్పుడు అవే నిబంధనల ప్రకారం టీఆర్టీ నిర్వహిస్తే తప్పు ఎలా అవుతుందో కోదండరాం, కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతుంటే కుట్ర ప్రకారం విషబీజాలు నింపాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ అవసరం కోసం ప్రతి విషయాన్ని వాడుకోవడం అధ్యాపకుడిగా కోదండరాంకు తగునా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కై టీఆర్టీపై ఓయూలో సభలు నిర్వహిస్తే విద్యార్థులు అడ్డుకుంటారని హెచ్చరించారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో లక్ష్యానికి దగ్గరవుతుంటే, ఓర్వలేని కాంగ్రెస్, కోదండరాం అనుచరులతో హైకోర్టులో కేసులు వేయించి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

టీఆర్‌ఎస్వీ ఓయూ కమిటీలు రద్దు

టీఆర్‌ఎస్వీ ఉస్మానియా యూనివర్సిటీ కమిటీలు రద్దు చేస్తున్నట్లు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెర్క శ్యాం అధ్యక్షుడిగా ఒక కమిటీ, గదరాజు చందు అధ్యక్షుడిగా మరో కమిటీ ఏర్పడడంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొన్న దృష్ట్యా రెండు కమిటీలను రద్దు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

ప్రభుత్వ ప్రెస్‌లో పాస్ పుస్తకాల ముద్రణ

సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో తెలంగాణ సర్కార్ ఒప్పందం
నాలుగుచోట్ల రోజుకు రెండున్నర లక్షల పాస్‌పుస్తకాల ముద్రణ
మార్చి 11 కల్లా పూర్తికానున్న 70 లక్షల పుస్తకాలు



రైతులకు అందించే కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం నమూనా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ ప్రక్రియ వేగంగా జరుగుతున్నది. మార్చి 11 వరకు 70 లక్షల పాస్ పుస్తకాలు రైతులకు అందించాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర సర్కార్ ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందుకోసం హైదరాబాద్ సహా ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, మహారాష్ట్రలోని నాసిక్, మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో ముద్రణ ప్రారంభించింది. నాలుగు కేంద్రాల్లో రోజుకు రెండున్నర లక్షల పాస్ పుస్తకాలను సిబ్బంది ముద్రిస్తున్నారు. పట్టాదారు పాస్ పుస్తకం ముద్రణ ఎంవోయూకు క్యాబినెట్ సర్క్యులేషన్ పద్ధతిలో ఆమోదం తెలిపినట్టు తెలిసింది. పట్టాదారు పాస్ పుస్తకంపై కాకతీయ తోరణం, చార్మినార్, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, ఎరువులు చల్లుతూ దుక్కి దున్నుతున్న రైతుల చిత్రాలను ప్రచురించనున్నారు. చిరునవ్వులు చిందిస్తున్న రైతు కుటుంబాల మహిళల చిత్రాలను కూడా ముద్రించనున్నారు. పాస్ పుస్తకంపై 'బంగారు తెలంగాణ మన స్వప్నం-మన లక్ష్యం' వంటి నినాదాలు ఉండనున్నాయి. 18 భద్రతా ప్రమాణాలతో పాస్‌పోర్ట్ తరహాలో ముదురు ఆకుపచ్చ రంగులో మొత్తం ఆరు కాలమ్స్‌తో 20 పేజీలుగా పట్టాదారు పాస్‌పుస్తకం ఉండనున్నది. మొత్తం 13 డిజిట్ల యూనిక్ ఐడీలో రాష్ట్రం, గ్రామం, మండలం, జిల్లా కోడ్‌తోపాటు పాస్‌బుక్ నంబర్ ఉంటుంది. ప్రతి పాస్‌పుస్తకం యూనిక్ ఐడీలోని మూడో స్థానంలో రాష్ట్రాన్ని సూచించే విధంగా T అనే ఆంగ్ల అక్షరం ఉండనుండగా, యూనిక్ ఐడీలోని 6 స్థానంలో జిల్లాను సూచించే విధంగా ఆ జిల్లా పేరులోని మొదటి ఆంగ్ల అక్షరం (ఉదాహరణకు కరీంనగర్ అంటే K) ముద్రిస్తారు. ఆధార్ అనుసంధానంతో పాస్‌బుక్‌పై బార్‌కోడ్, క్యూ ఆర్ కోడ్, పట్టాదారు చేతి వేలిముద్రల ఫొటోను ప్రచురిస్తారు.

బోర్డుల పరిధి విస్తరణ ఎందుకు?

- ఉమ్మడి ప్రాజెక్టులు లేని గోదావరిపై బోర్డు నియంత్రణ అవసరం ఏమిటి?
- 15న భేటీలో గట్టిగా ప్రశ్నించనున్న ప్రభుత్వం
- ప్రాజెక్టులవారీ కేటాయింపుల తర్వాతే ప్రతిపాదనపై నిర్ణయం
- కేంద్రానికి స్పష్టం చేయనున్న నీటిపారుదలశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరిపై ఉన్న ప్రాజెక్టులను హడావుడిగా ఆయా నదీ యాజమాన్య బోర్డుల పరిధిలోకి తీసుకురావాలనే ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 15న రెండు రాష్ట్రాలతో కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి నిర్వహించనున్న సమావేశంలో ఈ విషయమై అభ్యంతరం తెలిపేందుకు రాష్ట్ర నీటిపారుదలశాఖ సిద్ధమవుతున్నది. అన్ని ప్రాజెక్టులను బోర్డుల పరిధి తీసుకురావాల్సిన అవసరం, ఈ ప్రతిపాదన వెనుకున్న ముఖ్యోద్దేశం ఏమిటని గట్టిగా ప్రశ్నించనున్నది. ప్రాజెక్టులను బోర్డుల పరిధిలోకి చేర్చడం అనివార్యమైతే ఆ పనిని రెండు నదులనీటిని ప్రాజెక్టులవారీగా కేటాయించిన తరువాతనే చేయాలని, లేకుంటే ఉపయోగం ఉండదని తెలంగాణ మొదటి నుంచి వాదిస్తున్నది. ఇదే వాదనను 15న మరోసారి కేంద్రం ముందు ఉంచనుంది. ఉమ్మడి ప్రాజెక్టులు ఉంటేనే వాటిపై బోర్డుల నియంత్రణ, పర్యవేక్షణ అవసరం ఉంటుంది. గోదావరిపై రెండు రాష్ట్రాలకు అటువంటి ప్రాజెక్టులు లేవు. అటువంటప్పుడు గోదావరిపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులపై బోర్డు పెత్తనానికి ఎందుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

2016 జూన్ 21, 22వ తేదీల్లో జలాల పంపిణీపై కేంద్ర జలవనరులశాఖ నిర్వహించిన సమావేశంలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైందని గుర్తు చేస్తున్నాయి. అన్ని ప్రాజెక్టులను బోర్డుల పరిధిలోకి తీసుకొని సాధించేదేమీ ఉండదని తెలంగాణ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కేడబ్ల్యూడీటీ-2 (బ్రిజేశ్ ట్రిబ్యునల్) విచారణ కొనసాగుతున్నందున మున్ముందు ప్రాజెక్టులవారీ కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నందున ఇప్పుడు బోర్డు పరిధి విస్తృతిపై హడావుడి ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. గోదావరిజలాల్లో తెలంగాణకు 954 టీఎంసీల వాటా ఉన్నా గరిష్ఠంగా 450-500 టీఎంసీలలోపు మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. ఇందువల్ల 450-500 టీఎంసీల నీళ్లు దిగువకు వెళుతున్నాయి. మరోవైపు భద్రాచలం దిగువన శబరినదితోపాటు పరీవాహక ప్రాంతంలో 500 టీఎంసీల వరకు నీళ్లు అందుబాటులో ఉంటున్నాయి. వీటితో ఆంధ్రప్రదేశ్ నీటి అవసరాలు తీరుతున్నాయి. ఈ క్రమంలో గోదావరి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరమే ముందని అంటున్నారు. గతంలో ఇద్దరు సీఎంల సమక్షంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఈ అంశం చర్చకు వచ్చినా కేంద్రం ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోకపోయింది. మళ్లీ ఇప్పుడెందుకు ఈ ఆరాటమని 15వ తేదీ భేటీలో తెలంగాణ సూటిగా ప్రశ్నించనున్నది.

ఆది నుంచీ అదే అక్కసు

కట్టా మీఠా



కట్టా శేఖర్ రెడ్డి

మనసులో గూడుకట్టుకున్న భావాలు ఏదో ఒక బలహీనక్షణంలో బయటపడుతాయి. నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రం విషయంలో తను అనుకున్నది కుండబద్దలు కొట్టినట్టు చెప్పేశారు. తను ఎవరి పక్షమో, అప్పుడు తను ప్రధానిగా ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో కూడా మోదీ చెప్పకనే చెప్పారు. 'పార్లమెంటు తలుపులు మూసి రాష్ట్ర విభజన చేశారు' అన్నాడే కానీ, ఒక ప్రజాస్వామ్య ప్రక్రియను ముందుకు సాగకుండా ఆంధ్ర నాయకత్వం చేసిన వికృత చేష్టలను వేటినీ మోదీ గుర్తుపెట్టుకోలేదు. అన్ని రాజకీయపక్షాలు తెలంగాణ రాష్ట్ర విభజనకు అంగీకరించి చివరి నిమిషంలో మాట మార్చడం గురించి కానీ, దొంగ రాజీనామా బెదిరింపులు కానీ, పార్లమెంటులో విభజన బిల్లుకు అడుగడుగునా అడ్డుపడటం, సభాధ్యక్షులను అవమానించడం, పెప్పర్ స్ప్రేకు దిగడం.. ఇవేవీ నరేంద్ర మోదీ ప్రస్తావించలేదు. రాష్ట్ర విభజన జరుగుతున్న కాలంలో విభజనను వ్యతిరేకించే ఏకైక నినాదం తప్ప, తమ రాష్ట్రానికి కావలసిందేమిటో అడుగని ఆంధ్ర నాయకత్వం గురించి కూడా ఆయన మాట్లాడలేదు. అశాస్త్రీయ విభజన అంటూ మాటిమాటికీ వాపోతున్న మోదీ, బాబు, వారి ఇతర వందిమాగధులకు గుర్తుకురాని విషయమేమంటే, కాంగ్రెస్ విభజన చట్టం రూపొందిస్తున్నప్పుడు, ఇరు ప్రాంతాల-ఇతర పార్టీల నాయకులను క్రమంతప్పకుండా సంప్రదించి, వారి సూచనలను, సలహాలను పరిగణిస్తూనే తయారుచేసింది. ఈ సంప్రదింపుల్లో బీజేపీని కూడా భాగం చేసింది. సహకరించనిది, సమస్యలు సృష్టించింది ఆంధ్రా నాయకత్వమే. 2014 ఎన్నికల ప్రచారంలో కూడా నరేంద్ర మోదీ దాదాపు ఇలాగే మాట్లాడారు. అప్పటికీ ఇప్పటికీ ఆయన మనసులో ఉన్నది అదే. తన నాలుగేండ్ల అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షాన్ని ఆడిపోసుకునే ఏకైక విన్యాసానికి మోదీ దిగారు. ఆ ప్రయత్నంలో భాగంగానే తెలంగాణను దారుణంగా అవమానించారు. నరేంద్ర మోదీ ఆంధ్రకే కాదు, తెలంగాణకూ అన్యాయం చేశారు. విభజన చట్టంలో కాంగ్రెస్ చేసిన తప్పులను వల్లెవేసిన నరేంద్ర మోదీ ఈ నాలుగేండ్లలో తాను చేసింది ఏమిటో కూడా చెప్పి ఉంటే బాగుండేది. విభజన చట్టం అష్టవంకరలతో రూపొందించారని చెప్పిన మోదీ ఈ నాలుగేండ్లలో వాటిని సరిదిద్దడానికి ఎందుకు ప్రయత్నించలేదో చెబితే బాగుండేది. నిజానికి నరేంద్ర మోదీ విభజన చట్టంలోని లోపాలను సరిచేయలేక కాదు. ఇష్టం లేకనే ఇన్ని వేషాలు వేశారని ఇప్పుడు అర్థమవుతున్నది.

నరేంద్ర మోదీ రాజ్యాంగ సవరణలు అవసరమైన విధాన నిర్ణయాలను కూడా అనేకం ఈ నాలుగేండ్లలో తీసుకున్నారు. జన జీవితాలను విపరీతంగా ప్రభావితం చేసిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటివి పార్లమెంటు ఆమోదం పొందాయి. నాలుగు బడ్జెట్‌లు ఆమోదం పొందాయి. పార్లమెంటులో మెజారిటీ లేకపోతే ఇవేవీ ముందుకు సాగేవి కాదు. అంతెందుకు ఎన్డీయే రాగానే గోదావరికి ఆ ఒడ్డు ఈ ఒడ్డున ఏడు మండలాలను తెలంగాణ నుంచి లాగేసి, ఆంధ్రలో విలీనం చేస్తూ చట్టాన్ని తెచ్చింది. మరి అదే మోదీ విభజనను పూర్తిచేయడానికి ఎందుకు పూనుకోలేదు. వాజపేయి మూడు రాష్ట్రాలను ఎటువంటి పేచీలేకుండా గొప్పగా విభజించారని మోదీ చెప్పారు. ఇప్పుడు అదే గొప్పతనాన్ని చాటుకొని మోదీ విభజన చట్టంలోని తప్పిదాలను ఎందుకు సరిచేయలేదు? రెండు ప్రాంతాల ప్రజలకు ఎందుకు మేలు చేయలేదు? తెలంగాణను పూర్తిగా ఎందుకు విస్మరించారు. చట్టంలో ఇచ్చిన ఓ మోస్తరు హామీలను కూడా ఎందుకు అమలు చేయలేదు? విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేసే విషయంలో ఎందుకు నాన్చుతున్నారు. హైకోర్టు విభజన ఎందుకు చేయలేదు? న్యాయాధికారుల విభజన ఎందుకు పూర్తిచేయలేదు? ప్రభుత్వ సిబ్బంది, ప్రభుత్వ కార్పొరేషన్ల సిబ్బంది, రాష్ట్ర యూనివర్సిటీల విభజన ఇంకా రావణకాష్టంలా ఎందుకు కాలుతూనే ఉంది? వాజపేయి మూడు రాష్ట్రాల విభజన చేసినప్పుడు కోర్టుల విభజన ఇలాగే జరిగిందా? విభజన చట్టంలోని లోపాలను సరిచేయడానికి ఈ నాలుగేండ్లు చాలలేదా?

రాజకీయ సుస్థిరతకోసం అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచాలని సూచిస్తే ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదు? రాజ్యాంగ సవరణ చేయకుండానే చట్టంలో సవరణచేసి అమలుచేసే వీలుంది. రాజ్యాంగ సవరణ చేయడానికి కూడా పార్లమెంటులో అవసరమైన రాజకీయ ఏకాభిప్రాయం కూడా ఉంది. ఎన్డీయేతోపాటు ప్రతిపక్షాలు కూడా రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచడాన్ని సమర్థించేవే. అయినా ఎందుకు చొరవ తీసుకోలేదు. అసెంబ్లీ సీట్లను పెంచే విషయంలోనే ఇన్ని డ్రామాలు ఆడిన బీజేపీ కేంద్ర నాయకత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నిర్ణయమే చేయాల్సి వస్తే ఎంత దుర్మార్గంగా వ్యవహరించేదో, ఎవరి మాటలు వినేదో చెప్పనవసరం లేదు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఇక్కడి నుంచి తొలిగించి ఆంధ్రలో కలిపారు. భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. భద్రాచలం నియోజకవర్గంలో మెజార్టీ ప్రజలు తూర్పు గోదావ రి జిల్లాలో ఉన్నారు. వారి ఎమ్మెల్యే ఖమ్మంలో ఉన్నారు. విభజన కారణంగా అక్కడ ఒక రాజ్యాంగ సమస్య ఉత్పన్నమైంది. 2019 ఎన్నికల్లో భద్రాచలంలో ఓటర్ల సంఖ్య చాలా స్వల్పంగా ఉంటుంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరిలో కలిసిన ఏడు మండలాల ప్రజలు తమ ఓటు హక్కును ఎక్కడ ఉపయోగించుకోవాలో తెలియదు. పెద్దపెద్ద సమస్యలు పరిష్కరించినట్టు చెప్పుకునే ఈ అభినవ సర్దారు పటేలుకు ఇంత చిన్న సమస్యను పరిష్కరించడానికి ఎందుకు వీలుపడలేదో బీజేపీ నేతలు చెప్పాలె.

సమైక్య రాష్ట్రంలో సాగునీరు విషయంలో ఎక్కువగా నష్టపోయింది తెలంగాణ. ఆగమేఘాలపై ప్రాజెక్టులు నిర్మించుకోవలసిన అవసరం ఉన్నది తెలంగాణకే. అందుకే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రేయింబవళ్లు వెంటపడి ప్రాజెక్టుల నిర్మాణం చేయిస్తున్నారు. తెలంగాణలో అరువైశాతం భూభాగానికి ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టును గరిష్ఠంగా నీరు ఉపయోగించుకునే విధంగా డిజైను చేసి పనులు జరిపిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని తెలంగాణ చాలాకాలంగా కోరుతున్నది. కేంద్రం నుంచి ఒక్క సానుకూల మాట ఇప్పటివరకు రాలేదు. పైగా తెలంగాణ ప్రజల గుండెల్లో పొడిచే మాటలు మాట్లాడుతున్నారు. తెలుగు నేలపై ఒక సంక్షుభిత వాతావరణం ఏర్పడిన పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే దానిని తొలిగించడానికి ఎంత చొరవ తీసుకోవాల్సి ఉండింది? కానీ మోదీకి అటువంటి స్పందనలేమీ ఉండవని, ఆయన ఫక్తు రాజకీయ నాయకుడని, అమరావతికి మట్టి తెచ్చి ఇచ్చిననాడే అర్థం చేసుకొని ఉండాలి. ఆయన ఈ నాలుగేండ్లూ అదే వైఖరిని ప్రదర్శించారు. పెద్దపెద్ద మాటలు, చాలా చిన్న చేతులు, చేతలు.

నరేంద్ర మోదీ ఈ నాలుగేండ్లలో జనానికి చేసిన మేలు కంటే నష్టమే ఎక్కువని గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ ఎన్నికల్లో వరుసగా ప్రజలు తేల్చి చెబుతూ వచ్చారు. ఆయన ఓటు బలం తగ్గిపోతూ వచ్చింది. దేశాన్ని ఒక స్వేచ్ఛా ప్రజాస్వామిక భావాలతో వర్ధిల్లే సమాజంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయాన్ని, లాభాలను సమకూర్చే ఒక కంపెనీ స్థాయికి మార్చిన ఘనత మోదీకి దక్కుతుంది. ప్రజల ఆర్థిక స్వేచ్ఛపై దాడి జరిగింది. ప్రజలు స్వేచ్ఛగా కనీసం లక్ష రూపాయలు దాచుకోలేని ఒక దుస్థితి వచ్చింది. ఒక అతీతభయాన్ని ప్రజలపై రుద్దారు. మరోవైపు కంపెనీలు, సంపన్నవర్గాలు యథేచ్ఛగా నల్లధనాన్ని, తెల్లధనాన్ని పోగేయగలుగుతున్నాయి. నరేంద్ర మోదీ తలపెట్టిన స్వచ్ఛ ఆర్థిక వ్యవస్థ పేదవాళ్లకే గానీ పెద్దవాళ్లకు కాదన్న భావన జనాలలో వచ్చింది. ఈ వ్యతిరేకతను దారి మళ్లించడానికే అసందర్భ ఆవేశాలు, అనవసర విషయాలపై మోడీ నోరు పారేసుకున్నారు. కానీ జనం దృష్టిమళ్లించడం ప్రతిసారీ సాధ్యమయ్యే పనికాదు.

kattashekar@gmail.com

> సమైక్య రాష్ట్రంలో సాగునీరు విషయంలో ఎక్కువగా నష్టపోయింది తెలంగాణ. ఆగమేఘాలపై ప్రాజెక్టులు నిర్మించుకోవలసిన అవసరం ఉన్నది తెలంగాణకే. అందుకే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రేయింబవళ్లు వెంటపడి ప్రాజెక్టుల నిర్మాణం చేయిస్తున్నారు. తెలంగాణలో అరువైశాతం భూభాగానికి ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టును గరిష్ఠంగా నీరు ఉపయోగించుకునే విధంగా డిజైను చేసి పనులు జరిపిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని తెలంగాణ చాలాకాలంగా కోరుతున్నది. కేంద్రం నుంచి ఒక్క సానుకూల మాట ఇప్పటివరకు రాలేదు. పైగా తెలంగాణ ప్రజల గుండెల్లో పొడిచే మాటలు మాట్లాడుతున్నారు.

శివరాత్రి ఓ మధుర జ్ఞాపకం

జ్ఞాపకాలు



బుద్దా మురళి

శివరాత్రి జాగారానికి ఏం ఏర్పాటుచేస్తున్నారు? ఈ రోజుల్లో ఇలాంటి ప్రశ్న వేస్తే అలా అడిగిన వారిని చిత్రంగా చూడాల్సి వస్తుంది. మరో లోకం నుంచి వచ్చినట్టు చూసినా ఆశ్చర్యం లేదు. ఈ రోజుల్లో ప్రతిరోజు జాగారమే. ప్రత్యేకంగా జాగారం ఏర్పాట్లు ఎందుకు?

కాలం మారింది ఇప్పుడు రాత్రి, పగలు తేడా లేదు. రోజంతా నగరం మేల్కొనే ఉంటున్నది. అయితే టీవీ, లేదంటే ఫోన్‌లో కావలసినవి చూస్తూ రాత్రంతా మెలుకువగానే ఉంటున్నారు. రోజూ జాగారం చేసే ఈ కాలంవారికి నాలుగైదు దశాబ్దాల కిందట ఏడాదికి ఒకరోజు జాగారం చేసేందుకు వారంముందు నుంచి ఏర్పాట్లు చేసుకొనేవారు అంటే వింతగా అనిపించవచ్చు.

దశాబ్దాల కిందట హైదరాబాద్ నగరంలో ఇలా ఉండేది కాదు. తెలంగాణలో పండుగలు ఎక్కువగా సామూహికంగా జరుపుకుంటారు. దీనికి హైదరాబాద్ నగరం మినహాయింపు కాదు. నాలుగైదు దశాబ్దాల కిందట కాలనీలు, అపార్ట్‌మెంట్లు హైదరాబాద్ నగరాన్ని కమ్మేయకముందు అచ్చం గ్రామాల మాదిరిగానే నగరంలో సామూహికంగా పండుగలు జరుపుకొనే ఆనవాయితీ ఉండేది. శివరాత్రి వస్తుందంటే చాలు ముందుగానే జాగారానికి ఏర్పాట్లు జరిగేవి.

ఈ రోజుల్లో వైకుంఠపాళి అంటే తెలుసా అని ఎవరినైనా అడిగితే రాజకీయ విశ్లేషణలో తరచూ కనిపించే పదంగా మాత్రమే తెలిసి ఉండవచ్చు. కానీ అది హైదరాబాద్‌లో ఆ కాలంలో శివరాత్రికి అందరూ ఆడే మెదడుకు పనిచెప్పే ఒక ఆట.

అష్టాచమ్మ, వైకుంఠపాళి, భజనలు, నాటకాలు, పాటలు.. ఇవన్నీ శివరాత్రి రోజున వినిపించే మాటలు, కనిపించే ఆటలు. పెద్దలకు జాగారం ఎలా అనేది ప్రధాన ఆలోచనయితే పిల్లలకు రోజంతా తినకుండా ఉపవాసం ఎలా అనేది అం తకన్నా పెద్ద సమస్య. ఉదయం మార్నింగ్‌షో బడిపంతులు సినిమా చూసి ఆకలి మరిచిపోవడం, అర్ధరాత్రి సుదర్శన్ టాకీస్‌లో నర్తనశాల సినిమా చూడటం బాల్యంలో ఓ మధుర జ్ఞాపకం.

ఆర్టీసీ క్రాస్‌రోడ్ అంటే సినిమా ప్రియులకు స్వర్గధామం. ఇంకా టీవీలు రంగప్రవేశం చేయని ఆ రోజుల్లో వినోదం అంటే సినిమాలే. సినిమాలు చూడాలంటే టాకీసులే శరణ్యం. ఒక్క ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోనే అరడజను సినిమా హాల్స్ ఉండేవి. ఒక సినిమా కాకపోతే ఇంకో సినిమా. ఏదో ఒక సినిమా టికెట్ దొరుకడం గ్యారంటీ అనే బోలెడు నమ్మకంతో చలో ఆర్టీసీ క్రాస్‌రోడ్ అని సినిమా అభిమానులు క్రాస్‌రోడ్ బాట పట్టేవారు.


భోలక్‌పూర్ పెద్ద మసీదు వద్ద ముస్లింల సంఖ్య ఎక్కువ. దగ్గరలో అక్కడక్కడ హిందువులు ఉండేవారు. అపార్ట్‌మెంట్లు లేవు. ఇండిపెండెంట్ ఇళ్లకన్నా దొడ్డి అని ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఖరీదైనవాళ్లు నివసించే వాటిని గేటెడ్ కమ్యూనిటీ అంటున్నారు. అప్పుడు దాదాపు ఒకటి రెండెకరాల్లో దొడ్డి పిలిచే గృహసముదాయాలుండేవి. భోలక్‌పూర్‌లోని పండరయ్య దొడ్డిలో దాదాపు 15 కుటుంబాలు ఉండేవి. దిగువ, మధ్య తరగతి కుటుంబాలు. దగ్గరలో వెంకయ్య గల్లీ. చుట్టుపక్కల హిందువులుండే గల్లీలు. పండుగ వచ్చిందంటే వీరి హడావుడి కనిపించేది. సికింద్రాబాద్, హైదరాబాద్ మధ్యలో ఉండే నగరంలోని నిజంగా నడిబొడ్డు ప్రాంతం భోలాక్‌పూర్‌లో దాదాపు పదెకరాల స్థలంలో చిన్న శివాలయం. దేవునితోట ఈ రోజుకు కూడా ఆక్రమణలకు గురికాకుండా దాదాపు పదెకరాల స్థలం శివాలయానికి ఉండటం విచిత్రం. రంగారెడ్డి అనే స్థానిక భూస్వామి దశాబ్దాల కిందట అక్కడ వ్యవసాయం చేసే రోజుల్లో ఆలయానికి ఆ భూమి విరాళంగా ఇచ్చారు. దేవాదాయశాఖ స్వాధీనం తర్వాత అధికారిక ఆక్రమణ తప్ప ఇప్పటివరకు నగరం నడిబొడ్డులో అత్యంత ఖరీదైన ఆ భూమి ఆక్రమణలకు గురికాకపోవడం దైవ నిర్ణయమేమో అనుకుంటారు స్థానికులు. దేవుని తోటలోని చిన్న శివాలయంలో శివరాత్రి రోజు పూజలు, వెంకయ్య గల్లీ వద్ద శివరాత్రి జాగారం కోసం సినిమా ప్రదర్శన, ఆటపాటలు, నాటకాల ప్రదర్శన ప్రతి ఏటా తప్పనిసరిగా కనిపించే దృశ్యాలు. టీవీ వచ్చేంతవరకు హైదరాబాద్‌లోని బస్తీల్లో ఈ దృశ్యాలు సర్వసాధారణం. విశ్వభారతి యువజన సం ఘం, తొలి హైదరాబాద్ మున్సిపల్ స్థానిక కౌన్సిలర్ శంకర్‌రావు వంటివారు ప్రారంభంలో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. అప్పుడెప్పుడో నాలుగు దశాబ్దాల కిందట రమేష్ అనే వ్యక్తి నాటకంలో సీత వేషం వేస్తే అతన్ని ఇప్పటికీ సీత అనే పిలుస్తారు. తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో ఆ కాలం నాటక సమాజాలు బలంగా ఉన్నా ఎందుకో నాటక సమాజాల చరిత్రలో వీటికి పెద్దగా గుర్తింపు లభించలేదు. ఇంట్లో వైకుంఠపాళి, అష్టా చెమ్మా ఆడేవారు కొందరు. చాలా ముందుగానే రోడ్డుమీద సినిమా సందర్శనకు స్థలం రిజర్వ్ చేసుకొనేవారు కొందరు.

ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక స్లాబ్ విధానం అమలుచేయడం, అదే సమయంలో టీవీల ప్రవేశం మొదలుకావడంతో క్రమంగా టాకీస్‌లకు గడ్డుకాలం మొదలైంది. అప్పటివరకు ఉదయం ఆటలు తక్కువ రేటుతో పాత సినిమాలు ప్రదర్శించేవారు. మూడు షోలు కొత్త సినిమాలు ప్రదర్శించేవారు. శివరాత్రి రోజు జాగారం ఉండేవారి కోసం అర్ధరాత్రి 12.30కి ఒక షో, 3.30కి ప్రత్యేకంగా రెండు షోలు ప్రదర్శించేవారు. అంటే దాదాపు ఉదయం ఆరుగంటల వరకు సినిమా ప్రదర్శన ఉండేది. ఆ విధంగా సినిమా టాకీసులోనే వేలాదిమంది శివరాత్రి జాగారం పూర్తయ్యేది. 1976లో శివరాత్రి రోజున ఒకేరోజు అర్ధరాత్రి దాటాక 3.30కి దీపక్‌లో, సాగర్, శీష్‌మహల్ హైదరాబాద్‌లో, సికింద్రాబాద్‌లో ప్యారడైజ్‌లో ప్రత్యేకంగా పాండవ వనవాసం ప్రదర్శించారు. ఒక సినిమా విడుదలన పాతికేళ్ల తర్వాత ఒక నగరంలో నాలుగు టాకీసుల్లో ప్రదర్శించడం విశేషం. శివరాత్రి రోజున అర్ధరాత్రి ప్రత్యేకంగా ప్రదర్శించే సినిమాల్లో తప్పనిసరి గా నర్తనశాల, శ్రీ సీతారామ కళ్యాణం (సుదర్శన్ 35 ఎం. ఎం.), పాండురంగ మహత్యం, దక్షయజ్ఞం (సుదర్శన్ 70 ఎం.ఎం.) మాయాబజార్, ఎన్టీఆర్ శివాజీ గణేశన్ నటించిన కర్ణ, శ్రీ కృష్ణ విజయం, లవకుశ, శ్రీకృష్ణ పాండవీయం, అక్కినే ని, యస్.వరలక్ష్మి నటించిన సతీసావిత్రి, అక్కినేని, జమున నటించిన శ్రీకృష్ణమాయ, చెంచు లక్ష్మి, శ్రీ సత్యనారాయణ వ్రత మహత్యం వంటి సిని మాలు తప్పనిసరిగాఉండేవి. ఇప్పుడంటే వినాయక మంటపాల్లో కొన్ని ప్రాంతాల్లో రికార్డింగ్ డాన్సులు ప్రదర్శిస్తున్నారుకానీ ఆ రోజుల్లో శివరాత్రి అంటే టాకీసుల్లో ఎక్కువగా పౌరాణిక సినిమాలే ప్రదర్శించేవారు. కొన్ని టాకీసు ల్లో పౌరాణిక సినిమాలు దొరక్కపోతే సాంఘిక సినిమాలు ప్రదర్శించేవారు . జమ్రుద్ వంటి టాకీసుల్లో శివరాత్రి రాత్రి 12:45 కు 'బ్రహ్మ విష్ణు మహేష్' వంటి హిందీ పౌరాణిక సినిమాలు ప్రదర్శించేవారు.

వైకుంఠపాళిలో పాము పెద్ద ప్రమాదం. దాన్ని తప్పించుకొంటూ వైకుంఠం వరకు వెళ్ళాలి. వైకుంఠపాళిలో పాము బారిన పడ్డట్టుగానే స్లాబ్ సిస్టం సినిమా హాళ్లను మింగేసింది. నాగరికత హైదరాబాద్ బస్తీల్లోని సామూహిక పండుగల సంస్కృతిని మింగేసింది. ఇంట్లో అందరూ కలిసి పండుగ జరుపుకొంటే ఈ రోజుల్లో అదే సామూహికంగా పండుగ జరుపుకోవడం.


(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)

> ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక స్లాబ్ విధానం అమలుచేయడం, అదే సమయంలో టీవీల ప్రవేశం మొదలుకావడంతో క్రమంగా టాకీస్‌లకు గడ్డుకాలం మొదలైంది. అప్పటివరకు ఉదయం ఆటలు తక్కువ రేటుతో పాత సినిమాలు ప్రదర్శించేవారు. మూడు షోలు కొత్త సినిమాలు ప్రదర్శించేవారు. శివరాత్రి రోజు జాగారం ఉండేవారి కోసం అర్ధరాత్రి 12.30కి ఒక షో, 3.30కి ప్రత్యేకంగా రెండు షోలు ప్రదర్శించేవారు. అంటే దాదాపు ఉదయం ఆరుగంటల వరకు సినిమా ప్రదర్శన ఉండేది. ఆ విధంగా సినిమా టాకీసులోనే వేలాదిమంది శివరాత్రి జాగారం పూర్తయ్యేది.



మన దేశంలో పంట నుంచి కంచానికి చేరేసరికి చాలా తేడా ఏర్పడుతున్నది. ఈ తేడా ధరలకు, సాంకేతికతకు సంబంధించే కాదు. న్యాయానికి సంబంధించినది. మారుమూల పొలాల్లో కష్టిస్తున్న తోటి పౌరులకు ఒక సమాజంగా మనం అందించవలసిన న్యాయానికి సంబంధించినది.

రామ్‌నాథ్ కోవింద్



రాజ్యాంగంలోని ఆశయాలు, లక్ష్యాలు ఎంతో ఉదాత్తమైనవి, ఉన్నతమైనవి. అయితే వాటికోసం ప్రజలు నిరంతర పోరాటం చేయాలి. సమాజం సరైన దిశలో ప్రయాణించాలంటే ప్రజలను చైతన్యపర్చాలి.

సుధీంద్ర కులకర్ణి



బీజేపీ ఏలుబడిలోని కొత్త భారతంలో మహిళలు పెద్దగా నవ్వరాదు, అసమ్మతిని వ్యక్తం చేయకూడదు, ఇష్టంవచ్చిన దుస్తులను ధరించరాదు, రాత్రిపూట ఇంటి నుంచి కాలు బయట పెట్టరాదు. ఇదేనా మహిళా సాధికారత గురించి మన నేతలు చెబుతున్నది?.

ప్రియాంక చతుర్వేది



ప్రపంచ బ్యాంకు మాజీ చీఫ్ ఆర్థికవేత్త డాక్టర్ కౌశిక్ బసు భారత వృద్ధిరేటు గత 30 ఏండ్ల కిందటి సగటుకన్నా తక్కువ ఉన్నదని అంటున్నారు. కానీ మన ఆర్థిక మంత్రి మాత్రం మన వృద్ధి బాగా ఉన్నదంటున్నారు.

పి.చిదంబరం

హక్కులకు 'మాలిమత్' ముప్పు

న్యాయం



మంగారి రాజేందర్

నేర న్యాయవ్యవస్థ ప్రక్షాళన కోసం అద్వానీ కేంద్ర హోంశాఖామంత్రిగా ఉన్నప్పుడు న్యాయమూర్తి మాలిమత్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేశారు. 2003 సంవత్సరంలో ఆ కమిటీ తన సిఫా ర్సులను ప్రభుత్వానికి అందజేసింది. తక్కువ మంది నేరస్తులకు శిక్షలు పడటం, కేసుల విచారణల్లో జాప్యం అన్న రెండు అంశాలు నేరన్యాయ వ్యవస్థను పట్టిపీడిస్తున్నాయని కమిటీ గుర్తించి వాటిని తగ్గించుట సంస్కరించడానికి అవసరమైన సూచనలను చేసింది. అయితే ఆ సూచనలు చాలావరకు నేర న్యాయవ్యవస్థ మౌలిక రూపురే ఖలను మార్చేవిధంగా వుండటం వల్ల ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల ప్రభుత్వం స్వీకరించలేదు. అయితే ఇప్పు డు ప్రభుత్వం ఆ సిఫార్సులను తిరిగి పరిశీలిస్తుందన్న వార్తలు పత్రికల్లో వచ్చాయి. ఇది ఆందోళన కలిగిస్తున్న విషయం.

కమిటీ సిఫారసు చేసిన చాలా సూచనలు మన నేర న్యాయవ్యవస్థ జ్యూరిస్ ప్రుడెన్స్‌కు విరుద్ధం. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నేర న్యాయ మౌలిక సూత్రాలకు విరుద్ధం. ఆ సిఫారసులను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న అంశం నేరన్యాయ వ్యవస్థలో సంబంధం ఉన్న వ్యక్తులను కలిచివేస్తున్నది.

నేర నిరూపణ జరిగే వరకు ముద్దాయిని అమాయకుడిగా పరిగణించాలి. నేర నిరూపణ భారం ప్రాసిక్యూషన్‌పై ఉంటుంది. ఈ విషయాన్ని మెల్లగా ముద్దాయిపైకి తోసేవిధంగా మాలిమత్ కమిటీ సిఫారసు చేసింది. దానివల్ల క్రిమినల్ జ్యూరిస్ ప్రుడెన్స్‌కు తీవ్రమైన విఘాతం కలుగుతుంది. పోలీసుల దర్యాప్తులు ఇప్పుడే అంతంత మాత్రంగా వున్నాయి. ఈ రకంగా నిబంధనలు వస్తే పోలీసులు, ఆ మాటకొస్తే సీబీఐ కూడా దర్యాప్తులో శ్రమించదు.

సాధ్యమైనంత త్వరగా కేసు దర్యాప్తును పోలీసులు ముగించాలి. 24 గంటల కాలంలో దర్యాప్తు పూర్తికానప్పుడు 15 రోజుల్లో పూర్తి చేయాలి. అందుకే ముద్దాయిలను జ్యుడీషియల్ కస్టడీలో వుంచుతా రు. తీవ్రమైన నేరాల్లో 90 రోజులలోగా, ఇతర కేసుల్లో 60 రోజు ల్లోగా కేసు దర్యాప్తులు పోలీసులు పూర్తిచేయాలి. అలా చేయనప్పుడు ముద్దాయిని తప్పనిసరిగా బెయిల్ మీద విడుదల చేయాల్సి వుంటుంది. ఈ నిర్బంధ కాలపరిమితిని మొదటి 15 రోజుల నుంచి 30 రోజులవరకు, 90 రోజుల నుంచి 180 రోజుల వరకు పెంచాలని మాలిమత్ కమిటీ సూచించింది. ఇది అంతర్జాతీయ ప్రమాణాలకు విరుద్ధం. అంతేకాదు ఈ సూచనలు అమల్లోకి వస్తే పోలీసుల శ్రద్ధ కేసుల దర్యాప్తులో పూర్తిగా తగ్గే అవకాశం ఉంది. అమాయకులు అనవసరంగా జైల్లో మగ్గే పరిస్థితి ఏర్పడుతుంది. వచ్చిన సాక్ష్యాలకు ముద్దాయు జవాబు చెప్పుకునే అవకాశాన్ని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో సె.313 కల్పిస్తుంది. ఈ నిబంధన ప్రకారం కోర్టు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ముద్దాయి మౌనంగా వుండవచ్చు. మౌనంగా వున్నంతమాత్రాన అతనికి వ్యతిరేకంగా కోర్టు ఎలాంటి భావనకు రావడానికి వీల్లేదు. అదేవిధంగా పోలీసులు ముద్దాయిని ప్రశ్నిస్తున్నప్పుడు కూడా ముద్దాయి మౌనంగా వుండవచ్చు. ఇది రాజ్యాంగంలోని అధికరణ 20 (3) ప్రకారం ముద్దాయికి వచ్చిన రాజ్యాంగపు హక్కు. ఈ నిబంధనలకు వ్యతి రేకంగా సవరణలు చేయాలని మాలిమత్ కమిటీ సూచించింది. అప్పుడు ముద్దాయి మౌనంగా వుంటే అతనికి వ్యతిరేకంగా భావనలను స్వీకరించే అవకాశం ఏర్పడుతుంది. మౌలిక న్యాయసూత్రాలకు, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు ఇది విరుద్ధం.

ఇవి అన్నింటికన్నా ముఖ్యమైన మార్పును భారతీయ సాక్ష్యాధారాల చట్టంలోని నిబంధన 25కు కమిటీ సూచించింది. పోలీసుల ముందు ముద్దాయి నేరం అంగీకరిస్తే అది ఆమోదయోగ్యం కాదు. ఈ రక్షణ ముద్దాయికి వున్నప్పుడే ముద్దాయి పోలీసుల చేతుల్లో చిత్ర హింసలకు గురి అవుతున్నాడు. పోలీసులు సూపరింటెండెంట్ ముందు నేరం అంగీకరిస్తే అది ఆమోదయోగ్యం చేయాలని కమిటీ సూచించింది. అప్పుడు ముద్దాయి తన న్యాయవాదితో సంభాషించుకునే వెసులుబాటును కూడా సూచించింది. ఈ నిబంధన అమల్లోకి వస్తే పోలీసులు కేసులను దర్యాప్తు చేయకుండా, నేరాంగీకారాలను నమోదుచేసి చేతులు జరుపుకునే దిశ గా ప్రయత్నాలు చేస్తారు. సెక్షన్ 23 ఉన్నప్పుడే పరిస్థితి ఈ విధంగా ఉంది. దీన్ని ఆమోదయోగ్యం చేస్తే పరిస్థితి భయంకరంగా మారిపోతుంది.

నేరాల దర్యాప్తు సత్వరంగా ముగించాలన్న తొందరలో శాస్త్రీయ దర్యాప్తులకు వెళ్లకుండా పోలీసులు అడ్డదారుల్లో ప్రయాణం చేస్తున్నారు. తామేం చేసినా ఏమీ కాదన్న భరోసాలో పోలీసులు ఉన్నారు. ఈ విషయాన్ని బలీయంగా చెప్పడానికి ఎన్నో ఉదా హరణలు చెప్పవచ్చు. ఆరుషి, తల్వార్-హేమరాజ్ కేసు నుంచి మొన్నటి బస్సు కండక్టర్ కేసువరకు ఎన్నో ఉదాహరణలు. మన రాష్ట్రంలో కూడా ఎన్నో కేసులను ఉదహరించవచ్చు. ఈ మధ్య పత్రికల్లో ప్రముఖంగా కన్పించిన రేయాన్ స్కూల్ హత్యకేసును ప్రస్తావిస్తాను.

ప్రద్యుమ్న అనే పదేండ్ల కుర్రవాడు రేయాన్ అంతర్జాతీయ స్కూల్‌లోని టాయిలెట్ రూంలో హత్యకావించబడినాడు. ఆ వార్త కార్చిచ్చులా వ్యాపించింది. దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. పోలీసుల మీద ఒత్తిడి పెరిగిపోయింది. స్కూల్ బస్ కండక్టర్ అంతకు ముందు అదే టాయిలెట్‌లోకి వెళ్లివచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. దాంతో అతన్ని అనుమానించి, ఆ కుర్రవాడిని లైంగికంగా వేధించి హత్యచేశాడని అతన్ని ఘోరమైన చిత్రహింసలకు పోలీసులు గురిచేశారు. బాధితుడి భాషలో చెప్పాలంటే అతని కాళ్లను, చేతులను ఇనుప గొలుసులతో బంధించి ఎలక్ట్రిక్ షాకులకు గురిచేశారు. ఓ చీకటి గదిలో బంధించారు. అతని బట్టలు వూడదీసి, తలకిందులుగా వేలాడదీసి చిత్రహింసలకు గురిచేశారు. అతను స్పృహ కోల్పేయేంత వరకు చిత్రహింసలకు గురిచేశారు. ఆ తర్వాత కూడా చిత్రహింసల పాలుచేశారు. బస్ కండక్టరే హత్య చేశాడని మీడియాకు తెలియజేశారు. అతని నేరాంగీకారం (confesson) ఆధారంగా కత్తిని కూడా జప్తు చేశారు. మరిగే నీటిలో చేతులు పెట్టించడం లాంటి మరెన్నో చిత్రహింసలకు అతన్ని గురిచేసి చివరకు కోర్టు ముందు ప్రవేశపెట్టారు.

బస్ కండక్టర్ హత్య చేశాడన్న ఆరోపణను ప్రద్యుమ్న తల్లిదండ్రులు నమ్మలేదు. చివరకు వాళ్ళ ఒత్తిడివల్ల సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. సీసీటీవీ ఫుటేజీ ప్రకారం బస్ కండక్టర్ కుమార్ కన్నా ముందు అదే స్కూలుకు చెందిన మరో విద్యార్థి టాయ్‌లెట్‌లోకి వెళ్ళినట్టుగా ఆధారం దొరికింది. బస్ కండక్టర్ టాయ్‌లెట్‌లోకి వెళ్లినప్పుడు ఆ విద్యార్థి ప్రద్యుమ్నని క్యూబిక్‌లోకి తీసుకొని వెళ్లాడు. అందువల్ల వాళ్ళిద్దరినీ బస్ కండక్టర్ కుమార్ చూడలేకపోయాడు. ఈ సీసీ ఫుటేజీని హర్యానా పోలీసులు జాగ్రత్తగా పరిశీలించకుండా బస్ కండక్టర్‌ను చిత్రహింసల పాల్జేసి రిమాండ్‌కు పంపించారు.

సీబీఐ దర్యాప్తులో ఈ విషయాలన్నీ తేటతెల్లమయ్యాయి. పరీక్ష వాయిదా వేయించడం కోసం తోటి విద్యార్థి ప్రద్యుమ్నని మరో విద్యార్థి హత్య చేశాడు. సీబీఐ దర్యాప్తు ప్రకారం బస్ కండక్టర్ అమాయకుడు. అతనికి నేరంతో సంబంధం లేదు. సె.25 లాంటి నిబంధనలు వున్నప్పుడే ఇలాంటి చిత్రహింసలు జరుగుతున్నాయి. పోలీసుల ముందు నేరాంగీకారం ఆమోదయోగ్యం అయితే పరిస్థితి ఎలా వుంటుందో ఊహించుకోవచ్చు.

సుప్రీంకోర్టు ఈ విషయాలను గమనించి కర్తార్‌సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో ఈ రకంగా అభిప్రాయపడింది.

'...బార్‌లో, బెంచి మీద వున్న అనుభవం ప్రకారం పోలీసుల అరాచకాల గురించి ఎన్నో కథలను చూశాం. అమానవీయ అనాగరిక, పురాతన పద్ధతులతో అనుమానితులను చిత్రహింసలకు గురిచేసి కొందరు పోలీసులు సాక్ష్యాలను సేకరిస్తున్నారు.

పోలీసులకు జవాబుదారీతనం కోసం తగు నిబంధనలు చేయకుండా, ఎలాంటి నిబంధనలు చేయకూడదు. చేస్తే అవి అనర్థం వైపు దారితీస్తాయి. మాలిమత్ కమిటీ సిఫారసులను అమలుచేస్తే పరిస్థితి మరింత దారుణంగా వుంటుంది. పోలీసుల నైపుణ్యం పెంపొందించేందుకు ఎన్ని అకాడమీలను ఏర్పాటుచేసినా ఫలితం ఉండదు.

(వ్యాసకర్త: కవి, రచయిత)

> నేరాల దర్యాప్తు సత్వరంగా ముగించాలన్న తొందరలో శాస్త్రీయ దర్యాప్తులకు వెళ్లకుండా పోలీసులు అడ్డదారుల్లో ప్రయాణం చేస్తున్నారు. తాము ఏమి చేసినా ఏమీ కాదన్న భరోసాలో పోలీసులు ఉన్నారు. ఈ విషయాన్ని బలీయంగా చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు. ఆరుషి, తల్వార్-హేమరాజ్ కేసు నుంచి మొన్నటి బస్సు కండక్టర్ కేసు వరకు ఎన్నో ఉదాహరణలు. మన రాష్ట్రంలో కూడా ఎన్నో కేసులను ఉదహరించవచ్చు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2332 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఘోరమైన రోగి.. మంచి వైద్యుడి సలహా వినడు



ఎన్డీయే ప్రభుత్వం మంచి వైద్యుడి మాట వినేందుకు ఇష్టపడని ఘోరమైన రోగిలా ఉన్నది. బీజేపీ హయాంలో గొప్ప ప్రకటనలు, అద్భుత పథకాలు అని చెప్పుకోవడమే తప్ప.. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఉపాధిరంగాల్లో ఎలాంటి వృద్ధిలేదు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని క్రమంగా పెంచుతూ ప్రభుత్వం ప్రజల రక్తం తాగుతున్నది. ఎన్డీయే ప్రభుత్వం ఆక్స్‌ఫర్ ఇంగ్లిష్ డిక్షనరీకి 'జుమ్లా'(జిమ్మిక్కు, గారడీ) అనే కొత్త పదాన్ని అందించనుంది.

- మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం
(రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ శనివారం కొచ్చిలో నిర్వహించిన సదస్సులో..)


అమ్మాయిలూ బీర్లు తాగడం.. భయమేస్తుంది



అమ్మాయిలు కూడా బీర్ తాగడం ప్రారంభించడంతో నాకు భయమేస్తున్నది. సహనం పరిమితి దాటిపోతున్నది. నేను అందరి గురించి మాట్లాడడం లేదు. ఎవరైతే ఇక్కడ కూర్చున్నారో వారి గురించి కూడా మాట్లాడడంలేదు. గోవాలో డ్రగ్స్ వ్యాపారం నివారణకు పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డ్రగ్స్ విక్రయిస్తున్న 170 మందిని అరెస్టుచేశాం. అంతమాత్రాన డ్రగ్స్ వ్యాపారం సున్నా శాతానికి చేరుకుంటుందని నేను నమ్మడంలేదు. తక్కువ మోతాదులో డ్రగ్స్ తీసుకున్న వారికి చట్టం ప్రకారం 15 రోజులు లేదా నెలలోపు బెయిల్ వస్తున్నది. కనీసం వారికి అపరాధభావం కలుగాలని పట్టుకుంటున్నాం.

- యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో గోవా సీఎం మనోహర్ పారికర్

గోవాను మరో హర్యానాలా మారుస్తున్న ఉత్తరభారతీయులు



ఉత్తరభారతీయులు గోవాను హర్యానాలా మార్చుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి పర్యాటకులు గోవా పట్టణాన్ని చెత్తబుట్టలా తయారు చేస్తున్నారు. గోవాలో కాలుష్యాన్ని నియంత్రించడానికి సరైన యంత్రాంగం లేదు. అలాంటప్పుడు 1.2 కోట్ల పర్యాటకులను అనుమతించాలన్న ప్రభుత్వనిర్ణయం సరికాదు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు గోవాను శుభ్రంగా ఉంచడం లేదు. వారుచేసే కాలుష్యాన్ని నిర్మూలించడం కష్టతరంగా మారింది. బహుశా గోవాను మరో గురుగ్రామ్ చేయాలని వారు భావిస్తున్నట్టున్నారు.

- బిజినెస్ ఫెస్టివల్ కార్యక్రమంలో గోవా మంత్రి విజయ్ సర్దేశాయ్

ఔరంగజేబు ఉగ్రవాది



మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఉగ్రవాది. కానీ ఆయన అన్న దారాషికో మంచివాడు. ఇస్లాం విలువలతో జీవనం సాగించిన వ్యక్తి. ఈ విషయం నచ్చకే ఔరంగజేబు 1659లో సోదరుడిని హతమార్చాడు. అందుకే ఔరంగజేబుతోపాటు దారాషికో జీవితాన్నీ పాఠ్యాంశాల్లో చేర్చాలి. ఢిల్లీలోని ల్యూటెన్స్ రోడ్డుకు ఉన్న క్రూర రాజు ఔరంగజేబు పేరు ఉండటాన్ని తట్టుకోలేకపోయా. ఆ పేరు మార్చాలంటూ నేను కేంద్రానికి ప్రతిపాదించడం వల్లే ప్రభుత్వం ఆ రోడ్డుకు 2015లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరును పెట్టింది. ఈ విషయంలో కొన్ని బెదిరింపులనూ నేను ఎదుర్కొన్నాను.

-బీజేపీ ఎంపీ మహేశ్ గిరి



ప్రధాని నరేంద్రమోదీ యూఏఈ పర్యటన సందర్భంగా త్రివర్ణ కాంతుల్లో మెరిసిపోతున్న దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా టవర్

ఆర్మీ శిబిరంపై ఆత్మాహుతి దాడి

జమ్ములో మరోసారి రెచ్చిపోయిన జైషే మొహమ్మద్ ■ ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి
ఓ కల్నల్, సైనికాధికారి కూతురు సహా ఆరుగురికి గాయాలు ■ ఎదురు కాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులు హతం.. కొనసాగుతున్న ఆపరేషన్
అఫ్జల్‌గురు వర్ధంతి రోజే ఉగ్రపంజా ■ సైన్యం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నది: హోంమంత్రి రాజ్‌నాథ్



ఉగ్రవాదులు తలదాచుకున్న ఆర్మీ క్వార్టర్స్‌ను చుట్టుముట్టిన భద్రతా బలగాలు.. ఇన్‌సెట్లో మృతిచెందిన ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. సుంజ్వాన్‌లోని భారత ఆర్మీ శిబిరంపై శనివారం దాడికి పాల్పడ్డారు. ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో పాఠశాలకు వెళ్తున్న ఆర్మీ అధికారి కూతురు, ఓ కల్నల్‌స్థాయి అధికారి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు జైషే ఉగ్రవాదులు హతమయ్యారు. ఫిబ్రవరి 9న అఫ్జల్‌గురుకు ఉరిశిక్ష వేసిన రోజు కాబట్టి ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశముందని నిఘా వర్గాలు ముందే హెచ్చరించాయి. అయితే దక్షిణ కశ్మీర్‌ను ఉగ్రవాదులు ఎంచుకుంటారని అనుమానించగా, అందుకు భిన్నంగా వారు జమ్మును లక్ష్యంగా చేసుకున్నారు. పాకిస్థాన్‌లోని జైషే మొహమ్మద్‌కు చెందిన 'అఫ్జల్‌గురు స్క్వాడ్' ఈ దాడికి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి సిద్ధమై వచ్చారని ఆర్మీ అధికారులు అనుమానిస్తున్నారు. మరికొందరు టెర్రరిస్టులు కూడా ఉండవచ్చని భావిస్తున్న సైన్యం వారికోసం అణువణువూ గాలిస్తున్నది.

జమ్ము-పఠాన్‌కోట్‌పై ఉన్న 36బ్రిగేడ్ ఆర్మీ క్యాంప్ అంతర్జాతీయ సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉన్నది. శనివారం తెల్లవారుజామున ఆర్మీ క్యాంప్ వెనుకవైపున ఉన్న సైనికుల క్వార్టర్స్ వైపు నుంచి ఉగ్రవాదులు ప్రవేశించారు. క్వార్టర్స్ వద్ద విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల దాడిలో ఇద్దరు ఆర్మీ జూనియర్ కమిషన్డ్ అధికారులు (జేసీవోలు) మృతిచెందగా, మరో ఆరుగురు గాయపడినట్లు జమ్ముకశ్మీర్ రాష్ట్ర మంత్రి అబ్దుల్ రెహమాన్ వీరి వెల్లడించారు. ఉగ్రదాడిలో సుబేదార్ మగన్‌లాల్, సుబేదార్ మహమ్మద్ అష్రఫ్ అమరులైనట్లు ఆయన రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆర్మీ కల్నల్ రోహిత్ సోలంకి, హవల్దార్ అబ్దుల్ హమీద్, లాన్స్‌నాయక్ బహదూర్‌సింగ్, మరో జవాన్ తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. పాఠశాలలో చదువుకుంటూ సెలవుల్లో కుటుంబాన్ని చూసేందుకు వచ్చిన ఆర్మీ అధికారి మదన్‌లాల్ చౌదరి కూతురు, నలుగురు మహిళలు కూడా ఈ కాల్పుల్లో గాయపడ్డారని వెల్లడించారు. దాడి అనంతరం నిర్వహించిన ఆపరేషన్‌లో భద్రతాబలగాలు ఇద్దరు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టాయని ఆర్మీ అధికారులు వెల్లడించారు. వారి నుంచి ఒక ఏకే-47, మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. క్యాంప్ పరిసరాల్లో మరో ఇద్దరు ఉగ్రవాదులు ఉండొచ్చని, వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని ఆర్మీ ప్రజాసంబంధాల అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ వెల్లడించారు. 'తెల్లవారుజామున 4:55 గంటల ప్రాంతంలో అనుమానాస్పద కదలికలను సెంట్రీ గుర్తించారు. ఆయన అప్రమత్తమయ్యేలోపే వారు కాల్పులు ప్రారంభించారు. సెంట్రీ బంకర్‌ను పేల్చేసి లోపలికి ప్రవేశించారు' అని జమ్ము పోలీస్ ఐజీ ఎస్డీ సింగ్ చెప్పారు. సైన్యం రంగంలోకి దిగి ఆర్మీ క్వార్టర్స్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంది. ముందుజాగ్రత్త చర్యగా ఘటనాస్థలానికి 5కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలన్నింటినీ మూసివేశారు. రంగంలోకి దిగిన వాయుసేన.. ప్రత్యేక పారాకమెండోలను హెలికాప్టర్ల ద్వారా ఆర్మీక్యాంప్‌లోకి దింపింది. 'అక్కడ అనేక కుటుంబాలున్నాయి. అందుకే సైన్యం చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నది. 150వరకు ఇండ్లను ఒక్కొక్కటిగా ఖాళీ చేయించాం' అని ఆర్మీ అధికారి ఒకరు వెల్లడించారు. 2003లోనూ ఉగ్రవాదులు ఇదే ఆర్మీ క్యాంప్‌పై దాడిచేశారు. అప్పుడు జరిగిన కాల్పుల్లో 12మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

భారతీయుడిని తలదించనీయం : హోంమంత్రి

సైన్యం సమర్థవంతంగా వ్యవహరిస్తున్నదని, ఏ ఒక్క భారతీయుడినీ తలదించనీయమని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. జమ్మూలో ఉగ్రదాడికి సంబంధించి ఆర్మీ ఆపరేషన్ కొనసాగుతున్నందున దానిపై తానేమీ మాట్లాడబోనని అన్నారు. సైన్యం, భద్రతాబలగాలు తమ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. సుంజ్వాన్ ఉగ్రదాడి ఘటనపై కశ్మీర్ డీజీపీకి రాజ్‌నాథ్ ఫోన్‌చేసి ఆరా తీశారు. మరోవైపు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఉగ్రదాడిని ఖండించారు. ఉగ్రవాదులను భారత్‌కు పంపడం మానుకోవాలని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా పాకిస్థాన్‌కు హితవు పలికారు.

భద్రతా బలగాలే లక్ష్యంగా ఏడుసార్లు దాడి..

11నెలల కాలంలో జరిగిన దాడులు

2018 జనవరి 15: జైషే ఉగ్రవాదుల చొరబాట్లను భారత్ విజయవంతంగా అడ్డుకుంది. ఐదుగురు సభ్యుల ఆత్మాహుతి దళాన్ని భారత సైన్యం మట్టుపెట్టింది.

2017 డిసెంబర్ 31: పుల్వామాలో తొలిసారిగా స్థానిక ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడి, ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు హతమయ్యారు.

డిసెంబర్ 4: ఆర్మీ కాన్వాయిపై ఉగ్రవాదుల కాల్పులు.. ఒక జవాన్ హత, మరొకరికి గాయాలు

అక్టోబర్ 10: అరుణాచల్‌ప్రదేశ్‌లోని నియావుసా వద్ద ఆర్మీపై ఎన్ఎస్సీఎన్(కే) తీవ్రవాదుల దాడి

జూన్ 3: కుల్గాం జిల్లాలో మిలటరీ కాన్వాయిపై ఉగ్రవాదుల ఆకస్మిక దాడి.. ఇద్దరు జవాన్లు మృతి

మే 4: షోపియాన్ జిల్లాలో ఆర్మీ కాన్వాయిపై ఉగ్రవాదుల దాడి, ఓ పౌరుడు మృతిచెందగా, ముగ్గురికి గాయాలు

ఏప్రిల్ 27: కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ సహా ముగ్గురు సైనికులు మృతి. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన భద్రతాదళాలు.

స్వతంత్ర పాలస్తీనాకు భారత్ అండ

- రమల్లా పర్యటనలో ప్రధాని మోదీ
- పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో సుదీర్ఘ చర్చలు
- ఇజ్రాయెల్‌తో భారత్ మధ్యవర్తిత్వానికి పాలస్తీనా విజ్ఞప్తి
- యూఏఈ యువరాజుతో ప్రధాని భేటీ.. కీలక ఒప్పందాలు ఖరారు

రమల్లా/అబుదాబి, ఫిబ్రవరి 10: స్వతంత్ర, సర్వసత్తాక పాలస్తీనాను భారత్ సమర్థిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. పాలస్తీనా ప్రజల ప్రయోజనాలకు భారత్ కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో చర్చల అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనాలో మళ్లీ శాంతి నెలకొనాలని భారత్ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నదని ప్రధాని మోదీ చెప్పారు. అది అంత సులభం కాదని, అయినప్పటికీ శాయశక్తులా కృషిని కొనసాగించాల్సి ఉందని అన్నారు. అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ, పాలస్తీనాలో శాంతికి భారత నాయకత్వం ఎప్పుడూ కట్టుబడి ఉన్నదని అన్నారు. స్వతంత్ర రాజ్యం కోసం చర్చలు జరిపేందుకు పాలస్తీనా ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నదని, ఇజ్రాయెల్‌తో శాంతి ప్రయత్నాలకు భారత్ తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఉభయపక్షాల మధ్య తుదిఒప్పందం కుదిర్చేందుకు బహుళపక్ష వేదిక ఏర్పాటులో భారత్ సహకారాన్ని ఆయన అర్థించారు. 'అంతర్జాతీయంగా గొప్ప పలుకుబడి కలిగిన దేశంగా భారత్ నిర్వహించే పాత్రపై మేం ఆధారపడుతాం. అలీనోద్యమంలో, అంతర్జాతీయ వేదికలపై భారత్ నిర్వహించిన చరిత్రాత్మకమైన పాత్రను గౌరవిస్తాం. పెరుగుతున్న భారత్ వ్యూహాత్మక, ఆర్థికశక్తి ప్రాంతీయ అభివృద్ధికి, శాంతికి సానుకూలమని భావిస్తాం' అని అబ్బాస్ అన్నారు. అంతకుముందు అధికార పర్యటనపై రమల్లా చేరుకున్న ప్రధాని మోదీకి పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రధాని మోదీ తనదైన రీతిలో అబ్బాస్‌ను ఆలింగనం చేసుకున్నారు. స్వతంత్ర పాలస్తీనా ఉద్యమ పితామహుడు యాసర్ అరాఫత్ సమాధిని, ఆయన పేరిటన నెలకొల్పిన మ్యూజియంను ప్రధాని సందర్శించారు. భారత ప్రధాని పాలస్తీనాలో అధికారిక పర్యటన జరుపడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ప్రధాని మోదీని అబ్బాస్ విదేశీయులకు పాలస్తీనా ఇచ్చే అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ కాలర్ ప్రదానం చేశారు. అంతకుముందు ఇరుదేశాల ప్రతినిధివర్గాల మధ్య విస్తృతస్థాయి చర్చలు జరిగాయి. 5 కోట్ల అమెరికా డాలర్లమేర (సుమారు రూ.340 కోట్లు) పలు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. మూడుకోట్ల డాలర్లతో (సుమారు రూ.204 కోట్లు) పాలస్తీనాలోని బేత్ సహూర్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం ఇందులో ముఖ్యమైనది. జెరూసలేంను ఇజ్రాయెల్ అధికారిక రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని భారత్ సమర్థించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్, పాలస్తీనా స్వతంత్ర రాజ్యాలుగా కలిసిమెలిసి మనుగడ సాగించాలనే రెండు రాజ్యాల సిద్ధాంతాన్ని భారత్ సమర్థిస్తున్నది.

అబుదాబీతో చమురు రంగంలో కీలక ఒప్పందం

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో చమురు రంగంలో భారత్ చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నది. యూఏఈ ఆఫ్‌షోర్ లోయర్ జకూమ్ చమురు పరిశ్రమలో భారత్‌కు పదిశాతం వాటా కల్పించే కీలక ఒప్పందంపై ఉభయదేశాలు ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా సంతకాలు చేశాయి. ప్రధాని యూఏఈ పర్యటన సందర్భంగా శనివారం మొత్తం ఐదు కీలక ఒప్పందాలు కుదిరాయి. పాలస్తీనా నుంచి జోర్డాన్ మీదుగా అబుధాబీ చేరుకున్న మోదీకి విమానాశ్రయంలో ఆయనకు అబుధాబీ సింహాసన ఉత్తరాధికారి అయిన యువరాజు మహమ్మద్ బిన్ జాయెద్ అల్‌నాయాన్ సాదర స్వాగతం పలికారు. తర్వాత నేతలిద్దరూ ద్వైపాక్షిక అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. చమురు రంగ వాటాకు సంబంధించిన ఒప్పందంపై ఓవీఎల్, బీపీఆర్ఎల్, ఐఓసీఎల్‌తో కూడిన కన్సార్షియం, అబూధాబీ జాతీయ చమురు కంపెనీ (అడ్నాక్) సంతకాలు చేశాయి. దీనిప్రకారం భారత కన్సార్షియంకు యూఏఈ ఆఫ్‌షోర్ చమురు పరిశ్రమలో పదిశాతం వాటా లభిస్తుంది. 60 శాతం వాటా అడ్నాక్‌కే ఉంటుంది. మిగిలిన 30 శాతం వాటాను ఇతర అంతర్జాతీయ చమురు కంపెనీలకు అప్పగిస్తారు. ఈ ఒప్పందంతో భారత్ కొనుగోలుదారు నుంచి పెట్టుబడిదారుగా మారిపోతుందని అబుధాబీలోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



మోదీకి 'గ్రాండ్ కాలర్' పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న పాలస్తీనా ప్రధాని అబ్బాస్

కశ్మీర్ అసెంబ్లీలో పాకిస్థాన్ అనుకూల నినాదాలు

ఎన్సీ ఎమ్మెల్యే చర్యను ఖండించిన ఫరూక్ అబ్దుల్లా

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ సోనవరి నియోజకవర్గ ఎమ్మెల్యే అక్బర్ లోన్ శనివారం పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశాడు. సుంజ్వాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో బీజేపీ ఎమ్మెల్యేలు సభలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో తాను ఆ విధంగా నినాదాలు చేసినట్టు ఎమ్మెల్యే అక్బర్ సమర్థించుకున్నాడు. 'అవును, సభలో నేను పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశా, ఇది నా వ్యక్తిగత అభిప్రాయం, దీనితో ఇతరులకు ఇబ్బంది కలుగుతుందని ఆలోచించలేదు' అని అక్బర్ చెప్పాడు. సభలో అక్బర్ వ్యాఖ్యలు ఆమోదనీయం కాదు, ఇలాంటి చర్యలను పార్టీ ఉపేక్షించదని, దీనిని పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఖండించారని ఆ పార్టీ అధికార ప్రతినిధి జునైద్ అజీం తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే చర్యలను నిలిపివేయాలని ఫరూక్ అబ్దుల్లా స్పష్టంచేశారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



సరిహద్దు ప్రాంతాల్లో భద్రతకు 1487 కోట్లు

న్యూ ఢిల్లీ: జమ్ము, కశ్మీర్‌లో సరిహద్దు భద్రతను పటిష్ఠపరిచేందుకు రక్షణశాఖ 1487 కోట్ల రూపాయలను మంజూరుచేసింది. ఈశాన్య ప్రాంతాల్లో.. ఇతర ప్రాంతాల్లోనూ భద్రతను పెంచేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నట్టు రక్షణశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. భారత్, పాక్ సరిహద్దు ప్రాంతాల్లో తరుచూ కాల్పులు, యుద్ధ వాతావారణం నెలకొని ఉన్నందున ఆరునెలల్లో భద్రతను పటిష్ఠం చేయాలని.. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని రక్షణశాఖమంత్రి నిర్మలాసీతారామన్ ఆర్మీ ఉన్నతాధికారులను ఆదేశించారు. 2016 పఠాన్‌కోట్ దాడుల అనంతరం నియమించిన లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ క్యాంపోస్ నేతృత్వంలోని కమిటీ సిఫారసుల మేరకు ఈ నిధులను విడుదల చేశారు. పఠాన్‌కోట్ దాడి అనంతరం ఆర్మీ, నౌకాదళం, వైమానిక దళం 3000 సున్నితమైన ప్రదేశాలను గుర్తించింది. అందులో 600 ప్రాంతాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ప్రభుత్వం గత ఏడాది జూలైలో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పటిష్ఠపరిచేందుకు రక్షణశాఖకు ఆర్థికపరమైన అధికారాలు ఇచ్చింది.

దర్యాప్తు అధికారే మట్టుబెట్టాడు

- బాలికపై లైంగికదాడి, హత్యకేసులో పోలీసు అధికారి అరెస్టు
- జమ్ములో గతనెల జరిగిన ఘటనపై సిట్ దర్యాప్తుతో బయటపడ్డ వాస్తవాలు



శ్రీనగర్: అదృశ్యమైన ఎనిమిదేండ్ల బాలిక ఆచూకీ కనిపెట్టేందుకు ఏర్పాటుచేసిన పోలీసు బృందంలోని ఓ అధికారే.. ఆ చిన్నారిపై లైంగికదాడి చేసి అతి దారుణంగా హతమార్చాడు. జమ్ముకశ్మీర్‌లోని కథువా జిల్లాలో జరిగిన ఈ ఘటనలో పోలీసు అధికారి దీపక్ ఖాజురియా(28)ను క్రైంబ్రాంచ్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) అధికారులు అరెస్టుచేశారు. కథువా జిల్లాలోని రాస్నాలో గుర్రాలను మేతకు తీసుకెళ్లిన సంచార తెగకు చెందిన ఎనిమిదేండ్ల బాలిక జనవరి 10న అదృశ్యమైంది. బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో దీపక్ బృందాన్ని నియమించారు. వారం తర్వాత పొదల్లో బాలిక మృతదేహాన్ని ఈ బృందం గుర్తించింది. ఆమెపై లైంగికదాడిచేసి, చిత్రహింసలు పెట్టి హత్యచేసినట్టు దర్యాప్తులో తేలింది. తీవ్రదుమారం రేపిన ఈ కేసును ప్రభుత్వం సిట్‌కు మార్చింది. అప్పటికే ఈ కేసులో పట్టుకున్న 15 ఏండ్ల బాలుడిని అధికారులు విచారించగా, దీపక్‌తో కలిసి నేరాన్ని చేసినట్టు అంగీకరించాడు. తన పేరు బయటపెట్టొద్దని దీపక్ బెదిరించినట్టు బాలుడు తెలిపాడు. బాలుడితో కలిసి పోలీస్ అధికారి దీపక్.. బాలికను బంధించి వారంపాటు లైంగిక దాడిచేసి, చిత్రహింసలకు గురిచేశారని సిట్ అధికారులు తెలిపారు.

రాఫెల్ అతిపెద్ద కుంభకోణం

తన మిత్రుడికి లబ్ధిచేకూర్చడానికే ప్రధాని ఒప్పందాన్ని మార్చారు: రాహుల్

బెంగళూరు, ఫిబ్రవరి 10: ప్రస్తుతం దేశంలో అతిపెద్ద కుంభకోణం రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలేనని, అవినీతి పరంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఇదే పెద్దదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ.. ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా రాఫెల్ ఒప్పందాన్ని మార్చారని, కొంతమందికి లబ్ధి చేకూర్చడానికే ఇలా చేశారని ఆరోపించారు. శనివారం ఆయన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని బళ్లారిలోని హోస్పేటులో ప్రారంభించారు. రాహుల్ మాట్లాడుతూ 'రాఫెల్ విమానాల కొనుగోలు కోసం బెంగళూరుకు చెందిన హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హెచ్ఏఎల్)ను కాదని ఫ్రాన్స్‌లోని కంపెనీతో ఎందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రాఫెల్ యుద్ధ విమానాల కోసం మొదట హెచ్ఏఎల్‌తో ఒప్పందం కుదుర్చుకొని, తర్వాత దాని నుంచి లాక్కున్నారు. ఫ్రాన్స్‌లోని మీ(ప్రధాని) మిత్రుడికి ఒప్పందాన్ని ఇచ్చారు. ఏ ప్రాతిపదికన ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు' అని రాహుల్ ప్రశ్నించారు. అందరూ వాహనానికి ఉన్న ముందు అద్దాన్ని చూస్తూ నడుపుతుంటారని, కానీ మన ప్రధాని వెనుక అద్దాన్ని చూస్తూ వాహనాన్ని(దేశాన్ని) ముందుకు నడుపుతున్నారని ఎద్దేవా చేశారు.



కొప్పల్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో రాహుల్

దక్షిణకొరియాకు కిమ్‌జోంగ్ స్నేహహస్తం!

తన సోదరి ద్వారా అధ్యక్షుడు మూన్‌కు ఆహ్వానలేఖ

గాంగ్‌న్యూంగ్ (దక్షిణకొరియా) ఫిబ్రవరి 10: ఉత్తరకొరియా పాలకుడు కిమ్‌జోంగ్ ఉన్ ప్రత్యర్థి దేశమైన దక్షిణకొరియాకు స్నేహహస్తం అందించారు. తమ దేశాన్ని సందర్శించాలని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌ను ఆహ్వానించారు. రెండు కొరియా దేశాల శిఖరాగ్ర సదస్సు నిర్వహిద్దామని, అందులో పాల్గొనాలని కోరారు. తన సోదరి ద్వారా జోంగ్ ఈ మేరకు ఒక లేఖను పంపారు. వీలైనంత త్వరలో దక్షిణకొరియా అధ్యక్షునితో భేటీ కావాలని కిమ్‌జోంగ్ ఉన్ భావిస్తున్నారని ఆయన ప్రతినిధి శనివారం సియోల్‌లో వెల్లడించారు. దక్షిణకొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్‌కు హాజరుకావడానికి వచ్చిన కిమ్‌జోంగ్ ఉన్ సోదరి కిమ్ యోజోంగ్ ఆ లేఖను అధ్యక్షుడు మూన్‌కు అందజేశారు. 'మీరు త్వరలో మా దేశాన్ని సందర్శిస్తారని ఆశిస్తున్నాం' అని ఈ సందర్భంగా ఆమె ఆయనతో అన్నారు. కాగా కిమ్‌జోంగ్ ఉచ్చులో మళ్లీ పడరాదని అమెరికా దక్షిణ కొరియాను హెచ్చరిస్తున్నది. ఈ నేపథ్యంలో కిమ్‌జోంగ్ ఆహ్వానానికి అధ్యక్షుడు మూన్ వెంటనే అంగీకారం తెలుపలేదు. రెండు దేశాల మధ్య చర్చ లు జరుగాలంటే ఉత్తరకొరియా ముందుగా అందుకు అనువైన పరిస్థితులను కల్పించాలని, ఇందుకోసం తమ మిత్రదేశమైన అమెరికాతో మొదట ఉత్తరకొరియా చర్చలు జరుపాలని తాము కోరుకుంటున్నామని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ ప్రతినిధి తెలిపారు.



వింటర్ ఒలింపిక్స్‌లో కిమ్, ట్రంప్ వేషధారులు

కిమ్, ట్రంప్ చెట్టాపట్టాల్!

ప్యూంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): దక్షిణకొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్‌ఉన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు..! పరస్పరం కత్తులు దూసుకునే ఈ ఇద్దరు దేశాధినేతలు స్నేహితుల్లా చెట్టాపట్టాలేసుకుని మరీ వచ్చారు..! నమ్మలేకపోతున్నారా?.. నిజం. వారిని చూసి ఉత్సవానికి హాజరైన వారంతా విస్తుపోయారు. అయితే వారిద్దరూ అసలైన కిమ్, ట్రంప్ కాదు. అచ్చం వారిలా కనిపించే కళాకారులు. కిమ్, ట్రంప్ వేషంలో వచ్చి అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు.


ఇండోనేషియాలో ఘోర రోడ్డు ప్రమాదం 27 మంది మృతి

జకార్తా: ఇండొనేషియాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పర్యాటకులను తీసుకెళ్తున్న బస్సు, బైక్ ఢీకొనడంతో 27 మంది మృతిచెందారని, పలువురు గాయపడ్డారని పోలీసులు శనివారం తెలిపారు. ఈ దుర్ఘటన జావా ద్వీపంలో చోటుచేసుకుందని చెప్పారు. ఎత్తు ప్రదేశం నుంచి వేగంగా వస్తున్న బస్సు ఒక్కసారిగా బైక్‌ను ఢీకొట్టిందని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారని, బస్సు బ్రేకులు ఫేయిల్ కావడంతోనే ప్రమాదం [illegible] వివరించారు.

ఆధార్ లేదని అత్యవసర సేవలు నిలిపివేయొద్దు: యూఏడీఏఐ

న్యూఢిల్లీ: ఆధార్ లేనందున అత్యవసర సేవలు నిలుపవద్దని యూఏడీఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఆధార్ కార్డు లేదన్న సాకుతో అత్యవసర వైద్యసేవలు, పాఠశాలల్లో ప్రవేశాలు, పీడీఎస్ ద్వారా రేషన్ ఇవ్వడం నిలుపవద్దని సూచించింది. ఈ విధానాన్ని తప్పనిసరిగా అమలయ్యేట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని కోరింది. అత్యవసర సర్వీసులకు ఆధార్‌తో ముడిపెట్టి ప్రజల్ని ఇబ్బందిపెట్టేవారిపై కఠిన చర్యలు ఉంటాయని యూఏడీఏఐ పేర్కొంది.

భూమికి చేరువగా తోకచుక్క



వాషింగ్టన్: ఓ భారీ తోకచుక్క శుక్రవారం భూమికి సుమారు 64వేల కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణించినట్టు నాసా తెలిపింది. 2018 సీబీ అని పేరుపెట్టిన తోకచుక్క చంద్రుని కక్ష్యలో ఐదోవంతు కంటే తక్కువ దూరం వరకు వచ్చింది. దీని పరిమాణం ఓ పెద్ద తిమింగలమంత ఉంటుంది. వారంరోజుల్లో ఇలాంటి ఖగోళ ఘటనలు జరుగడం ఇది రెండోసారి. ఇవి భూమిని ఢీకొనే ముప్పు [illegible] శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

డీరిజిస్టర్ చేసే అధికారమివ్వండి: ఈసీ

న్యూఢిల్లీ: రాజకీయపార్టీలను రిజిస్టర్ చేయడమే కాకుండా పార్టీల డీరిజిస్ట్రేషన్ అధికారం కూడా తమకు ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ప్రస్తుతం తమకు రాజకీయపార్టీలను నమోదు చేసే అధికారం ఉందని అయితే డీరిజిస్టర్ చేసే అధికారం లేదని తెలిపింది. సుప్రీంకోర్టుకు శనివారం ఈమేరకు అఫిడవిట్ సమర్పించింది. న్యాయవాది, ఉద్యమకారుడు అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారించింది. నేరస్థులు ఎన్నికల్లో పోటీచేయకుండా, రాజకీయపార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే అధికారం ఈసీకి ఉండాలని కోరింది.

ఈ ఏడాదంతా ఇండ్ల అప్పగింతే

- హైదరాబాద్‌లో 796 ఇండ్లకు శంకుస్థాపనలో మంత్రి కేటీఆర్
- రాష్ట్రంలో రూ.18 వేల కోట్లతో 2.70 లక్షల డబుల్ ఇండ్లు
- ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి
- బొల్లారం దవాఖానను అప్పగిస్తే అన్నిరకాల సేవలు
- రక్షణశాఖ స్థలం ఇస్తే రెండు భారీ స్కైవేలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చురుకుగా సాగుతున్నదని, ఈ ఏడాదంతా వాటిని పూర్తిచేసి లబ్ధిదారులకు తాళంచెవులు అందించి ఇండ్లను అప్పగిస్తామని పురపాలకశాఖ మంత్రి కే తారక రామారావు హామీ ఇచ్చారు. దీనికోసం ప్రతినెలా, ప్రతివారం ప్రాంతంలో త్వరి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో ఉండాలన్నది సీఎం కేసీఆర్ ఆశయమని, హైదరాబాద్‌ను స్లమ్‌ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పుణె తరహాలో మన నగరంలో కూడా ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ వచ్చేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలోని కంటోన్మెంట్ నియోజకవర్గంలో గల మారేడ్‌పల్లిలో రూ.41 కోట్లతో 536, గాంధీనగర్‌లోని శ్రీరామ్‌నగర్‌లో రూ.28.52 కోట్లతో 260 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి శనివారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాదంతా ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారుల చేతుల్లో పెట్టనున్నట్టు మంత్రులు, ఎమ్మెల్యేల బాధ్యత అని మంత్రి స్పష్టంచేశారు. కంటోన్మెంట్‌లోని బొల్లారం దవాఖానను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే అన్నిరకాల వైద్యసేవలు అందేలా చూస్తామని, కంటోన్మెంట్‌లో రక్షణశాఖ ఒప్పుకుంటే జేబీఎస్ నుంచి శామీర్‌పేట, ప్యాట్నీ నుంచి సుచిత్ర వరకు రెండు భారీ స్కైవేల నిర్మాణాలు చేపడుతామన్నారు. ఈ మేరకు కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతిపాదన సమర్పించామన్నారు.

మన 'డబుల్' పథకం 28 రాష్ట్రాలతో సమానం

రాష్ట్రంలో సుమారు రూ.18 వేల కోట్లతో 2.70 లక్షల డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మిస్తున్నామని, ఇది దేశంలో మిగిలిన 28 రాష్ట్రాలన్నీ కలిపి పేదల గృహ నిర్మాణానికి వెచ్చిస్తున్న ఖర్చుతో సమానమన్నారు. దీన్నిబట్టి రాష్ట్ర ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థంచేసుకోవచ్చన్నారు. 'ఇల్లు కట్టి చూడు, పెండ్లి చేసి చూడు' అంటారని, దీన్ని నిజంచేస్తూ సీఎం కేసీఆర్ ఆడబిడ్డల పెండ్లికి రూ.75 వేలు ఇస్తున్నట్టు చెప్పారు. కనీసం పెండ్లిలో పప్పన్నం కోసమైనా ఇవి సరిపోతాయన్నారు. పెద్దలకు పెన్షన్లు, ఇంట్లో ఎంతమంది సభ్యులుంటే అంతమందికి ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం, స్కూలు పిల్లలకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో చదివే పిల్లలకు సన్నబియ్యంతోపాటు పుస్తకాలు, దుస్తుల తదితర రూ.లక్షనుంచి లక్షన్నరవరకు అయ్యే ఖర్చును భరిస్తున్నట్టు చెప్పారు. పేదల సంక్షేమానికి పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా పుట్టే బిడ్డకు సైతం కేసీఆర్ కిట్ పేరుతో సమకూర్చుతున్నామన్నారు. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగబిడ్డకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలో తమదేనన్నారు. విద్యుత్, మంచినీటి సరఫరా, శాంతిభద్రతలు ఎంతో మెరుగయ్యాయన్నారు. కేసీఆర్ వంటి నేత మనకు లభించడం పూర్వజన్మ సుకృతమని చెప్పారు. మారేడ్‌పల్లి ప్రతిపాదిత డబుల్ బెడ్రూం కాలనీ ప్రాంతంలోని మురికివాడలో ముగ్గురు నలుగురు ఇండ్లను ఖాళీ చేసేందుకు నిరాకరించినా మిగిలిన వారు భరోసా వ్యక్తంచేస్తూ ఖాళీ చేశారని, చిన్నచిన్న సమస్యలున్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హౌసింగ్ బోర్డు స్థలాన్ని ఉచితంగా పేదలకు కేటాయించడం చరిత్రలో ఇదే ప్రథమమని మంత్రి పేర్కొన్నారు. బోఈగుట్టలో సైతం ఇరువురి సమస్యలున్నాయని, అక్కడ సుమారు రెండు వేల కుటుంబాలు ఉండగా, 1900 మంది డబుల్ కాలనీలకు అనుకూలంగా ఉన్నట్టు చెప్పారు. మిగిలినవారి అభ్యంతరాలను సైతం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలు ఇబ్బంది పడకుండా ఉండాలని, నగరాన్ని స్లమ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సాయన్న తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ శ్రీరామ్‌నగర్‌లో డబుల్ ఇండ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సాయన్న, కమిషనర్ జనార్దన్‌రెడ్డి కూడా ఉన్నారు.

దశలవారీగా అర్హులందరికీ డబుల్ ఇండ్లు

పుణె తరహాలో ఇక్కడ కూడా ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామన్నకుంట చెరువు అభివృద్ధికోసం రూ.2.5 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. నగరాన్ని స్లమ్‌ఫ్రీ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా పేదలకోసం ఈ ఏడాది లక్ష గృహాలను నిర్మిస్తున్నట్టు గుర్తుచేశారు. ఈ లక్ష గృహాలతో సమస్యలు తీరవని, దశలవారీగా అర్హులైన అందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఇండ్లులేనివారి సమాచారం ప్రభుత్వం వద్ద ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఇండ్ల నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

మార్చిలోపు ఆధునిక బస్టాపులు

హైదరాబాద్‌లో 800 పైగా బస్టాపులు మూడు గ్రేడ్లుగా విభజన

మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న బస్టాపుల కన్నా అత్యుత్తమ డిజైన్లు, సౌకర్యాలు గల వాటిని ఈ ఏడాది మార్చి చివరిలోపు ఏర్పాటు చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. నగరంలో ఏర్పాటు చేసే కొత్త బస్టాపులపై మంత్రి కేటీఆర్ శనివారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నగరంలో సుమారు 800 పైగా నూతన బస్టాపులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. ప్రస్తుతం బస్టాపుల్లో ఉన్న సౌకర్యాల ప్రకారం ఏ, బీ, సీ గ్రేడ్లుగా విభజించి నిర్మాణాల్ని చేపట్టనున్నారు. అన్ని సౌకర్యాలున్న 'ఏ' గ్రేడ్ బస్టాపుల సంఖ్యను మరింత పెంచాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సంఖ్యను రెట్టింపు చేయాలని, ఈ మేరకు పార్కింగ్ ఏజెన్సీలకు బస్టాపుల నిర్మాణానికి స్థలాలను అందజేయాలన్నారు. అదనపు కమిషనర్ అద్వైత్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి బస్టాపుల నిర్మాణంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లను ఆనుకొని ఉన్న ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలతో చర్చించి ఆయా ప్రాంతాల్లో బస్సు బేలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ఆయా ప్రభుత్వశాఖల కార్యదర్శులతో వచ్చేవారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. మెట్రో కారిడార్లలో బస్టాపుల ఏర్పాటు కోసం మెట్రో రైలు ఎండీతో సమన్వయం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. గడువులోపు పనులను పూర్తి చేయాలని, లేకుంటే కాంట్రాక్టును రద్దు చేసేందుకు వెనుకాడమని వర్కింగ్ ఏజెన్సీలను హెచ్చరించారు.

తెలంగాణ ఆడబిడ్డల సాహసయాత్ర

- నేటినుంచి తూర్పు ఆసియాలో 17 వేల కి.మీ. ప్రయాణించనున్న నలుగురు యువతులు
- రాష్ట్ర పర్యాటక విశేషాలను తెలియజేసేందుకే ఈ యాత్ర
- పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పర్యాటక విశేషాలను ప్రపంచమంతటా తెలియచేసేందుకు నలుగురు తెలంగాణ ఆడబిడ్డలు బైక్‌లపై ఆదివారం ఉదయం నుంచి సాహసయాత్రను ప్రారంభించనున్నారని పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ పేర్కొన్నారు. జైభారతి, ప్రియ, శాంతి, శిల్ప ఈ సాహసయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నలుగురు యువతులు పర్యాటకభవనం నుంచి ఈ యాత్రను ప్రారంభించి 17 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తారని తెలిపారు. బైక్‌లపై దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం దేశాల్లో వీరు యాత్ర కొనసాగించి తెలంగాణ పర్యాటక విశేషాలను చాటిచెప్తారని తెలిపారు. వివిధ దేశాల్లోని 19 యునెస్కో వారసత్వ కట్టడాలను సందర్శిస్తారని చెప్పారు. పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఈ నలుగురు 50 రోజులపాటు తూర్పు ఆసియా దేశాల్లో పర్యటించేందుకు అనువైన 400 సీసీ బైక్‌లను బజాజ్ ఆటో కంపెనీ స్పాన్సర్ చేసిందని చెప్పారు. వీరు పర్యటించే రాష్ట్రాలు, దేశాల అధికారులతో సంప్రదింపులు జరిపి అవసరమైన సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర పర్యాటకశాఖ చర్యలు తీసుకుంటున్నదన్నారు. తెలంగాణ పర్యాటకరంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. యాత్రకు నాయకత్వం వహిస్తున్న జైభారతి మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత షీటీమ్స్‌ను ఏర్పాటు చేసి మహిళలకు భరోసా కల్పించడం వల్ల అమ్మాయిలు రాష్ట్రంలో క్షేమంగా తిరుగగలుగుతున్నారన్నారు. ఈ స్ఫూర్తితోనే బైక్‌లపై సాహసయాత్రను చేస్తున్నామని చెప్పారు.



సాహసయాత్రికులు జైభారతి, ప్రియ, శాంతి, శిల్పతో మంత్రి చందూలాల్, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

చార్మినార్ ప్రాజెక్టుకు 8.19 కోట్లు

- మంజూరుచేస్తూ జీహెచ్‌ఎంసీకి ఎన్టీపీసీ లేఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ ఐకానిక్ ప్రాంతాల ప్రాజెక్టు' కింద నగరంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతమైన చార్మినార్ సుందరీకరణ, అభివృద్ధి పనులకు జాతీయ థర్మల్ విద్యుత్ సంస్థ(ఎన్టీపీసీ) రూ.8.19 కోట్లు మంజూరు చేసింది. చార్మినార్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఇది వరకే మంత్రి కేటీఆర్ పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. 'స్వచ్ఛ ఐకానిక్ ప్రాంతాల ప్రాజెక్టు'లో భాగంగా దేశంలోని ప్రముఖ చారిత్రక పర్యాటక స్థలాలను ఐకానిక్ ప్రాంతాలుగా గుర్తించి వాటి అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టడానికి ఒక్కో కేంద్ర ప్రభుత్వ సంస్థకు కేంద్రం బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. ఇందులో భాగంగా చార్మినార్‌ను సుందరీకరణ, అభివృద్ధి చేసే బాధ్యతను ఎన్టీపీసీకి అప్పగించారు. చార్మినార్ అభివృద్ధి, నిధుల కేటాయింపుపై గత జనవరి 30న జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ, ఎన్టీపీసీ అధికారులతో చర్చించారు. ఈ క్రమంలో రూ.8.19 కోట్లను కేటాయిస్తున్నట్టు ఎన్టీపీసీ యాజమాన్యం జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద ఈ నిధులను ఐకానిక్ ప్రాజెక్టుకు కేటాయిస్తున్నట్టు తెలిపింది.

ఎన్టీపీసీ ఇచ్చే నిధులు ఇలా (లక్షల్లో)..

- బ్యాటరీతో నడిచే వాహనాలకు– రూ.251
- స్వచ్ఛ ఆటోటిప్పర్ల ఏర్పాటుకు– 42.50
- స్టీల్ గార్బేజ్ బిన్‌ల ఏర్పాటుకు– 9
- చార్మినార్ చుట్టూ ఉన్న నాలుగు ఆర్చీలను డెకరేటివ్, లైటింగ్‌కు– 100
- వాటర్ ఏటీఎం కియోస్క్‌ల ఏర్పాటుకు– 16
- పబ్లిక్ టాయిలెట్లు, ఇతర సౌకర్యాలకు– 200
- రోడ్లను పరిశుభ్రంగా ఉంచే యంత్రాలకు– 200

స్వచ్ఛ చార్మినార్‌కు బల్దియా ఏర్పాట్లు..

మరోవైపు, స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి వీధి వ్యాపారి, దుకాణదారుడికి రెండేసి చెత్త బుట్టలను పంపిణీచేశారు. వాటిల్లో వేసిన చెత్తను ప్రతి అరగంటకు ఒకసారి తరలించేలా ఏర్పాట్లుచేశారు. పత్తర్‌గట్టీ నుంచి శాలిబండ, ముర్గీచౌక్ నుంచి లాడ్‌బజార్ మార్గంలో ప్రతి 20–30మంది వీధి వ్యాపారులకు ఒకరు చొప్పున పారిశుద్ధ్య కార్మికుడిని ప్రత్యేకంగా నియమించి రోడ్డుపై చెత్త వేయకుండా వారికి బాధ్యతలు అప్పగించారు. రోడ్లపై చిన్న కాగితం, ప్లాస్టిక్ కవర్ కూడా కనిపించకుండా చేసేందుకు నిరంతరం పర్యవేక్షించే బాధ్యతను నలుగురు అధికారులకు అప్పగించారు. వీటితోపాటు ప్రస్తుతమున్న షీ–టాయిలెట్లు, ఇతర టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. చార్మినార్‌ను సందర్శించే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా తగిన చర్యలు తీసుకున్నారు.



జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న మందుబాబు అంకిత్‌సింగ్

ట్రాఫిక్ పోలీసుపై తాగుబోతు దాడి

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ట్రాఫిక్ పోలీసులను బండబూతులు తిడుతూ బ్రీత్ అనలైజర్ పరికరాన్ని లాక్కునేందుకు యత్నించడంతోపాటు కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–1లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ఆ రూట్లో వచ్చిన ఫోర్డ్ కారును (ఏపీ 10పీ 5004) పోలీసులు ఆపారు. కారు నడిపిస్తున్న వ్యక్తికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేసేందుకు యత్నించగా సహకరించలేదు. అతడికి నచ్చజెప్తున్న క్రమంలోనే కారులోనే పక్కసీట్లో కూర్చున్న అంకిత్‌సింగ్ అనే యువకుడు బండబూతులు తిడుతూ బ్రీత్ అనలైజర్ యంత్రాన్ని లాక్కొనేయత్నం చేశాడు. కానిస్టేబుల్ జితేందర్ చేతిని పట్టుకొని గట్టిగా లాగుతూ వీరంగం సృష్టించాడు. కారు దిగివచ్చి వాగ్వాదంతోపాటు కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. దాంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ జితేందర్‌కు, అంకిత్‌కు మధ్య ముష్టియుద్ధం జరిగింది. ఈ ఘటనపై కానిస్టేబుల్ జితేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు అంకిత్‌సింగ్‌పై ఐపీసీ 353, 506, 510 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్, రంగారెడ్డి రీజియన్ పరిధిలో నుంచి మహాశివరాత్రి నేపథ్యంలో శ్రీశైలానికి 200 ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్టు ఆర్‌ఎం యాదగిరి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ముద్రించిన కరపత్రాలను శనివారం ఎంజీబీఎస్‌లో ఆవిష్కరించారు. ఆదివారం నుంచి 14వ తేదీ వరకు ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్‌సదన్, కేపీహెచ్‌బీ నుంచి 11న 28, 12న 85, 13న 72, 14న 15 బస్సుల చొప్పున నడిపించనున్నామన్నారు. సీట్లను www.tsrtconline.inలో బుక్ చేసుకోవచ్చన్నారు. వజ్ర(ఏసీ) రూ.575, సూపర్ లగ్జరీ రూ.425, డిలక్స్ రూ.375, ఎక్స్‌ప్రెస్ రూ.330 చొప్పున చార్జీలు ఉంటాయన్నారు.

ఉప్పల్‌లో నరబలి కేసు..

ఇంట్లో మనిషి రక్తపు మరకలు!.. సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు

డీఎన్‌ఏ నివేదికతో 48 గంటల్లో సస్పెన్స్‌కు తెర

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉప్పల్ చిలుకానగర్ నరబలి ఉదంతానికి సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు ఫుల్ స్టాప్ పెట్టనున్నారు. అనుమానితుడు రాజశేఖర్ ఇంట్లోని ఓ గదిలో బండల గీత మధ్యలో రక్త నమూనాలను నిపుణులు కనుగొన్నారు. దాని ఆధారంగా ఆ గదిలో అణువణువును టెక్నాలజీతో కూడిన పరికరంతో శోధించారు. కంటికి కనిపించకుండా ఆ గది నిండా రక్తపు మరకలు ఉన్నట్టు నిర్ధారించారు. ఆ మరకలను కనిపించకుండా ఐదు సార్లు రసాయనాలతో తుడిచేశారు. అయినా మన పోలీసుల వద్ద ఉన్న టెక్నాలజీ ఆ మరకలను తెరపైకి తెచ్చింది. ఈ అంశంపై అనుమానితులను విచారించగా, ఆ గదిలో కోడిని కోశామని తెలిపారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో అనుమానితుడి ఇంటి నుంచి సేకరించిన నమూనాలు, ఇంటి పైన దొరికిన శిశువు నమూనాలను ఫోరెన్సిక్ వైద్యులు పరీక్షించి నివేదిక ఇవ్వనున్నారు.

క్షుద్ర పూజల కోసం వరి గడ్డి

పోలీసులు మరోవైపు క్షుద్ర పూజలు ఏలా జరుగుతాయనే అంశాలపై దృష్టి సారించారు. రాజశేఖర్ ఇంట్లో తనిఖీల సమయంలో వెదురు బొంగుల(చీపురు పుల్లలు)తో తయారు చేసిన కట్ట దొరికింది. దానిని విశ్లేషించినప్పుడు ఆ కట్టలో వరి గడ్డిని గుర్తించారు. దీనిపై కొంత మంది ఆధ్యాత్మిక చింతన ఉండే వారితో ఆరా తీశారు. వరి గడ్డిని క్షుద్ర పూజల కోసమే ఉపయోగిస్తారని తేల్చి చెప్పారు. అనుమానితులు మాత్రం తమ ఇంట్లో పూజల కోసం తెచ్చుకున్నామని చెప్పినట్టు తెలిసింది. పోలీసులు ఆరా తీసిన అంశాలు, అనుమానితులు చెప్పే విషయాలకు దగ్గరి పోలికలు ఉండటంతో ఆ ఇంట్లో నరబలి జరిగిందని భావిస్తున్నారు. డీఎన్‌ఏ నివేదికతో మరో 48 గంటల్లో ఈ కేసు మిస్టరీ వీడనున్నది.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 11 ఫిబ్రవరి 2018

WWW.NTNEWS.COM



చదువు తప్ప ఆమెకు మరో ధ్యాసలేదు. సినిమాలంటే ఆమడదూరం పారిపోయేది. నటనలో ఓనమాలు రావు. కెమెరా ముందు ఎలా నటించాలో తెలియదు. కానీ ఒక్క అవకాశం ఆమె జీవితాన్ని మలుపుతిప్పింది. స్టార్‌ను చేసింది. ప్రాణంగా ప్రేమించే జీవితభాగస్వామిని ఆమె చెంతకు చేర్చింది. తాను కోరుకున్నవన్నీ సినిమానే ఇచ్చిందని చెబుతున్నది రష్మిక మందన. కన్నడ చిత్ర 'కిరిక్‌పార్టీ'తో వెండితెరపై అడుగుపెట్టిన రష్మిక తొలి సినిమాలోనే సహజఅభినయంతో ఆకట్టుకొని అభిమానుల ఆరాధ్యనాయికగా మారిపోయింది. 'ఛలో' సినిమాతో చూసీ చూడంగానే తెలుగు ప్రేక్షకులకు నచ్చేసింది. సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి జిందగీతో రష్మిక మందన్న పంచుకున్న ముచ్చట్లివి...

చూసి చూడంగానే నచ్చేసింది

నచ్చిన ఫుడ్?

ఫేవరేట్ ఫుడ్ అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. సీఫుడ్ ఎక్కువగా తింటాను. హైదరాబాద్ బిర్యానీ నచ్చింది. స్వీట్స్ కనిపిస్తే లాగించేస్తాను. వంట అస్సలు రాదు.

• రియల్‌లైఫ్‌లో మిమ్మల్ని భయపెట్టేది?

స్పైడర్స్ అంటే చాలా భయం. సీరియస్‌గా ఉండే వాళ్లను చూస్తే నచ్చదు.

దేవుడిని నమ్ముతారా?

నమ్ముతాను. కానీ పూజలు చేయడం అలవాటు లేదు.

సినిమాలు కాకుండా మీకు నచ్చినవి ఏమిటి?

మనసు బాగా లేకపోతే సంగీతంతోనే సేదతీరుతాను. అలాగే స్పోర్ట్స్, డ్యాన్సలన్నా ఇష్టమే.

• తెలుగు సినిమాలో తమిళ అమ్మాయి పాత్రలో కనిపించారు. స్వతహాగా కన్నడ అమ్మాయైన మీరు ఈ పాత్ర కోసం ఎలా సన్నద్ధమయ్యారు?

■ సినిమాలో నేను సంభాషణలు చెప్పిన తీరు చూసి చాలా మంది తమిళ అమ్మాయిననే అపోహపడ్డారు. అది ప్లస్ పాయింట్ అయ్యింది. చలాకీగా ఉండే కాలేజీ స్టూడెంట్ పాత్ర నాది. నిజజీవితంలో ఇంట్లో, కాలేజీలో ఎలా ఉంటానో అలాగే సహజంగా తెరపై కనిపించడానికి ప్రయత్నించాను. అదే అందరికీ నచ్చింది.

• సినిమాలో పరీక్షల్లో కాపీ కొట్టే సన్నివేశం ఉంటుంది. అలా నిజజీవితంలో మీరు కాపీ కొట్టిన సందర్భాలున్నాయా?

■ స్కూల్, కాలేజీలలో అసైన్‌మెంట్స్ చేసేప్పుడు కాపీ కొట్టి దొరికిపోయాను. అలాగే చాలాసార్లు నా స్నేహితులకు పరీక్షల్లో సహాయపడుతూ టీచర్స్ చేత తిట్లు తిన్నాను. ఎగ్జామ్స్ సరిగా రాయకపోయినా ఈ సారి ఫస్ట్‌క్లాస్ పక్కా వస్తుందని అబద్ధాలు చెప్పి తప్పించుకునేదాన్ని. అలాంటివి కొన్ని ఉన్నాయి (నవ్వుతూ). అవన్నీ ఈ సినిమాతో గుర్తొచ్చాయి. ఎంత అల్లరి చేసినా చదువులో మాత్రం ఏ రోజు వెనుకబడిపోలేదు. మా కాలేజ్ టాపర్‌ను నేనే. కాలేజీకి బంక్ కొట్టి సినిమాలు చూడడం తక్కువే.

'ఛలో' విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?

పదో తరగతి పరీక్షలు రాసిన తర్వాత ఫలితాలు వచ్చినపుడు ఎలా ఉంటుందో అదే అనుభూతి కలుగుతున్నది. ఫస్ట్‌క్లాస్‌లో పాసయినంతగా ఆనందముంది. కన్నడ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉండడంతో ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేసే సమయం దొరుకడం లేదు. భవిష్యత్తులో మరింత కష్టపడడానికి స్ఫూర్తినిచ్చిన విజయమిది.



• తెలుగు గలగలా మాట్లాడేస్తున్నారు? భాషపై ఎలా పట్టుసాధించారు?

■ సినిమా ఒప్పుకొన్న రెండు రోజుల తర్వాత నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతానని దర్శకుడితో చెప్పాను. కానీ తెలుగు ఒక్క ముక్క రాకపోవడంతో లోలోన చాలా భయం ఉండేది. సెట్స్‌లో తెలుగు మాట్లాడేవారందరినీ గమనించడం మొదలుపెట్టాను. వారి చెబుతున్న మాటల్ని గుర్తుంచుకుంటూ పదే పదే మననం చేసుకుంటూ తెలుగుపై పరిజ్ఞానం పెంచుకున్నాను. భవిష్యత్తులో ఇతర భాషల్లో సినిమాలు చేసినా నేనే సొంతంగా డబ్బింగ్ చెబుతాను. అప్పుడే నా పాత్రలకు న్యాయం చేయగలనని నా నమ్మకం.

• కన్నడ, తెలుగు రెండు భాషల్ని సమన్వయం చేసుకుంటూ నటించడం ఇబ్బందిగా అనిపించడంలేదా?

■ ఒక పది రోజులు బెంగళూరులో, మరో పది రోజులు హైదరాబాద్‌లో ఉంటూ షూటింగ్‌ల్లో పాల్గొంటున్నాను. మనసుకు నచ్చిన పని చేస్తున్నప్పుడు ఎంత కష్టమైనా భరించాల్సిందే తప్పదు.

• ప్రత్యేకంగా ఫలానా పాత్రల్లో నటించాలనే కోరికలు ఏమైనా ఉన్నాయా?

■ ఇప్పటివరకు కాలేజీ స్టూడెంట్, బబ్లీగర్ల్ తరహా పాత్రలో కనిపించాను. నాలోని నటనాసామర్థ్యాన్ని పూర్తిగా తెరపై ఆవిష్కరించే అవకాశం రాలేదు. నేనంటే ఏమిటో నిరూపించుకోవాలని ఉంది. అలాంటి చాలెంజింగ్ పాత్రల కోసం ఎదురుచూస్తున్నాను.

• మీ కుటుంబ నేపథ్యమేమిటి? సినిమాల్లోకి ఎలా వచ్చారు?

■ నాన్న వ్యాపారవేత్త, అమ్మ గృహిణి. నా విద్యాభ్యాసం మొత్తం కూర్గ్‌లో సాగింది. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం బెంగళూరు వచ్చాం. 2014లో మిస్ ఫ్రెష్ ఫేస్ అనే కాంపిటీషన్‌లో పాల్గొన్నాను. అందులో నన్ను చూసిన దర్శకుడు రిషబ్ శెట్టి, హీరో రక్షిత్ శెట్టి 'కిరిక్ పార్టీ'లో అవకాశమిచ్చారు. తొలి సినిమానే ఏడాది పాటు ఆడుతుందని, నాకో మంచి పేరును తీసుకొస్తుందని ఊహించలేదు.

• నటన పట్ల మీకు ముందు నుంచే ఆసక్తి ఉందా?

నిజం చెప్పాలంటే నటన అంటే ఏమిటో? ఎలా నటించాలో తెలియదు. చదువుకునే రోజుల్లో సినిమాలు చూడడం తక్కువే. వాటి గురించి ఎలాంటి పరిజ్ఞానం లేదు. కనీసం స్టేజ్ షోలు చేసిన అనుభవం లేదు. అలాంటిది హీరోయిన్‌గా తొలి సినిమాతోనే నా నటనకు మంచి గుర్తింపు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.

• తొలిరోజు కెమెరా ముందుకొచ్చిన సందర్భాలు గుర్తున్నాయా?

■ 'కిరిక్‌పార్టీ' సినిమాలో బస్సు కోసం ఎదురుచూసే సన్నివేశాల్ని నాపై దర్శకుడు చిత్రీకరించారు. కెమెరా ముందుకు రావడం అదే తొలిసారి కావడంతో భయం వల్ల ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ టెన్షన్ బయటకు కనిపించకుండా నాలో నేనే సర్దిచెప్పుకుంటూ ఆ సన్నివేశాల్ని పూర్తిచేశాను. కానీ సింగిల్ టేక్‌లోనే ఆ షాట్ ఓకే అని దర్శకుడు చెప్పగానే నమ్మలేకపోయాను. ఆ సినిమాలో సన్నివేశాల్ని పూర్తి చేయడానికి మూడు టేకులకు మించి తీసుకున్న సందర్భాలు చాలా అరుదుగా ఉన్నాయి.

• నటిగా మీకు స్ఫూర్తినిచ్చినది ఎవరు?

■ స్ఫూర్తి అంటూ ఎవరూ లేరు. కానీ అనుష్క పట్ల ఎనలేని గౌరవభావముంది. కర్ణాటక నుంచి తెలుగు, తమిళ భాషల్లో కష్టపడి మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నారామె. ఒకేసారి అనుష్కను కలిశాను. స్వీట్ పర్సన్. తొలి పరిచయంలోనే మంచి స్నేహితులమయ్యాం. ఓ అభిమానిగా ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను.

• డ్రీమ్‌రోల్స్ ఏమైనా ఉన్నాయా?

■ చాలా ఉన్నాయి. గ్లామర్‌కు ప్రాధాన్యమున్నవి కాకుండా శక్తివంతమైన పాత్రల్లో నటించాలనున్నది. అనుష్క చేసిన దేవసేన లాంటి పాత్రను కెరీర్ ముగిసేలోపు ఎప్పటికైనా చేయాలనుంది.

• సమంత, కరీనాకపూర్‌తో పాటు చాలా మంది స్టార్స్ పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో నటిస్తున్నారు? వారిలా మీరు కూడా పెళ్లి తర్వాత సినిమాల్లో నటిస్తారా?

■ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. ప్రేమతో ఈ రంగంలో అడుగుపెట్టాను. ఎప్పటికీ దూరమవ్వను. పెళ్లైనా సినిమాల్లో నటిస్తాను.

• ఇప్పుడూ మీరు కూడా ఓ సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అయ్యారు. ఆ స్టార్‌డమ్‌ను ఎలా ఫీలవుతున్నారు?

■ స్టార్‌ననే భావన నాలో ఎప్పుడూ కనిపించదు. నా స్నేహితుల ఇళ్లకు, జిమ్‌కు నడుచుకుంటూనే వెళ్తాను. బౌన్సర్స్ రక్షణలో వెళ్లడం నాకు అంతా కంఫర్ట్‌గా అనిపించదు. బెంగళూరు వెళితే సాధారణ అమ్మాయిలానే నచ్చిన ప్రదేశానికి వెళుతుంటాను. సైక్లింగ్, జాగింగ్‌కు ఒక్కదాన్నే వెళ్లిపోతాను.

• సాధారణంగా చిత్రసీమ పట్ల బయట రకరకాల వార్తలు ప్రచారంలో ఉన్నాయి. అలాంటిది మీరు సినిమాల్లోకి వెళ్తానంటే ఇంట్లోవారు ఏమన్నారు?

■ 'కిరిక్ పార్టీ'లో అవకాశం వచ్చినపుడు అందరి తల్లిదండ్రుల లాగే మావాళ్లు సినిమాల్లోకి వెళ్తానంటే వద్దన్నారు. కానీ ఇప్పుడు మాత్రం చాలా గర్వపడుతున్నారు. తొలిరోజు సినిమా వాతావారణాన్ని చూసిన తర్వాత వారిలోని భయాలన్నీ పోయాయి. బయట ఉన్న ప్రచారాల్లో చాలా వరకు అవాస్తవాలే. నేనంటే ఏమిటో వారికి తెలుసు. నాపై నమ్మకం ఉంది. వారు ఇచ్చిన స్వేచ్ఛను ఏనాడూ అతిక్రమించే ప్రయత్నం చేయను.

రక్షిత్ శెట్టితో మీ ప్రేమాయణం ఎలా మొదలైంది? ఇద్దరిలో ముందు ఎవరు లవ్‌ప్రపోజ్‌చేశారు?

మాది పెద్దలు కుదిర్చిన ప్రేమ వివాహం. 'కిరిక్‌పార్టీ'తో రక్షిత్ పరిచయమయ్యాడు. అభిప్రాయాలు, అభిరుచులు కలువడం, ఇరు కుటుంబాల వారు మా ప్రేమను అంగీకరించడంతో నిశ్చితార్థం జరుపుకొన్నాం. పెళ్లికి మాత్రం చాలా సమయముంది.



• మీ సినిమాల్ని అమ్మానాన్నలకు చూపిస్తుంటారా?

■ 'ఛలో' సినిమా చూసి 'నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది' అని ఒకే ఒక మాట చెప్పారు. తెలుగు సినిమా చేయడం, సొంతంగా డబ్బింగ్ చెప్పడం పట్ల అమ్మానాన్నలు సంతోషంగా ఉన్నారు.



• మీ సినిమాలకు తొలి విమర్శకులు ఎవరు?

■ నాన్నే నా సినిమాలకు పెద్ద క్రిటిక్. అమ్మ ఎలా నటించినా బాగుందని చెబుతుంది. ఒకవేళ బాగా లేకపోయినా ఏం పర్వాలేదని మరోసారి బాగా నటించమని ధైర్యాన్నిస్తుంది. కానీ నాన్న ఫలానా చోట తప్పుచేశావని ప్రతి అంశాన్ని విడమరచి చెబుతుంటారు. నాన్నతో పాటు రక్షిత్ శెట్టి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అవే నటిగా నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి దోహదపడ్డాయి.

• రక్షిత్‌లో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేవి?

■ అతడి ఆలోచన విధానం, ఇతరుల్ని ప్రేమించే తీరు, తెలివితేటలంటే నాకు చాలా ఇష్టం. మంచి నటుడు, నిర్మాత, హ్యూమన్‌బీయింగ్. ఇలా చెప్పుకుంటూ పోతే రక్షిత్‌లో చాలా మంచి లక్షణాలున్నాయి.

• ఇప్పటివరకు మీరు చేసిన సినిమాల్లో ఆయనకు నచ్చిన సినిమా ఏది?

■ ఛలో ఆయనకు నచ్చింది. చాలా బాగా నటించానని మెచ్చుకున్నారు.

• హీరోయిన్లకు పెళ్లి కుదిరితే కెరీర్ ముగిసిపోయినట్లేనని చిత్రసీమలో రూమర్స్ ఉన్నాయి. ఆ భయాలు మీకు ఏమైనా కలిగాయా?

■ సాధారణంగా చిత్రసీమలో హీరోలు పెళ్లిచేసుకున్నా సినిమాల్లో నటించవచ్చు. అదే హీరోయిన్‌లు పెళ్లిచేసుకుంటే తప్పు అని చెప్పడం ఎంతవరకు సబబు. సినీ పరిశ్రమలో చాలా మంది హీరోయిన్‌లు ప్రేమలో ఉన్నారు. కానీ అవకాశాలు ఎక్కడ చేజారిపోతాయో, కెరీర్ ఏమవుతుందోననే బయటకు చెప్పడానికి భయపడుతున్నారు. హీరోయిన్‌లు ఎప్పటికైనా ఎవరినో ఒకరిని పెళ్లిచేసుకోవాల్సిందే. కొంత ముందుగా పెళ్లిచేసుకుంటే తప్పేంటనిపించింది. ఆ ఆలోచనతోనే ధైర్యంగా పెళ్లికి అంగీకరించాను.

• మీరు హీరోయిన్‌గా నటించిన కన్నడ చిత్రం 'చమక్' భార్య భర్తల అనుబంధం నేపథ్యంలో సాగుతుంది. ఆ సినిమాలో నటిస్తున్నప్పుడు భవిష్యత్తులో భర్తతో నేను కూడా ఇలా ఉంటే బాగుంటుందనే ఆలోచనలు ఎప్పుడైనా కలిగాయా?

■ అది నాకు తెలియదు (నవ్వుతూ). ఆధునిక భావాలున్న ఓ భార్యభర్తల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కథ నచ్చడంతో ఆ సినిమా చేశాను.

• నా పేరు సూర్య-నా ఇల్లు ఇండియా సినిమాలో మీకు కథానాయికగా నటించే అవకాశం వచ్చినట్లు తెలిసింది?

■ ఆ సినిమా కోసం నిర్మాతలు నన్ను ఆడిషన్ చేసిన మాట నిజమే. ఫొటోషూట్ కూడా పూర్తయింది. కానీ చివరకు అవకాశం మాత్రం రాలేదు. అలా ఎందుకు జరిగిందో నాకు తెలియదు.

• తెలుగులో ప్రస్తుతం మీరు అంగీకరించిన కొత్త సినిమాలేవి?

■ గీతా ఆర్ట్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను. దీనితో పాటు మరి కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

నరేష్ నెల్కి

అనన్యమైన ఆలోచన!



వయసు పదహారు.. తనకే ఆ అంశం మీద అంతంతమాత్రం అవగాహన. కానీ వందలమందిని చైతన్యం చేసే ఆలోచన చేసింది అనన్య.

ఢిల్లీకి చెందిన అనన్య బ్రిటీష్ హై స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నది. సాధారణంగా అయితే నెలసరి సమస్యల గురించి పదహారేళ్ల ప్రాయంలో అంతంతమాత్రంగా అవగాహన ఉంటుంది. ఈ అంశం మీద పూర్తి అవగాహన పెంచుకొని వందల మంది విద్యార్థులను చైతన్యపరుస్తుంది. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద బాలికలకు సహాయం చేయడానికి గత సంవత్సరం ఈ నిర్ణయం తీసుకున్నది. సానిటరీ న్యాప్‌కిన్లు కొనలేని పరిస్థితుల్లో ఉన్నవాళ్లకు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నది. ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవడం చూసి చలించిన అనన్య తనవంతుగా అవగాహన కల్పించాలనుకున్నది. అవగాహన లేకపోవడం వల్ల నెలసరి సమయంలో పాఠశాలలకు గైర్హాజరు కావడం, బయటికి చెప్పుకోలేకపోవడం, వ్యక్తిగత సమస్యలకు గురవుతుండడం తెలుసుకొని ఈ విషయంపై మాట్లాడాలనుకున్నది. అనన్య వైజాగ్‌కు చెందిన సంపూర్ణ స్వచ్ఛత అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేస్తున్నది.ప్రతీ నెల ఢిల్లీలోని ఖుషీ సంస్థకు 500 సానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా ఇస్తున్నది.

కాంతివంతమైన చర్మం కోసం

చర్మ సమస్యల నుంచి విముక్తి పొందేందుకు చాలామంది ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడుతుంటారు. అయితే వాటివల్ల సమస్య పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తలెత్తుతుంటాయి. ఇంట్లోనే చర్మ సమస్యలకు చెక్ చెప్పొచ్చు.



- ఎగ్‌వైట్‌ని ముఖంపై సన్నటి పొరలా రాయాలి. అది సహజంగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికోసారి ఇలా రాయాలి.
- కీరదోస ముక్కలు రెండింటిని కనురెప్పలపై ఉంచాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. దీనిని రోజుకు నాలుగుసార్లు ప్రయత్నించొచ్చు.
- ఆలుగడ్డ రసాన్ని ముఖానికి పట్టించాలి. కొద్ది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ పద్ధతిని వారానికి రెండుసార్లు ప్రయత్నించాలి.
- అర టీ స్పూన్ బేకింగ్ సోడాను రెండు స్పూన్ల నీళ్లలో కలిపి ఆ మిశ్రమాన్ని చర్మంపై రాయాలి. మూడు నిమిషాల పాటు మసాజ్ చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి ప్రయత్నించండి.
- తాజా టమాటాను ముక్కలుగా చేసి ముఖానికి రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ రెమిడీని వారానికి మూడుసార్లు పాటించవచ్చు.
- చిటికెడు పసుపు స్పూన్ రోజ్‌వాటర్‌లో కలుపాలి. ఆ మిశ్రమాన్ని ఫేషియల్‌లా స్కిన్‌పై రాయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- అర టీస్పూన్ శనగపిండిని ఒక టేబుల్ స్పూన్ నీటిలో కలిపి ఓ మిశ్రమంలా తయారు చేయాలి. దానిని ముఖంపై రాసి పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. ఇలా వారానికి రెండుసార్లు ప్రయత్నించాలి.

గొప్ప విషయం.. మంచి పరిణామం

ఇరవై ఐదు మంది అమ్మాయిలు.. అందరూ 15 నుంచి 30 సంవత్సరాల వయసు మధ్యగలవారే. దేశం గర్వించదగ్గ పనిచేస్తున్నారు. ఒక మంచి పరిణామానికి శ్రీకారం చుట్టారు. ఎవరు వాళ్లు.. ఏంటా పని?

కొన్ని పనులు అనివార్యంగా జరిగిపోతుంటాయి. వాటిని ఆపడం ఎవరితరం కాదు. ఇది కూడా అలాంటిదే. మహిళలు రాణించలేని రంగంలేదని మరోసారి స్పష్టం చేశారు. దేశం గర్వించదగ్గ పని చేసి చూపుతున్నారు. భారతదేశం నుంచి మొదటి అంతర్జాతీయ ఐస్ హాకీ క్రీడా బృందం సిద్ధమయింది. విదేశాల్లో జరిగే అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో ఈ జట్టు ఆడనున్నది. కెనడాకు చెందిన ఆంద్రూ ఫెరెన్స్ ఒలింపిక్స్‌లో నాలుగు సార్లు బంగారు పతకాన్ని సాధించింది. ఆమె సారథ్యంలో ఈ జట్టు శిక్షణ పొందుతున్నది. ఎలాంటి నిధులు, కనీస అవసరాలు లేకుండా కష్టపడి ఆంద్రూ 25 మంది అమ్మాయిలకు శిక్షణనిచ్చింది. ఆటకు సంబంధించిన వస్తులేమీ లేకున్నా పిల్లల్ని తీర్చిదిద్దింది. దాతల సహకారంతో ఇప్పటికే రెండు అంతర్జాతీయ టోర్నమెంట్‌ల్లో పాల్గొన్నారు. ఐస్ హాకీ చాలా ఖర్చుతో కూడుతున్న ఆట. దేశ ప్రగతిని చాటే ఆట కాబట్టి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే అమ్మాయిలు మరిన్ని విజయాలు సాధిస్తారు. వీళ్లు ఇప్పటికే రెండు డాక్యుమెంటరీలను కూడా చిత్రీకరించారు.




నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 11 ఫిబ్రవరి 2018

కదిలించే గ్రంథాలు

ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్

హైదరాబాద్ సంస్థానపు చివరి ప్రధాని మీ ర్ లాయక్ అలీ రాసిన ఆంగ్ల రచన ఇది. 1947-48 మధ్య ఢిల్లీ-హైదరాబాద్ మధ్య నడిచిన దౌత్యం, భారత్‌లో సంస్థానం విలీనం వంటివి దీనిలో ప్రధానాంశాలు. ఈ గ్రంథంలోని ఇతివృత్తాలు, శైలి ఆకట్టుకొనేలా ఉంటాయి.





మరణం లేని మీరు


టి. లోబ్‌సాంగ్ రాంపా 'you for ever' పేరిట రాసిన ఆంగ్ల గ్రంథానికి పీజీ రామ్మోహన్ చేసిన అద్భుతమైన అనువాదమిది. భౌతికమైన జీవితానికి, ఆధ్యాత్మిక లోకానికి మధ్యనున్న అనుసంధానాన్ని తిరుగులేని విధంగా నిరూపించిన గ్రంథమిది. మరణానంతర జీవితాన్ని శాస్త్రీయంగా వివరించింది.



పిరదౌసి


పద్య కవిత్వాన్ని కొత్తదారులు పట్టించిన జాషువా రచన ఇది. గజనీ మహ్మద్‌ను నమ్ముకొని జీవితాన్నే భంగం చేసుకొన్న పారసీకవి పిరదౌసీ కథ ఇది. అడుగడుగునా మేలిమి ముత్యాల్లాంటి పద్యాలు జాషువా కలం నుంచి జాలువార్చిన కావ్యమిది.

గాలీబు గీతాలు



తొలి నాళ్లలో ఉర్దూలో బలమైన కవి మీర్జా అసదుల్లాఖాన్ రాసిన గజల్స్, రుబాయిల ప్రేమైక జీవన దైన్యపు కవిత్వాన్ని మహాకవి దాశరథి 'తెలుగేనా' అన్నంత మౌళికంగా అనువదించిన రచన ఇది. గాలీబు 'పూని' రాసినట్టుగా ఉందని దాశరథిని విమర్శకులు సైతం పొగిడేలా చేసిన రచన.

ఏడు తరాలు



ఎలెక్స్ హేలీ రచించిన 'ROOTS' కు సహవాసి చేసిన సంక్షిప్తానువాదం. ఏడో తరపు నీగ్రో హేలీ తన ముత్తాత మూలాలను శోధించి రాసిన అద్భుతమైన కథ ఇది. ఒళ్లు గగుర్పొడిపించేలా ఉంటుంది.

ఏనుగు నరసింహారెడ్డి
తెలంగాణ సాహిత్య అకాడమి
కార్యదర్శి, సెల్ : 89788 69183

రంగు..రుచి.. ఉల్లాసం!



బ్లాక్ టీ..

అసలు టీ అనేదే చైనాలో పుట్టిందట. ఈ బ్లాక్ మూలాలు కూడా అక్కడే ఉన్నాయి. తేయాకులను టెంపరేచర్‌ని కంట్రోల్ చేసి ఆక్సిడైజింగ్ పద్ధతిలో ప్రాసెస్ చేసి ఈ టీ పొడిని తయారు చేస్తారు. చైనాలో నుంచి వివిధ దేశాలకు ఈ బ్లాక్ టీ ప్రాశస్త్యం పాకింది. కొన్ని దేశాల్లో ఈ తేయాకును ఎండబెట్టి కరెన్సీ తయారీకి కూడా వాడేవాళ్లు. 1610లో యూర ప్ దేశాలకు ఈ టీ వెళ్లింది. ఆ తర్వాత 1658లో ఇంగ్లండ్‌కి చేరింది. ఆ తర్వాత దీనికోసం చక్కెర ఉత్పత్తి కూడా మొదలైంది. ఇదంతా జరుగడానికి రెండు సంవత్సరాల కాలం పట్టింది. అంటే 1700 సంవత్సరంలో టీలో చక్కెర వేసుకోవడం ఇంగ్లండ్ వాసులు ఇష్టపడ్డారట. బ్లాక్ టీలు కూడా వెరైటీలు ఉంటాయి. అస్సామీ చాయ్.. దీన్ని 1823లో కనిపెట్టారు. మన భారత దేశంలోని అస్సోంలోనే టీ పుట్టుక జరిగింది. డార్జిలింగ్‌లో 1835 నుంచి ఈ టీ ప్లాంటేషన్‌ని చేపట్టారట ఇంగ్లీష్ వాళ్లు. ఆ తర్వాత మరిన్ని వెరైటీ బ్లాక్ టీల పుట్టుక జరిగిందట.



గ్రీన్ టీ..

ఈ 'టీ' ఈ మధ్య బాగా పాపులర్ అయింది. అందరూ ఆరోగ్యరీత్యా ఈ టీని బాగా వంటబట్టించుకున్నారు. అయితే చైనా వాళ్లకి టీ అంటే గ్రీన్ టీనే అంటే ఇప్పటికీ కూడా. అక్కడ మునుపు వైద్యం కోసం వేడి నీళ్లలో ఈ ఆకులను వేసి మరిగించేవారు. అలా మొదలైన గ్రీన్ టీ సేవనం ఖండంతరాలు వ్యాపించింది. క్రీ.పూ. 2737లో ఈ గ్రీన్ టీ పుట్టుక జరిగిందని అంటారు. అలాగే బౌద్ధ సన్యాసులు క్రీ.పూ. 500 సంవత్సరంలో ఈ గ్రీన్ టీ విశిష్టత గురించి తెలుసుకున్నట్టు కథలు ఉన్నాయి. కానీ పూర్తి ఆధారాలు ఎక్కడా లేవు. కాకపోతే 1190 సంవత్సరంలో జపాన్‌లో ఈ గ్రీన్ టీ పాపులర్ అయింది. అది కూడా చైనాకి వచ్చిన ఒక బౌద్ధ సన్యాసి ఈ గ్రీన్ టీని కనుగొని వాటిని దేశదేశాలకు పరిచయం చేశాడు. ఇప్పటికీ చైనా, జపాన్ గ్రీన్ టీ ఉత్పత్తిలో, ఎగుమతిలో మిగతా దేశాలకంటే ముందున్నాయి.

తెల్లదనం అంటే గుర్తొచ్చేది.. మబ్బులు.. ఆకుపచ్చగా ఉండే కలలు.. స్వచ్ఛతను కురిపించే మంచు.. ఆర్చిడ్ పువ్వులాంటి సుగంధం.. ఒక టీ గురించి చైనా చక్రవర్తి వర్ణన ఇది.. టీ పుట్టింది కూడా చైనాలోనే అని తెలుసా? టీ ఎన్నో రకాలు. ఒక్కో 'టీ' ఒక్కో సంవత్సరంలో ఒక్కో దేశంలో పుట్టింది.. దేశవిదేశాలకు ఎగుమతైంది. ఆ వెరై'టీ'లు ఎన్నో. రంగు.. రుచి.. ఉల్లాసాన్ని పంచే అలాంటి వెరై'టీ'ల సమాహారం ఇది.



హైబిస్కస్ టీ..

మందార పువ్వులు చూడగానే ఇట్టే ఆకర్షిస్తాయి కదా! అందుకేనేమో వాటితో కూడా టీ తయారు చేయాలనుకున్నారు. మిగతావన్నీ తేయాకుల నుంచి తయారు చేస్తే.. ఈ టీ మాత్రం మందార పువ్వులోంచి పుట్టుకొచ్చింది. కాకపోతే దీన్ని ఎవరు, ఎప్పుడు, ఎక్కడ కనిపెట్టారో మాత్రం ఆధారాలు లేవు. ఎలా తయారు చేస్తారో మాత్రం ఉంది. దీన్ని చాలా రకాలుగా తయారు చేసుకోవచ్చు. మందార పువ్వులను ఎండబెట్టి పొడిలా చేసుకొని వేడినీళ్లలో వేసి కాచుకోవచ్చు. లేదా మందార పువ్వులను పేస్ట్ చేసి దాన్ని కూడా వేడినీళ్లలో కలిపి తాగేయొచ్చు. ఈ టీ కాస్త చేదుగా ఉంటుంది. కాబట్టి చక్కెర తప్పక కలుపుకోవాల్సిందేనట. దీన్ని కాస్త వెరైటీగా కావాలనుకుంటే నిమ్మరసం, తేనె మిక్స్ చేసి తాగితే మరింత లాభం చేకూరుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు.



ఒలాంగో టీ..

మిగతా టీలకు ఇది కాస్త డిఫరెంట్. పైగా ఈ టీ మాదంటే మాదని ఇప్పటికీ చైనా, తైవాన్ దేశాలు తేల్చుకోలేకపోతున్నాయి. కాబట్టి దీని పుట్టుక ఎప్పుడో మాత్రం తెలియరాలేదు. కాకపోతే చైనావాళ్లు ఈ టీని మాత్రం ముదిరిన తేయాకులను చైనీస్ డ్రాగన్‌లాగా ఆక్సిడైజ్ చేసి ఆ ఆకులతో ఈ టీని తయారు చేస్తారు. దీని వెనుక ఇంకో కథ కూడా ఉందండోయ్! వూ లియాంగ్ అనే వ్యక్తి అనుకోకుండా ఈ టీని తయారు చేశాడు కాబట్టి ఒలాంగో అని పేరు పెట్టుకున్నాడట. ఎత్తైన, చల్లని ప్రదేశాల్లో మాత్రమే ఈ తేయాకు పంట పండుతుందట. ఇక తైవాన్ చైనా వాళ్లకు భిన్నంగా లైట్‌గా ఉండే ఒలాంగో టీని తయారు చేయడంలో ఫేమస్. ఇండియా, శ్రీలంక, జపాన్, థాయ్‌లాండ్, న్యూజీల్యాండ్‌లో ఈ తేయాకు పంటను ఎక్కువగా పండిస్తారు.





వైట్ టీ..

మనం చైనా నుంచి టీ పుట్టిందని చెప్పుకొన్నాం కదా! అ తెల్లని టీ తయారీ కూడా మొదట అక్కడే జరిగింది. అయితే ఇప్పుడు దొరికే తెల్లని టీ అసలైనది కాదని చాలామంది వాదిస్తున్నారు. ఏది ఏమైనా.. తెల్లని టీ అనేది క్రీ.శ 600 నుంచి 1300 సంవత్సరం మధ్యలో పుట్టిందని ఆధారాలు ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే హ్యూజాంగ్స్ అనే చక్రవర్తి కోసం ప్రత్యేకంగా ఇది తయారు చేయబడిందట. ఆయన క్రీ.శ 960నుంచి 1297లో పరిపాలన చేపట్టాడు. ఆయన కోసం రహస్యంగా ఈ తేయాకును పండించేవారట. తేయాకు చిగుళ్లు, ఆకుల నుంచి టీ తయారవుతుంది. కానీ ఈ టీమాత్రం పసి మొగ్గలుగా ఉన్నప్పుడే తుంచి వాటిని ఎండబెట్టి పొడి కొడతారు. దీంట్లో వేరే పౌడర్ కలిపి ఆ చక్రవర్తికి ఇచ్చేవారట. అలా తెల్లని టీ ప్రాచుర్యంలోకి వచ్చిందని చెప్తుంటారు.

క్లాసిక్ మూవీ

ఏడిపించే 'జోకర్'

అది మనసు మాయో లేక హార్మోనుల ప్రభావమో తెలియదు కాని, యవ్వనపు తొలినాటి నుంచి అవతలి వ్యక్తి మీద ఆకర్షణ మొదలవుతుంది. అది బలమై ప్రేమగా మారుతుంది. ప్రేమ మనసుకు ఆనందాన్నిస్తుంది. ఆ ఆనందం కోసం మనిషి పరితపిస్తుంటాడు. కానీ విధి ఆడే వింత నాటకంలో అవతలి వ్యక్తి ప్రేమని పొందలేకపోతారు చాలామంది. జీవితంలో ప్రతి మనిషీ ఇలాంటి స్థితిని ఎదుర్కొంటాడు.



జీవితం ఒక సర్కస్ అయితే బాధలన్నీ గుండెమాటున దాచుకొని మొహంలో ఆ భావాలు కనపడకుండా రంగపులుముకొని ప్రేక్షకులను నవ్వించడమే ఓ జోకర్ చేయాల్సింది. అతని జీవితంతో.. పేదరికంతో.. బాధలతో.. ఇలా దేనితోనూ ప్రేక్షకులకు సంబంధం లేదు. ఒక్కసారి జోకర్ పాత్ర ధరించాక మనం నిజంగా ఏడ్చినా అందరూ నవ్వుతారు. అది లోకం తీరు. ప్రపంచం అనేది సర్కస్ అయితే ప్రతివాడు ఓ పాత్ర పోషించాల్సిందే. పుట్టేది ఇక్కడే చావాల్సింది ఇక్కడే. ఇదే స్వర్గం ఇదే నరకం.

క్లాస్‌రూమ్‌లో రాజు అందరినీ నవ్విస్తుంటాడు. కొత్తగా వచ్చిన టీచర్ రాజు అమాయకత్వాన్ని చూసి అభిమానిస్తుంది. తన తండ్రి ఏం చేస్తుండేవాడో రాజుకి తెలియదు. ఒక సందర్భంలో తల్లిని నిలదీస్తాడు. రాజు తండ్రి ఒక సర్కస్‌లో జోకర్ అని, అందర్నీ నవ్విస్తూనే కన్నుమూశాడని చెబుతుంది. ఓ జోకర్ నిజంగా ఏడ్చినా జనానికి అది హాస్యమే. కనుక ఆమెకి జోకర్ అంటే ఇష్టం లేదు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజు జోకర్ కాకూడదని అనుకుంటుంది. తన తండ్రి సర్కస్‌లో జోకర్ అని తెలిసి ఆనందపడుతాడు రాజు.

తనని ప్రత్యేకంగా అభిమానించే టీచర్ అంటే రాజుకు చాలా ఇష్టం. రాజు టీచర్‌ని ప్రేమిస్తాడు. ఆమె సెలవులకు వెళ్లిపోతుంటే బాధపడుతాడు. సెలవులన్నీ భారంగా గడుపుతాడు. సెలవులు ముగిశాయి. రాజు స్టేషన్‌లో ఆమె కోసం ఎదురుచూస్తాడు. ఆమె వచ్చింది, తనకు కాబోయే భర్తతో. వాళ్లిద్దరినీ ఏకాంతంలో చూసిన ప్రతిసారీ రాజు మనసు కలుక్కుమంటుంది. రాజుది తొలి యవ్వనపు ప్రేమ.

తనను చూసి అందరూ నవ్వుతున్నారని రాజు బాధపడుతుంటే 'మూణ్నాళ్ల ముచ్చట' అయిన జీవితంలో మనస్ఫూర్తిగా మనిషిని నవ్వించేది ఒక జోకరేనని చెబుతాడు టీచర్ ఫియాన్సీ మనోజ్‌కుమార్. ఆ మాటలు రాజు మనసుకి హత్తుకుంటాయి. హాయిగా అనిపిస్తాయి. తను జోకర్ అయ్యి అందరినీ నవ్విస్తాడు. తను జోకర్ అని నమ్మిన రాజు రోడ్డు మీద ఏదో గారడీలు చేస్తుంటాడు. దాంతో స్కూల్ నుంచి గెంటేస్తారు. తనని అభిమానించే టీచర్ కూడా కాపాడలేకపోతుంది. టీచర్ పెళ్లి చేసుకొని భర్తతో వెళ్లిపోతుంది. దాంతో రాజు హృదయం వికలం అవుతుంది.

ముంబై వీధుల్లో తమాషాలు చేస్తూ జీవనోపాధి పొందుతుంటాడు రాజు. ఓ విదేశీ సర్కస్ బృందంతో పాటు సర్కస్ కంపెనీలోకి దూరుతాడు. డబ్బు కోసం రింగ్ మాస్టర్‌గా సింహాలని ఆడించబోతాడు. ప్రమాదం తప్పుతుంది. కానీ రాజులోని జోకర్‌ని గమనించిన కంపెనీ యజమాని రాజుని జోకర్‌ని చేస్తాడు. అక్కడ కొత్త విద్యలు నేరుస్తాడు. విదేశీ వనిత రీనాతో పరిచయం పెరుగుతుంది. ఆమెని ప్రేమిస్తాడు. రీనా కూడా రాజు అంటే అభిమానం చూపుతుంది. రీనాని తన తల్లికి పరిచయం చేస్తాడు. రీనాని కోడలిగా ఊహించుకొని ఆ తల్లి హృదయం ఆనందపడుతుంది. రాజు కలల ప్రపంచంలో విహరిస్తాడు. కానీ జీవితం కల కాదు కదా. జీవితంలో కలలు ఎన్ని అయినా కనొచ్చు. కానీ కన్న ప్రతి కలా నిజం కావాలనుకొంటే బాధే మిగులుతుంది. రాజుకి కూడా అదే జరిగింది. విదేశీయులు వెళ్లిపోయే సమయం వస్తుంది. రీనా రాజు అంటే ప్రేమ లేనట్టే వెళ్లిపోతుంది. రాజు హృదయం బీటలు వారుతుంది.

ఒంటరిదైన 'మీను' తనని తాను రక్షించుకొనేందుకు మగవేషంలో తిరుగుతుంటుంది. ఎప్పటికైనా హీరోయిన్ కావాలనే కల ఆమెది. రాజుకి ఆమెతో పరిచయం అవుతుంది. ఇద్దరు కలిసి మళ్లీ రోడ్డు మీద తమాషా చేస్తూ బతుకుతుంటారు. ఒక రోజు మీను అమ్మాయని తెలుస్తుంది రాజుకి. ఆమె అబద్ధం చెప్పడం రాజుకి నచ్చదు. వెళ్లిపోవాలనుకొంటాడు. కానీ ఆమె అతణ్ని ప్రేమిస్తున్నానని చెబుతుంది. వెనుకా ముందు లేని మీను.. తనని వదిలి వెళ్లొద్దని అంటుంది. ఎండిపోయిన రాజు గుండెకి ఇది తొలకరి చినుకులా అనిపిస్తుంది. కొంతకాలం సజావుగా సాగుతుంది. మీను నాట్యప్రదర్శనల్లో కాలం బాగానే గడుస్తుంది. ఒక ప్రదర్శనలో తన అభిమాన నటుడు మీనుని మెచ్చి హీరోయిన్‌గా అవకాశం ఇస్తాడు. మీను పెద్ద హీరోయిన్ అవుతుంది. రాజుని మరిచిపోతుంది. ఒంటరి వాడైన రాజు హృదయం ముక్కలవుతుంది.

'లోకంలో చాలా మందీ ఇంతే. ప్రేమిస్తారో.. ప్రేమించినట్టు నటిస్తారో.. ప్రేమించి తమని తాము మోసం చేసుకుంటారో.. ప్రేమలో ఉండే కష్టాలకు జంకి సుఖం వైపు పరుగుపెడుతారో..' తెలియదు.

రాజు తన చివరి సర్కస్ ప్రదర్శనకు ఈ ముగ్గురినీ పిలుస్తాడు. ఒక జోకర్ మనసులో ఉండే ఆవేదనని వెళ్లగక్కుతాడు. ప్రేమ దొరకని ఒక పేద హృదయపు ఘోషని వినిపిస్తాడు. ఆ బాధలో నుంచే గర్వంగా చెప్పుకొంటాడు 'మేరా నామ్ జోకర్' అని.

మనిషి ప్రేమని కోరుకుంటాడు. ప్రేమ కోసం తపిస్తాడు. చుట్టూ ఎంతో మంది మనుషులున్నా ప్రేమించే హృదయం అందరికీ దొరుకదు. ఒక జోకర్ అందరినీ నవ్విస్తాడు, అందరూ చప్పట్లు కొడుతారు. తనని అందరూ ప్రేమిస్తున్నట్టు అనిపిస్తుంది, కానీ తనని ఓ నవ్వించే బొమ్మగానే చూస్తారు తప్ప మనిషిగా కాదు. khwaja ahmad abbas అందించిన స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. దాదాపు మూడున్నర గంటల సినిమా అయినా ఎక్కడా పట్టు సడలకుండా మనసును హత్తుకుపోతుంది. సూటిగా ప్రవర్తించని మనిషి తత్వాన్ని ఎదుటి వ్యక్తి ప్రేమనీ గుర్తించీ గుర్తించనట్టు ప్రవర్తించే స్త్రీతత్వాన్ని చాలా బాగా చూపిస్తారీ చిత్రంలో. నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా, ఎడిటర్‌గా.. బహుముఖ ప్రజ్ఞ కలిగిన ఫిలిమ్ మేకర్‌గా మరోసారి నిరూపిస్తాడు రాజ్‌కపూర్.

రాజుగా రాజ్‌కపూర్ నటన అద్భుతం. అడుగడుగునా కరుణసరం ఒలికిస్తాడు. ముఖ్యంగా జోకర్ పాత్రలో 'అరె భాయ్ జరా దేక్ కె చెలో..' అందరికీ నచ్చే పాట. 'జీనా యహా మర్నా యహా' ఒక గొప్ప తత్వార్థాన్ని దాచుకొన్న పాట. 'జానే కహా.. గయే ఓ దిన్' అనే పాట అయితే భారత చలనచిత్ర చరిత్రలో అద్భుత విషాదగీతంగా చెప్పుకోవచ్చు. ముఖేష్ గళంలో అమృతంగా మారిన స్వరాలు, లోపిచ్ నుంచి హైపిచ్‌లోకి మారుతూ మన మనసులోని మనకే తెలియని బాధని వెలికి తీస్తుంది.

ఈ గొప్ప సినిమా బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్ అయ్యింది. బహుషా ప్రేక్షకులు ఇంత విషాదాన్ని తట్టుకోలేకపోయారేమో. బాక్సాఫీస్ దగ్గర ఫెయిలైనా బెస్ట్ మ్యూజిక్, బెస్ట్ సింగర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ సినిమాటోగ్రఫీ విభాగాల్లో ఫిలింఫేర్ అవార్డులు పొందిన అద్భుత భారతీయ చిత్రం 'మేరా నామ్ జోకర్'!!

చక్రధర్‌రావు బైరంపల్లి, సెల్: 9848519435

నాకిష్టమైన పాటలు..

హలో ఎక్కడున్నా..	-	హలో
తెలుసా తెలుసా	-	సరైనోడు
నీ కళ్లలోన కాటుక	-	జై లవ కుశ
రెండు కళ్లు	-	మహానుభావుడు
అతిలోక సుందరి	-	సరైనోడు
తెలుగు బెంగాలీ	-	దడ
ఏం చెప్పను	-	నేను శైలజ
గాలి వాలుగా	-	అజ్ఞాతవాసి
బ్రేకప్ సాంగ్	-	అర్జున్‌రెడ్డి
ఏమిటో	-	అందాల రాక్షసి

-పి. మధుసూదన్, హైదరాబాద్

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ :
zindagi.nt@gmail.com
మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం,
8-2-603/1/7,8,9 కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

సుడోకు

డైలీ సుడోకు 123 సమాధానం

8	9	6	2	4	1	5	7	3
7	2	5	3	6	9	1	4	8
3	4	1	8	5	7	6	2	9
5	7	3	9	8	4	2	6	1
6	1	4	7	2	3	9	8	5
2	8	9	6	1	5	7	3	4
9	5	8	4	7	6	3	1	2
4	3	7	1	9	2	8	5	6
1	6	2	5	3	8	4	9	7

డైలీ సుడోకు -124

6			1	4				
	4	3			2	1		
		7	5					
2					7	6		
8			2		6			1
		5	4					9
					5	4		
		1	9			3	7	
				7	1			8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



కార్తీ
@Karthi_Offl

కార్తీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య:
466,748

చిన్న పిల్లలు పెద్దల కంటే బాగా ఆలోచిస్తారనడానికి మా పాపే చిన్న ఉదాహరణ. నాన్న ఎప్పుడైనా ఊళ్లో లేనప్పుడు మా పాప అమ్మ దగ్గరకు వెళ్తుంది. అమ్మను తన రూమ్‌కు తీసుకెళ్తుంది. నాన్నమ్మ ఒంటరిగా ఫీలవొద్దనేదే మా అమ్మాయి చేష్టల ఉద్దేశం

కామన్‌మ్యాన్ వాయిస్

ఒకడి గతం నీకు చరిత్ర. నీ గతం నీకు జ్ఞాపకం. కానీ మరొకరికి చరిత్రవ్వాలి!
-Raj Uragonda

నమ్మేవాళ్లు ఉన్నంతకాలం మోసం చేసే వాళ్లుంటారు. అజ్ఞానమే నమ్మకానికి కారణం. నమ్మకమే మోసానికి కారణం.
-Bala Kamichetty

దేశాన్ని దోచుకోవడానికి చొరబడిన ఆర్యులు, మొఘలులు, బ్రిటీష్ వాళ్ల మూలాలు ఇంకా ఇక్కడే ఉన్నాయి.
-Harish Kuvvakula

వైరల్ వీడియో




రెండు దేశాల సరిహద్దుల్లో నుంచి ఓ ప్రేమ జంట పరుగెడుతుంది. అంతలోనే భీకర యుద్ధం. ఇది మెహబూబా సినిమా ఫస్ట్ లుక్ టీజర్. పూరిజగన్నాథ్ తన కొడుకును హీరోగా పెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ వీడియో యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్ దాటింది.

MEHBOOBA First Look Teaser | A Puri Jagannadh Film | Akash Puri | Neha Shetty | Sandeep Chowta
Total views : 1,106,252+
Published on Feb 8, 2018

నమస్తే తెలంగాణ
అల్లరి
[హైదరాబాద్]
ఆదివారం 11 ఫిబ్రవరి 2018

తెలుసుకుందాం..!

రక్షణ వ్యవస్థలో పోలీసులు ఎంత కీలకమో మీ అందరికీ తెలిసిందే. అయితే వివిధ కేడర్లలో ఉన్న పోలీసులను గుర్తుపట్టడం ఎలాగో తెలుసుకుందామా పిల్లలూ!



- కానిస్టేబుల్‌కి భుజం వద్ద రెండు వరుసల రెడ్‌లైన్ పట్టీ ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్‌కి రెడ్‌లైన్ పట్టీలు మూడు వరుసలుంటాయి.
- అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)కు రెడ్ అండ్ బ్లూ స్ట్రిప్స్‌తో ఒక స్టార్ ఉంటుంది.
- సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు రెడ్ అండ్ బ్లూ స్ట్రిప్స్‌తోపాటు రెండు స్టార్స్ ఉంటాయి.
- ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు రెడ్ అండ్ బ్లూ స్ట్రిప్స్‌తోపాటు మూడు స్టార్స్ ఉంటాయి
- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌కు మూడు స్టార్స్ ఉంటాయి.
- అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, అడిషనల్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌కు మూడు సింహాల ఇండియన్ ఎంబ్లమ్ ఉంటుంది.
- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌కు మూడు సింహాల ఎంబ్లమ్+స్టార్ ఉంటుంది.
- సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు మూడు సింహాల ఎంబ్లమ్ + రెండు స్టార్స్ ఉంటాయి.
- అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఐపీఎస్ + స్టార్ (ఒక ఏడాది అనుభవం) ఉంటాయి.
- అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఐపీఎస్ + స్టార్స్ (రెండేండ్ల అనుభవం) ఉంటాయి.
- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)కి ఐపీఎస్ + కత్తి, లాఠీ + స్టార్ ఉంటాయి.
- డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఐపీఎస్ + కత్తి, లాఠీ + మూడు సింహాల ఎంబ్లమ్ ఉంటాయి.

జోక్స్ కార్నర్

భయం..



రంగ : ఒరేయ్ రాజు మీ ఇంట్లో గొడవైతే నువ్వెందుకురా బావి దగ్గర చెక్కలు సర్దుతావు. ఏం మీ ఆవిడ ఆత్మహత్య చేసుకుంటుందని భయమా?
రాజు : కాదురా అయ్యా.. ఆ కోపంలో ఎక్కడ నన్ను బావిలోకి తోస్తుందోనని.

నిజమే..



సెలూన్ షాపునకు వెళ్లాడు సుధీర్..
సుధీర్ : వెంట్రుకలు బాగా తగ్గించండి.
బార్బర్ : ఎంత తగ్గించమంటారు సార్..?
సుధీర్ : మా ఆవిడ చేతికి అందనంతగా తగ్గించు చాలు!

పిల్లలూ! తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో మీకు తెలుసా? వాటి సామర్థ్యం, ఆయకట్టు, నీటి నిల్వలు, లెక్కలపై మీకెమన్నా అవగాహన ఉందా!? పోనీ.. ఏదైనా ఒక ప్రాజెక్టు గురించైనా పూర్తిగా తెలుసా? ఇవన్నీ మాకెందుకంటరా?.. అయితే మీరు కచ్చితంగా ఈ స్టోరీ చదువాల్సిందే. ఎందుకంటే ఖమ్మం జిల్లాకు చెందిన ఐదేండ్ల బాలుడు నెహాల్.. మన రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టు గురించి అడిగినా ఠక్కున సమాధానం ఇస్తాడు. ఏ మాత్రం తడబడకుండా లెక్కలన్నీ చెప్పేస్తాడు. అందుకే మీ అంత వయసులోనే నీటిపారుదల శాఖకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యాడు.!!

నెహాల్.. ఓ బ్రాండ్ అంబాసిడర్



హైదరాబాద్‌లోని జలసౌధ.. చీఫ్ ఇంజినీర్లు మొదలుకొని నీటి పారుదలశాఖ నిపుణులు, అధికారులతో మంత్రి హరీష్‌రావు మేధోమథనం నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టుల పరిస్థితిపై వివరాలు అడుగుతున్నారు. సమావేశం మొత్తం చాలా సీరియస్‌గా సాగుతున్నది. ఇంతలోనే వచ్చాడు నెహాల్.. 'సార్! నాకు ఆ వివరాలన్నీ తెలుసు అన్నాడు'. మంత్రి, అధికారుల అనుమతి తీసుకొని.. ఏకబిగిన 30 నిమిషాల పాటు తెలంగాణలోని ఎన్ని సాగునీటి ప్రాజెక్టులున్నాయి? వాటి నీటి సామర్థ్యం ఎంత? ఆయకట్టు ఎంత? లాభాలు ఎన్ని? తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల రీడిజైనింగ్‌తో ఉపయోగాలు ఏంటీ? అనే విషయాలన్నీ చకచకా చెప్పేశాడు. నెహాల్ మాట్లాడుతున్నంతసేపూ.. పిన్‌డ్రాప్ సైలెన్స్. తన ప్రసంగాన్ని అలా ముగించాడో లేదో మంత్రి నుంచి కిందిస్థాయి అధికారుల వరకూ చప్పట్ల వర్షం కురిసింది. అదీ నెహాల్ ప్రతిభ. ఐదేండ్ల వయసులోనే ప్రాజెక్టుల వివరాలు తెలుసుకొని అనర్గళంగా మాట్లాడాడు. ఆ సమావేశంలో అంతబాగా మాట్లాడాడు కాబట్టే.. మంత్రి హరీష్ రావు నెహాల్‌ను నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారు.

ఎవరీ నెహాల్..?

ఖమ్మం జిల్లా చింతకాని మండలం, పందిళ్లపల్లి గ్రామానికి చెందిన బుడతడే కోటి నెహాల్. తండ్రి కోటి హనుమంతరావు పెళ్లైన తర్వాత భార్య రజినీతో బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. గాజుల రామవరం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలో సంజయ్ గాంధీనగర్‌లో నివాసం ఉంటూ.. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏకైక సంతానం కోటి నెహాల్‌ను జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్‌లో యూకేజీ చదివిస్తున్నారు. అయితే నెహాల్ చిన్నప్పటి నుంచీ అన్ని పనుల్లో, చదువుల్లో చురుగ్గా ఉండేవాడు. ఒకటిన్నర వయసులో ఉన్నప్పుడు టీవీలో వచ్చే రాజకీయ నేతల చర్చలను ఆసక్తిగా వినేవాడట. మళ్లీ వారు కనిపించినప్పుడు ఠక్కున వారి పేర్లు చెప్పేవాడట. డీఎస్పీ అయి నేరగాళ్లను పట్టుకోవాలనేది నెహాల్ కోరిక. ఉదయాన్నే లేవడంతోనే రామ నామాన్ని జపం చేసి, యోగాతో రోజువారీ పనులను ప్రారంభిస్తాడు. తోటి విద్యార్థులతో కలివిడిగా ఉండే నెహాల్.. స్కూల్ టాపర్ కూడా. అన్ని ఆటల్లో పాల్గొంటాడు.



కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన కోటి నెహాల్

అలవోకగా ప్రాజెక్టుల వివరాలు..

తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులు, వాటి రీడిజైనింగ్, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను గుక్క తిప్పుకోకుండా చెప్పగలడు. అంతేకాకుండా గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ, ఇతర ప్రాజెక్టుల వివరాలతో పాటు వాటి సామర్థ్యం, ఖర్చులు, లాభ-నష్టాలను సైతం అలవోకగా వివరించగలడు. వీటితో పాటు ప్రాజెక్టుల రీడిజైనింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను మ్యాప్ ద్వారా వివరిస్తాడు. ప్రాజెక్టులతో తెలంగాణలోని రైతులకు కలిగే ప్రయోజనాలతో పాటు ఏ ప్రాజెక్టు కింద ఎన్ని ఎకరాల నీరు అందగలదో తెలియజేస్తున్నాడు. దాంతో పాటు మిషన్ భగీరథ ద్వారా హైదరాబాద్ మహానగరానికి ఏ విధంగా నీరు అందిస్తున్న విధానాన్ని పూసగుచ్చినట్లు వివరిస్తున్నాడు.

బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు..

గత ఆదివారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో మేధోమథన సదస్సులో మంత్రి హరీష్‌రావు, ఘంటా చక్రపాణి సమక్షంలో తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై నెహాల్ చేసిన ప్రసంగం అందర్నీ అకట్టుకున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు తుమ్మడిహట్టి నుంచి మేడిగడ్డ పాయింట్‌కు మార్చడం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో సహా పలు ప్రాజెక్టుల రీడిజైనింగ్ పూర్తి వివరాలు చెప్పాడు నెహాల్. నిపుణులు సైతం గుర్తుపెట్టుకోలేని విషయాలను నెహాల్ చెబుతుంటే అక్కడున్న పలువురు చీఫ్ ఇంజినీర్లు, నీటిపారుదల రంగ నిపుణులు, అధికారులు నివ్వెరబోయారు. నెహాల్ ప్రతిభను గుర్తించిన మంత్రి హరీష్‌రావు.. వెంటనే నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారు. నెహాల్ చదువుకయ్యే ఖర్చును ఇరిగేషన్ శాఖ భరిస్తుందని వెల్లడించారు. దీంతో నెహాల్ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి హరీష్‌రావు, అవకాశం కల్పించిన డిప్యూటీ స్పీకర్ పద్మాదేవెందర్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు. ప్రస్తుతం నీటిపారుదల శాఖ ఉత్తర్వుల మేరకు నెహాల్ తల్లిదండ్రులు, అధికారులతో కలిసి ప్రాజెక్టులను సందర్శిస్తున్నాడు. కాళేశ్వరాన్ని చూసి మురిసిపోతున్నాడు.



కాళేశ్వరం ప్రాజెక్టు చూపిస్తున్న ఇంజినీర్

ఊరికోసం సీఎం వద్దకు..

ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి ఏం మాట్లాడుతావని మంత్రి హరీష్‌రావు నెహాల్‌ను అడుగగా.. తన తండ్రి పుట్టిన ఊరిని బాగు చేయాలని కోరుతానని అన్నాడు. ఎందుకంటే గతంలో శీలం సిద్దారెడ్డి నీటిపారుదల శాఖా మంత్రిగా చేసినప్పుడు పందిళ్లపల్లి గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తానని మాట ఇచ్చాడట. అప్పటి నుంచి ఎత్తిపోతల పథకం ఊసే లేదు. దీంతో గ్రామంలో కరువుఛాయలు అలుముకున్నాయని అంటున్నాడు నెహాల్. అందుకే తమ గ్రామం పచ్చగా కళకళలాడేందుకు, గ్రామ రైతుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎత్తిపోతల పథకాన్ని నిర్మించమని కోరుతానని అంటున్నాడు బుడుతడు.

చిన్నతనం నుంచే రికార్డులు..

నెహాల్ జ్ఞాపకశక్తిని గుర్తించిన తెలంగాణ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి ప్రోత్సాహించారు. గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రతిభా పురస్కారం, అవుట్ స్టాండింగ్ పెర్ఫామెన్స్ ఇన్ జనరల్ నాలెడ్జ్ సర్టిఫికెట్లు అందుకున్నాడు. 2016 నవంబర్ 14న రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఈ చిన్నారి ప్రతిభకు ముగ్ధులైన ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని, బండారు దత్తాత్రేయ ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. వీటితో పాటుగా మరెన్నో మెడల్స్, ప్రశంసా పత్రాలు దక్కించుకున్నాడు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు-2, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు-1, ముంబై సూపర్ కిడ్-2, భారత్ వరల్డ్ రికార్డు-1, వండర్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డులను సాధించాడు. మూడుసార్లు ఉత్తమ బాలల అవార్డును అందుకున్నాడు.

తల్లిదండ్రులే గురువులు..

నెహాల్ తల్లిదండ్రులు అతని తెలివి తేటలను మొదటి నుంచి గుర్తించి వారే గురువులయ్యారు. ఎంఏ ఎకనామిక్స్ చేసిన తల్లి రజినీ.. నెహాల్ ఐక్యూను పెంచేందుకు బుక్స్ చదివించడం, కొత్త విషయాలు నేర్పడం, ప్రపంచ, దేశ, రాష్ట్ర చరిత్రను మననం చేయించడం మొదలు పెట్టారు. అలా వారి కష్టం వృథాపోలేదు. వారి అంచనాలను మించి అపారమైన జ్ఞాపకశక్తితో నెహాల్ దూసుకుపోతున్నాడు. నాలుగేండ్ల వయసులోనే ఏదైనా విన్నా, చూసినా ఇట్టే చెప్పేస్తుండేవాడు. కేవలం 9 నిమిషాల్లోనే తెలంగాణలోని 119 నియోజకవర్గాల పేర్లు, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధుల పేర్లను చెప్పేస్తాడు. అంతేకాదు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం వివరాలు, దాని పనితీరు, గోదావరి నదీ జలాల వినియోగం, తెలంగాణలోని ప్రాజెక్టుల తీరు తెన్నులను నాలుగేళ్ల క్రితమే చెప్పాడు.



తల్లిదండ్రులు హనుమంతురావు, రజినీలతో నెహాల్

రవికుమార్ తోటపల్లి

సైన్స్ బిట్స్



- జీకా వైరస్ 35 దోమ జాతుల వల్ల వ్యాప్తి చెందుతుందని అమెరికా జార్జియా యూనివర్సిటీ తెలిపింది.
- నాసా శాస్త్రవేత్తలు ఒక్కక్షణంలో వందకోట్ల సంఖ్యలను గణించే స్టాప్‌వాచ్ టైమర్‌ను కనిపెట్టారు.
- మాంచెస్టర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సముద్ర నీటిని తాగే నీటిగా మార్చగల గ్రాఫిన్ మాట్‌ను రూపొందించారు.
- కరువులో కూడా మంచి దిగుబడి ఇవ్వగల వరి వంగడాలను పండించొచ్చని జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు.
- ఒక్క సెకనులో ఐదు లక్షల కోట్ల ఛాయాచిత్రాలను తీసే కెమెరాలను లండన్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.


నీతికథ

నక్కబుద్ధులు




అనగనగా ఒక ఊళ్లో తుంటరి నక్క ఉండేది. దానికి ఒంటె మాంసం తినాలనిపించింది. అందుకు ఒంటెతో స్నేహం చేసింది. ఒకరోజు ఒంటె దగ్గరికి వెళ్లి 'ఒంటె బావా.. ఒంటె బావా..! అవతలి చెరువు గట్టున చెరుకు తోట ఉంది. వెళ్లి హాయిగా ఆరగిద్దామా' అంది. నక్క వంకర బుద్ధిని గమనించింది ఒంటె, అయినా అదేం చేస్తుందిలే అన్నదీమాతో 'సరే' అన్నది. చెరుకుతోటకు వెళ్లాలంటే ముందు గట్టు దాటాల్సిన అవసరం ఉంది. ఆ గట్టు దాటడానికి ఒంటె వీపు మీద నక్క కూర్చొంది. చెరుకుతోటలోకి వెళ్లిన వెంటనే తోట యాజమానిని చూసిన నక్క.. కావాలనే కూతపెట్టింది. అంటే యజమాని వెంటపడి ఒంటెని చంపేస్తే, ఎంచక్కా దాని మాంసం తినవచ్చనేది నక్క పన్నాగం. తోట యాజమాని రావడంతో నక్క పారిపోయింది. అక్కడే వున్న ఒంటె పరుగెత్తలేకపోయింది. ఆ తోట యాజమాని ఒంటెను చితకబాది వెళ్లిపోయాడు. ఒంటె చనిపోయుంటుందని భావించిన నక్క దగ్గరకు వెళ్లి చూసింది. ఒంటె బతికేవుందని గమనించింది. ఇంకోసారి పథకం వేయవచ్చులే అనుకుంది నక్క. తన దురాచలోనను పసిగట్టిన ఒంటె.. దానికి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నది. ఒడ్డు దాటేటప్పుడు నీరు ఎక్కువగా ఉన్న చోట తీసుకెళ్లి 'నాకు చాలా ఒళ్లునొప్పులుగా ఉన్నాయి. నేను ఇక నిన్ను మోయలేను' అని నక్కను నీళ్లలో వదిలేసింది. ఆ నీటి ప్రవాహంలో నక్క కొట్టుకుపోయింది. చూశారా! దురాశ దుఃఖానికి చేటు అంటారు ఇందుకే.

రంగులు వేయండి



చుక్కలు కలుపండి



ఆరేండ్లకే 5లక్షల మంది ఫాలోవర్లు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ముద్దులొలికే చిన్నారి పేరు అనస్తసియా న్యాజేవా. రష్యాకు చెందిన ఈ ఆరేండ్ల బాలిక ప్రస్తుతం సంచలనంగా మారింది. ఎందుకంటే ఈ బాలిక ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు రికార్డుస్థాయిలో 5.2 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ బాలిక పేరు మీద ఆమె తల్లి ఈ అకౌంట్ రన్ చేస్తున్నది. న్యాజేవా ఒక్క ఫొటో అప్‌లోడ్ చేస్తే లక్షల్లో లైకులు వచ్చేస్తున్నాయట. ప్రసుతం ఈ భూమ్మీద అత్యంత అందమైన బాలిక న్యాజేవా అంటూ నెటిజన్లు కీర్తిస్తున్నారు. దీంతో అతిచిన్న వయసులోనే పలు అంతర్జాతీయ బ్రాండ్‌లకు అంబాసిడర్‌గా పనిచేస్తున్నది. చైల్డ్ మోడల్‌గా అందర్నీ ఆకర్షిస్తున్నది న్యాజేవా. చిన్న వయసులోనే తన అందంతో పలు సంస్థలకు మోడలింగ్ చేస్తూ డబ్బులు సంపాదిస్తుందని అంటున్నారు. బొమ్మలాంటి ముఖకవళికలు, నీలికళ్లతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్నది.

మన యాస



కందీలు	:	లాంతరు
ఆర్సీలు	:	కళ్లజోడు
మక్కెండ్లు	:	మొక్కజొన్న



సుట్టాలు	:	బంధువులు
మాలస	:	ఎక్కువ
కైకిలి	:	కూలీ

కొయ్‌గూర	:	గొంగూర
కూడు	:	అన్నం
అసంట	:	దూరంగ
సిబ్బి	:	గుల్ల



మంచిమాటలు..

- వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్టు.. నిరంతరం నేర్చుకొనేవారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.
- అన్నం లేకపోవడం పేదరికం కాదు. కుటుంబంలో ఆప్యాయత లేకపోవడమే నిజమైన పేదరికం.
- జీవితమంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం చేయడమే. సమస్యలు లేని జీవితమంటూ ఉండదు.




సమంత, నాగచైతన్య

పెళ్లయిన తర్వాత..

వివాహానంతరం తొలిసారి వెండితెరపై సందడిచేయడానికి సిద్ధమవుతున్నారు నాగచైతన్య, సమంత దంపతులు. ఈ చిత్రానికి శివ నిర్వాణ ('నిన్నుకోరి'ఫేమ్) దర్శకత్వం వహిస్తారని సమాచారం. చైతన్య, సమంత ఇప్పటికే ఈ చిత్ర కథకు ఓకే చేశారని అంటున్నారు. గతంలో చైతన్య-సమంత కలిసి 'ఏమాయ చేసావె' 'ఆటోనగర్ సూర్య' 'మనం' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా పెళ్లయిన తర్వాత నాగచైతన్య, సమంత కెరీర్‌పరంగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో నాగచైతన్య ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు 'శైలజారెడ్డి అల్లుడు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో నటిస్తున్న 'సవ్యసాచి' విడుదలకు సిద్ధమవుతున్నది. ఇక సమంత ప్రస్తుతం రామ్‌చరణ్ సరసన 'రంగస్థలం' చిత్రంలో నటిస్తున్నది. మార్చి 30న ఈ చిత్రం విడుదలకానుంది.


పూజా హెగ్డే

ఆ పురస్కారాలు నాకు అక్కర్లేదు!

'మీకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు ఇప్పటికీ రాలేదని చాలా మంది గత కొంత కాలంగా నన్ను అడుగుతున్నారు. ఆ పురస్కారాలు నాకు అక్కర్లేదు. ప్రభుత్వాలు ఇచ్చే అవార్డుల కంటే సుబ్బిరామిరెడ్డి అందజేస్తున్న పురస్కారమే నా దృష్టిలో అత్యుత్తమమైనది' అన్నారు సీనియర్ నటులు కైకాల సత్యనారాయణ. టి.సుబ్బిరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఈ నెల 13న వైజాగ్‌లో ప్రముఖ సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణను 'విశ్వనట సామ్రాట్' బిరుదుతో సత్కరించి స్వర్ణకంకణాన్ని బహూకరించనున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో టి.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ 'గత 25 ఏళ్లుగా వైజాగ్ బీచ్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటి లింగాలను ప్రతిష్ఠించి మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా అదే తరహాలో మహా కుంభాభిషేకాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నాం. మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ పర్వదినాన దాదాపు 1000 చిత్రాల్లో నటించి గొప్ప నటుడిగా పేరు తెచ్చుకున్న కైకాల సత్యనారాయణను 'విశ్వనట సామ్రాట్' బిరుదుతో ఘనంగా సత్కరించనున్నాం. నేను నిర్మించిన పలు చిత్రాల్లో ఆయన నటించారు. ఆయనను ఎప్పుడో సత్కరించాల్సింది. అనుకోని కారణాలవల్ల ఆలస్యమైంది. హిందీలో యష్ చోప్రాతో కలిసి చాందిని, లమ్హే వంటి హిట్ చిత్రాల్ని నిర్మించాను. యష్ చోప్రాతో నాకున్న స్నేహబంధాన్ని దృష్టిలో పెట్టుకుని యష్ చోప్రా మెమోరియల్ పేరుతో జాతీయ పురస్కారాన్ని 2014 నుంచి అందిస్తున్నాం. ఇప్పటి వరకు లతా మంగేష్కర్, 2015లో అమితాబ్‌బచ్చన్, నటి రేఖ, షారుక్‌ఖాన్‌లను ఈ పురస్కారంతో సత్కరించాం. ఈ ఏడాదికి గానూ ప్రముఖ గాయని ఆశా భోంస్లేని సత్కరించనున్నాం. ఈ వేడుకను ఈ నెల 16న బాలీవుడ్ ప్రముఖులు పాల్గొనగా ముంబైలో జరగనుంది. ఇటీవల కాకతీయ కళావైభవ మహోత్సవం పేరుతో నెలకొల్పిన అవార్డుల వేడుకను త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్ని దేశవ్యాప్తంగా కూడా నిర్వహించాలనే ఆలోచనలో వున్నాం' అన్నారు. కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ ''విశ్వనట సామ్రాట్' పురస్కారంతో సుబ్బిరామిరెడ్డి నా గౌరవాన్ని పెంచుతున్నందుకు ఆనందంగా వుంది. ఒక రూపాయి ఆశించకుండా కళాకారులను సత్కరించే నిజమైన కళాకారుడు సుబ్బిరామిరెడ్డి. అవార్డులను మించిన పురస్కారాన్ని నాకు అందిస్తున్నందుకు ఆయనకు రుణపడి వుంటాను' అన్నారు. కైకాల సత్యనారాయణను సత్కరిస్తే ఇండస్ట్రీని సత్కరించినట్లేనని మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటి పద్మిని కొల్హాపురి, పరుచూరి వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సుబ్బరామిరెడ్డి, పద్మిని కొల్హాపురి, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ

ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో..


రామ్

రాజశేఖర్ కథానాయకుడిగా తెరకెక్కిన 'పీఎస్‌వీ గరుడవేగ' సక్సెస్ సాధించడంతో దర్శకుడు ప్రవీణ్ సత్తారు అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సినిమా తరువాత రెట్టించిన ఉత్సాహంతో వున్న ఆయన నితిన్ హీరోగా సినిమా చేస్తారని వార్తలు వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం హీరో రామ్‌తో ఆయన తదుపరి చిత్రాన్ని చేయనున్నట్లు తెలిసింది. కాగా ఈ చిత్రాన్ని భవ్య క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వి.ఆనందప్రసాద్ నిర్మించనున్నారు. రామ్ ప్రస్తుతం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న సినిమాలో నటిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్‌ని కథానాయికగా అనుకుంటున్నారు. ఈ సినిమా తరువాత ప్రవీణ్ సత్తారు చిత్రం సెట్స్‌పైకి రానుందని, ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని చిత్ర వర్గాలు త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం.

నికీషా పటేల్ 'రౌడీ పోలీస్'


నికీషా పటేల్

పవన్‌కల్యాణ్ నటించిన 'పులి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది నికీషా పటేల్. ఆ సినిమా విజయాన్ని సాధించకపోవడంతో ఆశించిన స్థాయిలో అవకాశాల్ని సొంతం చేసుకోలేకపోయింది. కొంత విరామం తరువాత ఆమె ఓ మహిళా ప్రధాన చిత్రంతో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సన్నద్ధమవుతున్నది. నికీషా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రౌడీ పోలీస్'. జానీ దర్శకుడు. ఆర్.ఎ.ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై వేణు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'నికీషా పటేల్ నటిస్తున్న మహిళా ప్రధాన చిత్రమిది. విధి నిర్వహణలో ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? వాటిని ఎలా ఎదుర్కొన్నది? అనేది ఈ చిత్ర ప్రధాన కథాంశం. ఈ సినిమా కోసం ఎలాంటి డూప్ లేకుండా నికీషా పటేల్ యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్నది' అన్నారు. భానుచందర్, ముకుల్ దేవ్, అమిద్, గబ్బర్‌సింగ్ బ్యాచ్ తదితరులు నటిస్తున్నారు.

జిల్‌జిల్ జిగేల్ రాజా..

సుకుమార్ సినిమా అంటే తప్పకుండా ఓ ఐటెంసాంగ్‌కు చోటుంటుంది. హుషారెత్తించే ప్రత్యేక గీతాలు ఆయన సినిమాల్లో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుంటాయి. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'లో కూడా హుషారైన ఐటెంసాంగ్‌ను తెరకెక్కించారు. ఇందులో బెంగళూరు సోయగం పూజా హెగ్డే నర్తించింది. ఈ గీతాన్ని హైదరాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో ఐదు రోజుల పాటు చిత్రీకరించారు. జానీ మాస్టర్ నృత్యరీతుల్ని సమకూర్చారు . 'జిల్‌జిల్ జిగేల్ రాజా' అనే పల్లవితో సాగే ఈ గీతానికి చంద్రబోస్ రచన చేశారు. సుకుమార్ గత చిత్రాల తరహాలోనే 'రంగస్థలం'లోని ఐటెంసాంగ్ యువతను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం చెబుతున్నది. 1985 నాటి ఓ పల్లెటూరి నేపథ్యంలో వినూత్న కథ, కథనాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సమంత కథానాయిక. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ సి.హెచ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జగపతిబాబు, అనసూయ, ఆది పినిశెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

మహేష్ షాక్ అయ్యాడు!

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మనసుకు నచ్చింది'. మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. అమైరా దస్తూర్, త్రిదా చౌదరి కథానాయికలు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్. ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై పి.కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర గీతాలు ఇటీవల రాత్రి హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ 'ఏదో ఒక సినిమా చేయాలని ఈ సినిమా తీయలేదు. ఇది చాలా మంచి సినిమా. నేను ఏంటనేది ఈ సినిమా విడుదలయ్యాక తెలుస్తుంది. చోటా కె.నాయుడు సినిమా చూసి 'బెస్ట్ లవ్‌స్టోరీ' అని చెప్పారు. హృదయం వున్న ప్రతి ఒక్కరికి నచ్చే సినిమా ఇది. ఈ చిత్రంలో మా ఆయన (సంజయ్ స్వరూప్) ఓ ప్రత్యేక పాత్రలో నటించారు. తనతో పాటు మా పాప జాన్వీ కూడా ప్రత్యేక పాత్ర చేసింది. నేను రొమాంటిక్ పర్సన్ని. నాకు లవ్‌స్టోరీస్ అంటే చాలా ఇష్టం. మహేష్ నా మాట అస్సలు వినడు. నేను దర్శకత్వం వహిస్తున్నానని చెబితే నమ్మలేదు. పాటలు, ట్రైలర్స్ చూసి షాక్ అయ్యాడు. మహేష్ చెప్పిన వాయిస్ ఓవర్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది.' అని తెలిపింది. 'సినిమా చూశాక మంచి కాఫీలాంటి సినిమా అనిపించింది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు చూసేలా కలర్‌ఫుల్‌గా వుంటుంది. ప్రతి ఒక్కరీ జీవితంలో జరిగిన సంఘటనల్ని గుర్తుకుతెచ్చే అందమైన సినిమా ఇది. ఎవరూ ఊహించని సందేశం ఈ సినిమాలో వుంటుంది' అని సందీప్‌కిషన్ తెలిపారు. ప్రేమకథా చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ చిత్రాన్ని నిర్మించాను. ఈ నెల 16న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని పి.కిరణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అమైరా దస్తూర్, సంజయ్ స్వరూప్, సాయిమాధవ్ బుర్రా, అనితా చౌదరి తదితరులు పాల్గొన్నారు.


అమైరా దస్తూర్, సందీప్‌కిషన్

22న వరంగల్‌కు మోనోరైల్ బృందం

- ఫలించిన మంత్రి కేటీఆర్ చర్చలు
- 24న మంత్రి సమక్షంలో ఎంవోయూ?

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మంత్రి కేటీఆర్ ఇచ్చిన ప్రజంటేషన్‌తో వరంగల్, హైదరాబాద్‌లో మోనో రైల్ నడిపేందుకు ప్రపంచ ప్రఖ్యాత ఇంటమిన్ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ ముందుకొచ్చింది. స్విట్జర్లాండ్‌లోని ఇంటమిన్ ట్రాన్స్‌పోర్టేషన్ సంస్థ టెక్నికల్, మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల బృందం ఈ నెల 21 నుంచి 24 దాకా రాష్ట్రంలో పర్యటించనుండగా, 22న వరంగల్‌కు రానుంది. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో అధ్యయనం చేయనుంది. హైదరాబాద్, వరంగల్ రెండు ప్రతిపాదిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఈనెల 24న మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోబోయే అవకాశం ఉందని వరంగల్ మేయర్ ధ్రువీకరించారు.



మేడిగడ్డ బరాజ్‌పై వివిధ వర్సిటీల ప్రొఫెసర్లతో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

ప్రాజెక్టుల బాటలో ప్రొఫెసర్లు

★Reddy/B.Tech (IIT)/ BITS/ MS/ USA*25/5'7"/30Cr *26/ 5'2"/5Cr/ 110K *26/5'5" *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/MS/H1/USA/ 25/5'4"/3Cr*26/5'6"/5Cr*27/5'4"/ 30Cr *25/5'7"/8Cr*26/5'5/2Cr*Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/IIT/BITS/India Job*29/5'6"/12L/Y*25/5'9"*28/ 5'3" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/USA-CITIZEN *Doctors/25/5'5"/ 100Cr *25/5'7"/50Cr *28/5'5"/10Cr*30/5'2"/ 10Cr*Engineer/22/5'6"*32/5'5"*Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★Reddy/Catholic.H1/USA*B.Tech/ MS/25/5'7"/30Cr*27/5'6"*34/5'4"* IND/ 23/5'5"/15Cr*27/5'4" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/Working/Hyd*B.Tech (CBIT)M.Tech IIT/26/5'4"/14 L/Y/2Cr*25 /5'5"/10Cr*27/5'5"*26/5'7"*28/5'5"/12/yr" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★Reddy/Divercee*India*B.Tech/27/ 5'6"/25Cr*32/5'2"/25Cr*32/5'2"/1Cr*30/ 5'2½"/10Cr*28/5'5"/5Cr *Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/Divercee USA *B.Tech/27/ 5'2"/ 4Cr *30/5'6"/4Cr*40/5'5" *34/5'3"/ 10Cr*31/5'5" *36/5'2" *Cont K.C. Reddy -Hyd. Ph:9849321309/9347807015

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	70.00
రిటైల్ లైవ్	92.00
డ్రెస్డ్	133.00
స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	353-00
రంగారెడ్డి	353-00
మెదక్	353-00
కరీంనగర్	355-00
వరంగల్	355-00
రిటైల్ ప్రైస్	4-15

మూడు ఇండిగో విమానాలు నిలిపివేత

■ ఇంజన్లలో సాంకేతిక సమస్యలే కారణం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన మూడు ఏ320 నియో విమానాల ఇంజన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో శుక్రవారం నుంచి వాటిని నేలపైనే నిలిపివేశారు. దీంతో పలు రూట్లలో విమాన సర్వీసులు రద్దుకావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేలపట్టునే నిలిచిపోయిన ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్లను ప్రట్ అండ్ విట్నీ అనే యూరప్‌కు చెందిన సంస్థ తయారు చేసింది. ఈ నేపథ్యంలో యూరప్ విమానయాన భద్రత రెగ్యులేటరీ ఈఏఎస్ఈలకు లోబడి కంపెనీ చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది.

కోల్ ఇండియా లాభం 3,004 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,004 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా ప్రకటించింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.2,883.27 కోట్ల లాభంతో పోలిస్తే 4.21 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నదని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికి గాను రూ.22,484.14 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. జూలై 1, 2017 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ నేపథ్యంలో అంతక్రితం ఏడాది నమోదైన ఆదాయంతో పోల్చుకోవాల్సిన లేదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ 15.20 కోట్ల టన్నులను బొగ్గును ఉత్పత్తి చేసింది. నిర్వహణ ఖర్చులు రూ.17,873.93 కోట్లకు పరిమితమైనట్లు తెలిపింది.



న్యూఢిల్లీలో శనివారం రిజర్వు బ్యాంకు బోర్డు సమావేశానికి హాజరైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ, సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా, ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ తదితరులు

భయం లేదు

■ ఇకపై ఆర్థిక ఇబ్బందులు ఉండకపోవచ్చని జైట్లీ ఆశాభావం

■ ఆర్బీఐ, సెబీ బోర్డులతో మర్యాదపూర్వక సమావేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) నుంచి పరిస్థితులు సాకారంతంగా ఉంటాయని, కనుక ఇకమీదట ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరుగుతుండటంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత మాసెట్లలో ధోరణి భిన్నంగా ఉన్నందున (ధరలు మళ్లీ తగ్గినందున) ముడి చమురు ధరలపై ఎవరూ ఊహాజనిత పరిస్థితులను ఆధారంగా చేసుకుని అంచనాలు వేయరాదని, ఇకమీదట ద్రవ్య లక్ష్యాలు చేధించాయని తాను ఆందోళన చెందడం లేదని ఆయన తెలిపారు. వచ్చే సార్వత్రిక బడ్జెట్‌ను ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జైట్లీ తదనంతర కసరత్తులో భాగంగా శనివారం ఆర్బీఐ, సెబీ బోర్డులతో మర్యాదపూర్వకంగా సమాశమయ్యారు. ఈ భేటీలు ముగిసిన అనంతరం జైట్లీ విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ.. వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని బుధవారం ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) తీసుకున్న నిర్ణయాన్ని 'సమతుకమైన నిర్ణయం'గా అభివర్ణించారు. ఖరీఫ్ పంట దిగుబడులకు కల్పించే కనీస మద్దతు ధరను ఉత్పత్తి వ్యయం కంటే కనీసం ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఖరారు చేయాలని సార్వత్రిక బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదన విషయమై ఆర్బీఐ బోర్డుతో చర్చించినట్లు జైట్లీ తెలిపారు. ఈ ప్రతిపాదను అమలు చేయడం వల్ల, దీని వలన రైతులతో పాటు సరుకుల ధరలు, ఎగుమతులపై ఎటువంటి ప్రభావం పడుతుంది? అనే అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించామని ఆయన వివరించారు.

బాండ్ మార్కెట్లను బలోపేతం చేయాలి..

కాగా, కార్పొరేట్ బాండ్ల మార్కెట్లను బలోపేతం చేసేందుకు మరిన్ని చర్యలు చేపట్టాలని సెబీ బోర్డుకు జైట్లీ సూచించారు. ఐపీఓల్లో కొనసాగుతున్న పురోగమన ధోరణి పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలను అధిగమించేందుకు దోహదం చేస్తుందని ఆయన అశాభావాన్ని వ్యక్తం చేశారు. స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ధోరణులు, తమ ముందున్న ప్రాధాన్యతలు, ఇటీవల తాము చేపట్టిన చొరవల గురించి సెబీ బోర్డు ఈ సందర్భంగా జైట్లీకి వివరించింది.

ద్రవ్య విధాన నిర్ణయాలకు ముందుచూపు అవసరం

■ ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ ఉద్ఘాటన

ద్రవ్య పరపతి విధానానికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునేందుకు ఎంతో ముందుచూపు అవసరమని, రోజువారీ ద్రవ్యోల్బణ రేట్లను ఆధారంగా చేసుకుని ఈ నిర్ణయాలను తీసుకోలేమని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ ఊర్జిత్ పటేల్ స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతో శనివారం మర్యాదపూర్వక సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలను అంచనా వేయడం కష్టమవుతోందన్నారు. గత కొన్ని రోజుల నుంచి ఈ ధరల్లో ఎగుడు దిగుడు ధోరణులు కనిపిస్తున్నాయని, ఈ రెండు రకాల ధోరణులను ఎదుర్కొనేందుకు మనం సిద్ధం కావాల్సిన అవసరమున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఆర్థిక సంస్థల రుణ వితరణ సామర్థ్యం క్రమంగా మెరుగుపడుతుందని, దీంతో పెట్టుబడుల మార్కెట్ నుంచి కంపెనీలు తగినన్ని నిధులను సమీకరించుకునేందుకు వీలవుతుందని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులు మరింత పెద్ద సమస్యకు దారితీయకుండా చూడాలని, మున్ముందు ఎదురయ్యే ఇబ్బందులపై మార్కెట్ నియంత్రణా సంస్థలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఊర్జిత్ పటేల్‌పటేల్ సూచించారు.

క్రిప్టోకరెన్సీలపై నిబంధనావళి

■ త్వరలో తీసుకువస్తామన్న సెబీ చైర్మన్ త్యాగీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: క్రిప్టోకరెన్సీలపై త్వరలోనే ఓ నిబంధనావళితో వస్తామని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ స్పష్టం చేసింది. నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బిట్‌కాయిన్ విలువ.. నేడు నేల చూపులు చూస్తున్న విషయం తెలిసిందే. ఎంతైతే వేగంగా పెరిగిందో.. తిరిగి అంతే స్థాయిలో అమాంతం పడిపోతున్నాయి బిట్‌కాయిన్ ధరలు. ఈ నేపథ్యంలోనే మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం తప్పక నిబంధనలను తీసుకురానున్నట్లు సెబీ చైర్మన్ అజయ్ త్యాగీ తెలిపారు. బడ్జెట్ అనంతర సంప్రదాయంలో భాగంగా శనివారం ఇక్కడ సెబీ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగీ విలేఖరులతో మాట్లాడుతూ బిట్‌కాయిన్‌సహా అన్ని క్రిప్టోకరెన్సీలు భారత్‌లో చట్టవ్యతిరేకమేనని ఇప్పటికే జైట్లీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఓ కమిటీ పరిశీలిస్తున్నదన్న ఆయన కమిటీ సిఫార్సులు వచ్చాక.. అందులో సెబీ పాత్రపై స్పష్టత వస్తుందన్నారు. కాగా, కార్పొరేట్ బాండ్ల ద్వారా 25 శాతం నిధుల సమీకరణపై సెప్టెంబర్‌కల్లా నిబంధనలను విడుదల చేస్తామని త్యాగీ చెప్పారు. ఇక బ్యాంక్ డిపాజిట్లకు మ్యూచువల్ ఫండ్స్ ప్రత్యామ్నాయం కావని, మరింత లాభాలను ఆశిస్తూ బ్యాంక్ డిపాజిట్ల నుంచి తమ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి డిపాజిటర్లు మార్చుతున్న నేపథ్యంలో ఈ పెట్టుబడులకు నిర్దిష్ట లాభాలు ఉంటాయనుకోరాదని త్యాగీ హితవు పలికారు. అయినప్పటికీ క్యాపిటల్ మార్కెట్లలోకి రావడానికి రిటైల్ మదుపరులకు మ్యూచువల్ ఫండ్స్ చక్కని మార్గంగా అభివర్ణించారు. ఇదిలావుంటే ఫోర్టిస్ హెల్త్‌కేర్ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని త్యాగీ స్పష్టం చేశారు. ప్రమోటర్లకు చెందిన కొన్ని సంస్థలకు నిధుల బదిలీలో నిబంధనల ఉల్లంఘన ఆరోపణలను ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఎదుర్కొంటున్నది. శుక్రవారం దీనిపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి నోటీసులను కూడా అందుకున్న విషయం తెలిసిందే.

మరికొంతకాలం ఒడిదుడుకులే..

దేశీయ స్టాక్ మార్కెట్లకు మరికొంతకాలం ఒడిదుడుకులు తప్పకపోవచ్చన్న అభిప్రాయాన్ని త్యాగీ వెలిబుచ్చారు. సూచీల పతనానికి దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను కారణం కాదనడం సరి కాదన్న ఆయన అంతర్జాతీయ కారణాలతో పోల్చితే మాత్రం ఎల్‌టీసీజీ ప్రభావం భారతీయ స్టాక్ మార్కెట్లపై తక్కువేనన్నారు. మదుపరులు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్న త్యాగీ.. భారతీయ మార్కెట్లు పెట్టుబడులకు చాలా సురక్షితమైనవన్నారు. ముఖ్యంగా మార్కెట్ నష్టాలకు చిన్న మదుపరులు భయపడాల్సిన అవసరమే లేదన్నారు.

తర్వాతి సమావేశంలోనే..

కార్పొరేట్ పరిపాలనకు సంబంధించి కొత్త నిబంధనలపై చర్చ సెబీ తర్వాతి బోర్డు సమావేశంలోనేనని త్యాగీ తెలిపారు. స్టాక్ మార్కెట్‌లోని సంస్థల కోసం కార్పొరేట్ గవర్నెన్స్‌పై ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలో ఏర్పడిన సెబీ ఉన్నతస్థాయి కమిటీ.. గతేడాది అక్టోబర్ 5నే తమ నివేదికను సమర్పించింది. 177 పేజీల ఈ నివేదికలో కమిటీ కొన్ని సూచనలను చేయగా, వాటిపై ప్రజాభిప్రాయాలనూ సేకరించింది.

తిరోగమన చర్యేమీ కాదు..

విదేశాల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను ఆపేయాలని దేశీయ స్టాక్ మార్కెట్లు తీసుకున్న నిర్ణయాన్ని తిరోగమన చర్యగా అనుకోవడం లేదని త్యాగీ అన్నారు. ఈ నిర్ణయాన్ని ఓ వాణిజ్యపరమైన నిర్ణయంగా అభివర్ణిస్తూ.. దేశం నుంచి విదేశాలకు వెళ్లిపోతున్న సంపదను కట్టడి చేసేందుకే ఈ చర్యని తెలిపారు. తమ ద్రవ్యలభ్యతను స్వదేశానికే పరిమితం చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు కోరుకుంటున్నాయన్నారు.

అమర రాజా లాభం 134 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: రాష్ట్రానికి చెందిన ప్రముఖ బ్యాటరీల తయారీ సంస్థ అమర రాజా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి సంస్థ రూ.134.45 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.112.32 కోట్ల లాభంతో పోలిస్తే 19.70 శాతం వృద్ధిని కనబరిచినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,513.82 కోట్ల నుంచి రూ.1,570.22 కోట్లకు పెరిగింది. ఆటోమొబైల్ రంగ బ్యాటరీ విభాగం అంచనాలకుమించి పనితీరు కనబరుచడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని కంపెనీ సీఈవో ఎస్ విజయానంద్ తెలిపారు.

AMARA RAJA
Gotta be a better way

హృద్రోగికి అదనపు గుండె

అపోలో దవాఖానలో అరుదైన శస్త్రచికిత్స • కరీంనగర్ టూ హైదరాబాద్‌కు గుండె తరలింపు



బ్రెయిన్ డెడ్ అయిన నవీన్‌కుమార్

హైదరాబాద్ నమస్తే తెలంగాణ/కరీంనగర్ హెల్త్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో దవాఖానలో అరుదైన గుండె శస్త్రచికిత్స జరిగింది. 'హెటిరోటొపిక్' విధానంతో 47ఏండ్ల రోగికి బ్రెయిన్ డెడ్ అయిన 17ఏండ్ల బాలుడి గుండెను అమర్చారు. సాధారణంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సలో భాగంగా రోగి శరీరంలో నుంచి విఫలమైన గుండెను తొలగించి, దాని స్థానంలో ఆరోగ్యకరమైన గుండెను అమరుస్తారు. కానీ ఈ కేసులో రోగి కంటే అవయవదాత వయస్సు 30 ఏండ్లు తక్కువగా ఉండటంతో రోగి శరీరంలోని అనారోగ్యకరమైన గుండెను తొలగించకుండా దాని పక్కనే బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండెను అమర్చినట్టు వైద్య నిపుణుడు గోపాలకృష్ణ గోఖలే తెలిపారు. ఈ కేసులో రోగికి రెండు గుండెలు ఒకదానితో ఒకటి సమన్వయంగా పనిచేస్తూ శరీరానికి రక్తప్రసరణ జరిగేలా చేస్తాయన్నారు. ఈ విధంగా ఒక వ్యక్తికి అదనంగా రెండో గుండెను అమర్చే 'హెటిరోటొపిక్' హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్‌ను తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగా నిర్వహించామనీ, దేశంలో ఇది మూడో శస్త్రచికిత్స అని ఆయన వివరించారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో దవాఖానకు పోలీసులు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి రెండు గంటల్లో బ్రెయిన్‌డెడ్ అయిన బాలుడి గుండెను తరలించి మరో వ్యక్తికి అమర్చారు.

గుండె సేకరించారిలా..: జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లికి చెందిన మేకల నవీన్‌కుమార్ (17) ఈ నెల 8న బైక్‌పై వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టగా, తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే కరీంనగర్ అపోలో రీచ్‌కు తరలించగా, శుక్రవారం రాత్రి బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నవీన్ తల్లిదండ్రులు మేకల రాజేశం, సుజాతతో మాట్లాడి అవయవదానం చేయాలని కోరారు. బ్రెయిన్‌డెడ్ అయిన నవీన్‌కుమార్ ఇక కోలుకోడని నిర్ధారించుకున్న ఆయన తల్లిదండ్రులకు అటు దవాఖాన వైద్యులు, ఇటు పోలీసులు అవగాహన కల్పించడంతో అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని జీవన్‌ధార ట్రస్టు నిర్వాహకులకు తెలిపారు.

రెండు గంటల్లో తరలింపు..: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో దవాఖానలో ప్రాణాపాయస్థితిలో ఉన్న 47ఏండ్ల వ్యక్తికి గుండె అవసరమని తెలుసుకున్నారు. నవీన్‌కుమార్ దేహం నుంచి గుండెను తొలగించి, రెండు గంటల్లో హైదరాబాద్‌కు తరలించారు. సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ పోలీసుల అధికారులతో ఈ విషయమై చర్చించి, దారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా 'గ్రీన్ కారిడార్' ఏర్పాటు చేశారు. అప్పటికే జూబ్లీ అపోలోకు చెందిన డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య బృందం కరీంనగర్ చేరుకుంది. నవీన్‌కుమార్ శరీరం నుంచి ఉదయం 6.50 గంటలకు గుండెను వేరు ఎస్కార్ట్ వాహనంలో సరిగ్గా 8:50కి జూబ్లీహిల్స్ అపోలోకు చేరుకున్నారు. అప్పటికే గుండె మార్పిడి చేసేందుకు ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణుడు గోపాలకృష్ణ గోఖలే సిద్ధంగా ఉన్నారు. వెంటనే నవీన్‌కుమార్ గుండెను 47 ఏండ్ల వ్యక్తికి అమర్చారు. అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చిన నవీన్‌కుమార్ తల్లిదండ్రులను అభినందించారు.



'గ్రీన్ కారిడార్'తో సకాలంలో గుండెను దవాఖానకు చేరేలా చర్యలు తీసుకున్న హైదరాబాద్ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిని అభినందిస్తున్న అపోలో ఎండీ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి

చనిపోయాడనుకున్నారు.. తిరిగొచ్చాడు

లేడనుకుని కర్మకాండలు.. 8 నెలల తరువాత రాక

ఆనందంలో కుటుంబ సభ్యులు



సురక్షితంగా ఇంటికి చేరిన బానయ్య

బెల్లంపల్లిరూరల్: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కర్మకాండలు కూడా నిర్వహించారు. దాదాపు ఎనిమిది నెలల తరువాత లేడనుకున్న వ్యక్తి తిరిగి రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. వివరాలు ఇలా.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బూదాకుర్ధు ఇందిరానగర్‌కు చెందిన గద్దల బానయ్య కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బయటకు వెళ్లినవ్యక్తి తిరిగి రాలేదు. తాండూర్ మండలంలో కుళ్లిన శవం లభించగా, పోలీసుల సమాచారం మేరకు శవాన్ని పరిశీలించి, దుస్తుల ఆధారంగా బానయ్యగా అనుమానించారు. మృతదేహాన్ని తెచ్చి, కర్మకాండలు చేశారు. ఇదిలాఉండగా ఎనిమిది నెలల కిందట బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న బానయ్యను రైల్వే పోలీసులు పట్టుకుని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని అమ్మా-నాన్న అనాథాశ్రమానికి తరలించారు. అక్కడ మామూలు స్థితికి వచ్చి, శుక్రవారం ఇంటికి చేరాడు.



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో లెక్కిస్తున్న మేడారం హుండీ డబ్బులు

మేడారం హుండీ ఆదాయం రూ.9.61 కోట్లు

రెడ్డికాలనీ(వరంగల్): మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర హుండీల ద్వారా రూ.9,61,49,195 ఆదాయం సమకూరింది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు శనివారం ముగిసింది. మొత్తం 479 హుండీలకు గాను రూ.9,61,49,195 రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది. ఇవీగాక హుండీల్లో వచ్చిన నాణేలు, బంగారం, వెండితోపాటు విదేశీ కరెన్సీని ఆదివారం లెక్కించనున్నట్టు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు తెలిపారు.



లేక్ పోలీస్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

పోలీసులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ

లేక్ పోలీస్ ఔట్ పోస్టు ప్రారంభోత్సవంలో మంత్రి ఈటల

కరీంనగర్ క్రైం: అక్రమార్కులను అణచివేసేందుకే ప్రభుత్వం పోలీస్‌శాఖకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని రాష్ట్ర ఆర్థిక పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్‌లోని మానేరు బైపాస్‌రోడ్డులో లేక్‌పోలీస్ ఔట్‌పోస్టును మంత్రి ఈటల, డ్యాంపై రెండు షెల్టర్లను చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమలు ప్రారంభించారు. చట్టాలపై ప్రజలకు నమ్మకం కల్గించేలా ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి అన్నారు. అలాగే, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో డబుల్‌బెడ్‌రూం నిర్మాణాలు, గంగాధర మండలంలో రోడ్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు.



కొల్లాపూర్ మండలం ఎల్లూరు మిషన్ భగీరథ పథకం స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో ఎమ్మెల్సీ కశిరెడ్డి, జెడ్పీ చైర్మన్ భాస్కర్

దమ్మున్న సీఎం కేసీఆర్: మంత్రి జూపల్లి

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: దేశంలోనే దమ్మున్న సీఎం కేసీఆర్ అని, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం ఆయనకే సాధ్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరులో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్మన్ బండారు భాస్కర్, మాజీ ఎంపీ మందా జగన్నాథంతో కలిసి శనివారం మిషన్‌భగీరథ ట్రయల్‌ను ప్రారంభించారు. మూడున్నరేండ్లలో ఇంటింటికీ రక్షిత నీరందించే పథకం రూపుదిద్దుకున్నదన్నారు. అలాగే, జిల్లాలోని సింగవట్నం గుట్టపై ఉన్న సంప్‌వెల్ పరిశీలించి, కోడేరు మండలం పస్పుల కొండపై నిర్మించిన సంప్‌వెల్ పరిశీలించారు. ఎల్లూరు నుంచి కల్వకుర్తి దాకా దాదాపు 80కిలో మీటర్ల మేర పనులను పరిశీలించారు. అలాగే, నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెంలో మిషన్ భగీరథ ట్రయల్ రన్ విజయవంతమైంది.



కొత్తగూడెంలో అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జలగం, నిర్మాత శోభు యార్లగడ్డ

కొత్తగూడెంలో 'అక్షయపాత్ర' ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో 'అక్షయపాత్ర' 36వ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను శనివారం ఎమ్మెల్యే జలగం వెంకటరావు ప్రారంభించారు. దీనికి ప్రత్యేక అతిథులుగా కిచెన్ నిర్మాణ దాతలు బాహుబలి సినీ నిర్మాత శోభు యార్లగడ్డ, నవభారత్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీఆర్‌కే ప్రసాద్ హాజరయ్యారు. గిరిజన ప్రాంతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో దేశంలోనే 36వ సెంట్రలైజ్డ్ కిచెన్‌గా రోజూ 30 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించే ఈ కార్యక్రమాన్ని వక్తలు ప్రశంసించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ తెలుగురాష్ట్రాల అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాసా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ ఎం. రాంకిషన్, డీఎస్పీ ఎస్‌ఎం అలీ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ పులి గీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సిగలో మరో మణిహారం ఆర్‌ఎఫ్‌సీఎల్

శరవేగంగా పనులు.. వచ్చే జనవరిలో ఉత్పత్తి ప్రారంభం

రూ.5,254.28 కోట్లతో పునరుద్ధరణ

500 మందికి ప్రత్యక్షంగా.. రెండువేల మందికి పరోక్ష ఉపాధి



నిర్మాణంలో ఉన్న ఆర్‌ఎఫ్‌సీఎల్

పెద్దపల్లి ప్రతినిధి నమస్తే తెలంగాణ:

రామగుండంలో పునరుద్ధరణకు నోచుకుంటున్న రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్).. తెలంగాణ సిగలో మరో మణిహారంగా మారనున్నది. డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేసి, వచ్చే ఏడాది జనవరి నుంచి ఉత్పత్తి ప్రారంభించేలా రామగుండం ఎరువుల కర్మాగారం పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పునరుద్ధరిస్తున్న ఈ కర్మాగారం పూర్తయితే రోజుకు 3,850 టన్నుల యూరియా, 2,200 టన్నుల అమ్మోనియా ఉత్పత్తి అవుతుంది. దీంతో రైతులకు ఎరువుల కష్టాలు తీరనుండగా, ఆర్‌ఎఫ్‌సీఎల్ ద్వారా 500 మందికి ప్రత్యక్షంగా, రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నది. పెద్దపల్లి జిల్లా రామగుండంలో బొగ్గు ఆధారిత యూరియా తయారీ కేంద్రాన్ని 1970లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అనుకున్న స్థాయిలో ఉత్పత్తి సాధించలేకపోవడంతో కంపెనీ నష్టాల్లో కూరుకుపోయింది. దీన్ని 1999లో మూసివేయగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పునరుద్ధరిస్తున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 2019 జనవరిలో ఉత్పత్తి ప్రారంభించడానికి పనులు వేగవంతం చేస్తున్నారు. రామగుండం ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థానంలో కొత్తగా 'రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్' పేరుతో యూనిట్‌ను నెలకొల్పుతున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వాటాల ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. గ్యాస్ ఆధారితంగా నడిచే ఎరువుల కర్మాగారానికి గ్యాస్ అందించే పైపులైన్ పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి కాకినాడ నుంచి మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, వైజాపూర్ వరకు 1881 కిలోమీటర్ల పైప్‌లైన్ వేసి సహజ వాయువును సద్వినియోగం చేసుకోవాలని 2011లో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు రెగ్యులేటరీ బోర్డు నిర్ణయించింది. కాకినాడ నుంచి భోపాల్, వైజాపూర్ వరకు వెళ్తున్న గ్యాస్ పైప్‌లైన్ మన రాష్ట్రం నుంచి వెళ్తున్న నేపథ్యంలో రామగుండం ఎరువుల కర్మాగారానికి సహజ వాయువును వినియోగించుకోవాలని భావించింది. కాకినాడ నుంచి రామగుండం 362 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేస్తుండగా ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 67 కిలో మీటర్ల పైప్‌లైన్, తెలంగాణలో 295 కిలో మీటర్ల సహజ వాయువు పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. ఇందుకు భూసేకరణ పూర్తి కావడంతో పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 0.55 టీఎంసీల నీటిని అందించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పని చేసే కార్మికులకు తాగునీటి కోసం మిషన్ భగీరథ నుంచి పైపులైన్ వేసేందుకు సైతం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో జరుగుతున్న పనుల్లో టెక్నాలజీ టెండర్లు పూర్తయ్యాయి. అమ్మోనియాకు సంబంధించి డెన్మార్క్‌కు చెందిన హల్డర్‌టాప్స్, యూరియాకు సంబంధించి స్టైమికార్బన్‌లకు టెండర్లు ఖరారై పనులు సాగుతున్నాయి. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌తోపాటు ఇతర అవసరాల కోసం వినియోగించే బిల్డింగులు, ఇతర సదుపాయాల కల్పన పనులు వేగంగా సాగుతున్నాయి. ఫ్యాక్టరీకి అవసరమైన అనేక యంత్రాలు ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి తోడుగా ఫ్యాక్టరీకి అవసరమైన నీటి కోసం పనులు సాగుతున్నాయి. ప్రతిపాదిత ప్రాజెక్టు కోసం సుమారు 40.8 ఎంఎల్‌డీ నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి సేకరిస్తున్నారు. ఫెర్టిలైజర్ కాంప్లెక్సులో ద్రవాల శుద్ధీకరణకు ప్రతిపాదించిన సమగ్ర వ్యర్థ నీటి నిర్వహణ వ్యవస్థను పీసీబీ పరిధిలో ఉండే విధంగా చూస్తున్నారు. ప్లాంటులో వ్యర్థ నీటి ద్వారా ద్రవాల శుద్ధీకరణ సామర్థ్యానికి సంబంధించిన నిర్మాణాన్ని చేపడుతున్నారు. వివిధ రకాల కంప్రెసర్లను సీపీపీలోని జీటీఎస్‌ల డ్రైవింగ్ కోసం అత్యంత సమర్థవంతమైన గ్యాస్ టర్బైన్లను నిర్మిస్తున్నారు. ఉత్పాదన ప్లాంట్ల నుంచి వెలువడే పదార్థాలను శుద్ధి చేయడానికి పనులు సాగుతున్నాయి. అమ్మోనియా నిల్వ చేసేందుకు నిర్మాణాలు సాగుతున్నాయి. దాదాపు 20వేల మెట్రిక్ టన్నుల అమ్మోనియాను, 45వేల మెట్రిక్ టన్నుల యూరియాను నిల్వ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం పూర్తయితే 500 మందికి ప్రత్యక్షంగా రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నది.

వర్సిటీల్లో త్వరలో 1500 పోస్టులు భర్తీ చేస్తాం

- బాసర ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవంలో ఉపముఖ్యమంత్రి కడియం
- 200మందికి పట్టాలు, ఏడుగురికి బంగారు పతకాలు



బాసర ట్రిపుల్ ఐటీలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

బాసర: యూనివర్సిటీల్లో దాదాపు 1500 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)లో మూడో స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఐఐటీ డైరెక్టర్ యూబీ దేశాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2011వ బ్యాచ్‌కు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులకు పట్టాలు, ఏడుగురు టాపర్లకు పతకాలు అందజేశారు. బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రత్నాల్లాంటి వారని కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో ఏకైక బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలను సీఎం కేసీఆర్ మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామని హామీచ్చారు. బాసర కళాశాలలో వంద పోస్టుల భర్తీతోపాటు రెగ్యులర్ వైస్ చాన్సలర్‌ను కూడా నియమిస్తామన్నారు. టీఆర్టీ ద్వారా 8792 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి మహేందర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అధికార టీఆర్‌ఎస్‌లోకి ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, భారీగా వలస వస్తున్నారు. శనివారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 300 మందికిపైగా కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కాంగ్రెస్ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరగా, వీరికి మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఆదివారంపేట, వీరాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు మంథని ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



టెక్స్‌టైల్ పార్కు పరిసరాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లు, ఎమ్మెల్యే ధర్మారెడ్డి, అధికారులు

టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి కల్పిస్తాం

వరంగల్ రూరల్ జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ: టెక్స్‌టైల్ పార్క్ భూనిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామమని టీఎస్ ఐఐసీ చైర్మన్ బాలమల్లు అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కు ప్రాంతాన్ని ఎమ్మెల్యే ధర్మారెడ్డి, రెవెన్యూ, పరిశ్రమలశాఖ, చేనేత జౌళీశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాల కోసం శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామన్నారు.



మంత్రి కేటీఆర్ పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోదలో చికిత్స పొందుతున్న పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ తండ్రి సురేశ్‌ను శనివారం మంత్రి కేటీఆర్ పరామర్శించారు. - మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ

బాలికపై సామూహిక లైంగిక దాడి

మంచిర్యాల రూరల్: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో ఓ బాలికను కిడ్నాప్ చేసి, సామూహిక లైంగిక దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల ఎస్సై శ్రీనివాస్ యాదవ్ వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బాలిక(16)ను ఈనెల 8న అదే గ్రామానికి చెందిన బోడకుంటి రాజమల్లు అనే లారీ డ్రైవర్ తన బైక్‌పై భీమారం మండలంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.తన స్నేహితులైన లారీడ్రైవర్లు హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన ఎరవేణి మహేశ్, నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన పయ్యావుల కుమార్‌ను ఫోన్ చేసి పిలిపించి బాలికపై సామూహిక లైంగికదాడి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను అటవీ ప్రాంతంలో వదిలివెళ్లిపోయారు. స్పృహలోకి వచ్చిన తరువాత బాలిక ఇంటికి చేరుకుంది. ఈ మేరకు బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ముగ్గురిని బలిగొన్న ఈత సరదా..

గద్వాల జిల్లాలో ఇద్దరు విద్యార్థులు.. భూపాలపల్లి జిల్లాలో ఒకరు



భూపాలపల్లి జిల్లా రామప్ప సరస్సు వద్ద ప్రమాదానికి ముందు సునీల్ దిగిన ఫొటో

ఉండవెల్లి/వెంకటాపురం: ఈత సరదా ముగ్గురిని బలిగొంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు విద్యార్థులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ వ్యక్తి నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. వివరాలు ఇలా.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన చాకలి రాముడు, రోజావతి దంపతుల కుమారుడు పవన్ (12), రఘుగౌడ్, ప్రమీలమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్‌గౌడ్ (12) ఉండవెల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆరోతరగతి చదువుతున్నారు. శనివారం వీరు ఈతకోసమని ఆముదాలపాడు గ్రామం శివారులోని రామచంద్రారెడ్డి బావి వద్దకు వెళ్లారు. పవన్‌కు ఈత రావడంతో బావిలో ఈదుతుండగా శ్రీకాంత్ మెట్ల వద్ద స్నానం చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు శ్రీకాంత్ బావిలోకి జారిపడి మునిగిపోయాడు. శ్రీకాంత్‌ను కాపాడపోయి పవన్ కూడా మునిగిపోయాడు. ఇద్దరు పిల్లలు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల కాలనీల్లో వెతికారు. చిన్న ఆముదాలపాడు బావి దగ్గర ఇద్దరు పిల్లల దుస్తులు గట్టుమీద కనిపించడంతో గ్రామస్థులు బావిలోకి వెతుకగా పవన్ మృతదేహం లభించింది. రాత్రి 9గంటల వరకు శ్రీకాంత్ మృతదేహం లభించలేదు. ఇదిలా ఉండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం రామాంజాపూర్‌కు చెందిన మల్లాడి సునీల్ (40) తన స్నేహితులతో కలిసి రామప్ప చెరువుకు వచ్చాడు. బోటింగ్ పాయింట్ వద్ద నీటిలోకి దిగగా మునిగిపోయాడు. స్థానికులు అతడిని బయటకు తీసుకోచ్చేందుకు యత్నించగా అప్పటికే మరణించాడు.

పోలీస్ బేస్‌క్యాంపుపై మావోయిస్టుల కాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులో ఉన్న తోగ్గూడెంలో ఇటీవల ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీసు బేస్‌క్యాంపుపై శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన పోలీసులు తిరిగి కాల్పులు జరుపడంతో మావోయిస్టులు పారిపోయారని తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లో మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం వైపు జరుగుతున్న రహదారి పనులు సవ్యంగా జరిగేందుకు రెండు రాష్ట్రాల సరిహద్దు తొగ్గూడెంలో ఇటీవల బేస్‌క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపు ఏర్పాటును వ్యతిరేకించిన మావోయిస్టులు వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు దాడికి యత్నించారు. ఇదే ప్రాంతంలో వరుస సంఘటనలు చేసుకోవడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు దంపతులు బోడ్కికోవసి అలియాస్ సుఖ్‌రాం(33), గంగా మద్‌కామి అలియాస్ మనిలా(30) శనివారం పోలీసుల ముందు లొంగిపోయారు.

తిరుమలగండిలో కూలిన పారాచ్యూట్

కొత్తగూడ: వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ నుంచి శనివారం ప్రయోగించిన పారాచ్యూట్ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిరుమలగండి సమీపంలో పడిపోయింది. తొలుత భయాందోళనకు గురైన స్థానికులు ఆ తరువాత తేరుకొని పారాచ్యూట్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమిచ్చారు. స్పందించిన ఈసీఐఎల్ అధికారులు స్థానిక పోలీసులను సంప్రదించగా, వారు హుటాహుటిన తిరుమలగండికి చేరుకొన్నారు. ఈసీఐఎల్ అధికారులు అక్కడికి వెళ్లి పారాచ్యూట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
ఆదివారం 11 ఫిబ్రవరి 2018



విజయోత్సాహంలో హైదరాబాద్ జట్టు

రంగారెడ్డి రైజర్స్, హైదరాబాద్ శ్రీనిధియాన్ జట్ల విజయం

జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ20 లీగ్

సిద్దిపేట: టీ20 మ్యాచ్‌ల ప్రత్యక్ష వీక్షణంతో సిద్దిపేటలోని మినీ స్టేడియం అభిమానుల కేరింతలతో దద్దరిల్లుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి రైజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 163 పరుగులు చేయగా ఆ జట్టులో సొహైల్ 65, ప్రతీక్ పవార్ 42 పరుగులు చేయడంతో మంచి స్కోరు సాధించింది. 164 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ నైట్స్ జట్టు 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసి పరాజయం పాలైంది.

హైదరాబాద్ ఉత్కంఠ విజయం: నల్లగొండ లయన్స్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ శ్రీ నిధియాన్ థండర్‌బోల్ట్స్ జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 130 పరుగులు చేయగా, 131 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నల్లగొండ లయన్స్ జట్టు 127 పరుగులు చేసి హైదరాబాద్ జట్టు చేతిలో ఓడింది.



విజయం సాధించిన రంగారెడ్డి రైజర్స్ .. (ప్రత్యేక ఆకర్షణగా సినీ నటుడు అఖిల్)

కోహ్లీ, ధవన్ అరుదైన రికార్డు

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ, శిఖర్ ధవన్ పరుగుల హోరు కొనసాగుతున్నది. ఆకాశమే హద్దుగా వీరిద్దరు పరుగులు కొల్లగొడుతున్నారు. శనివారం జరిగిన నాలుగో వన్డేలో కోహ్లీ, ధవన్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. వన్డేల్లో రెండో వికెట్‌కు ఎనిమిదో సారి వంద పరుగులకు(158) పైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ద్వారా గతంలో గంగూలీ, ద్రవిడ్ రికార్డును సమం చేశారు. మరో సెంచరీ భాగస్వామ్యం ఏర్పరిస్తే సరికొత్త రికార్డు వీరి సొంతమవుతుంది. ఓవరాల్‌గా చూస్తే దిల్షాన్, సంగక్కర(19 సార్లు), హెడెన్, పాంటింగ్(10) ముందు వరుసలో ఉన్నారు.

6 దక్షిణాఫ్రికాతో ఈ పర్యటనలో రోహిత్‌శర్మను రబాడ ఆరు సార్లు ఔట్ చేశాడు. ఏ బ్యాట్స్‌మెన్ కూడా ఒక బౌలర్ చేతిలో ఇన్నిసార్లు ఔట్ కాలేదు.

9 100వ వన్డే మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన తొమ్మిదో బ్యాట్స్‌మన్‌గా ధవన్ నిలిచాడు. గతంలో ఈ రికార్డు గ్రీనిడ్జ్, క్రెయిన్స్, యోహానా, సంగక్కర, గేల్, ట్రెస్కోథిక్, సర్వన్, వార్నర్ పేరిట ఉన్నది.

5 భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగుల జాబితాలో కోహ్లీ(9423) ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. సచిన్(18426), గంగూలీ(11221), ద్రవిడ్(10768), ధోనీ(9757) ముందున్నారు.

విజయమెవరిదో

భారత్ వరుస విజయాల జోరుకు వరుణుడు అడ్డుపడ్డాడు. రెండున్నర దశాబ్దాల కలను సాకారం చేసుకుందామనుకున్న టీమ్‌ఇండియా ఆశలకు ప్రతిబంధకంగా మారాడు. ధవన్ శతక ధమాకాతో చెలరేగితే..తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ కోహ్లీ అర్ధసెంచరీతో అదురగొట్టాడు. ఫలితంగా పోరాడే స్కోరు అందుకున్న భారత్..ఇప్పటికే సిరీస్‌లో వెనుకంజలో ఉన్న దక్షిణాఫ్రికాకు దీటైన సవాలు విసిరింది. లక్ష్యఛేదనలో ఆదిలోనే కెప్టెన్ మక్రామ్ వికెట్ కోల్పోయిన సఫారీలకు వర్షం అండగా నిలిచింది. ఎడతెరిపిలేని వానతో గంటకు పైగా మ్యాచ్‌కు అంతరాయం కలుగడంతో 28 ఓవర్లకు కుదిస్తూ 202 లక్ష్యంగా నిర్దేశించారు.



కోహ్లీ (75)



ధవన్ (109)

దక్షిణాఫ్రికా లక్ష్యం 202
ప్రస్తుతం 43/1
ధవన్ సెంచరీ ▪ భారత్ 289/7

జొహన్నెస్‌బర్గ్: సిరీస్ ఫలితాన్ని నిర్దేశించే నాలుగో వన్డేలో వరుణుడు కీలకమయ్యాడు. శనివారం పలుమార్లు వర్షం అంతరాయం కల్గించిన మ్యాచ్ అభిమానుల్లో ఆసక్తి రేపింది. ధవన్(105 బంతుల్లో 109, 10ఫోర్లు, 2సిక్స్‌లు) శతక విజృంభణకు తోడు కెప్టెన్ కోహ్లీ(83 బంతుల్లో 75, 7ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 289/7 స్కోరు చేసింది. వందో వన్డేలో సెంచరీ చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా ధవన్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. మరోవైపు కోహ్లీ వీరోచిత ఫామ్‌తో సఫారీలపై మరోమారు విరుచుకుపడ్డాడు. రబాడ(2/58), ఎంగ్డీ(2/52) రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో వరుణుడు అంతరాయంతో లక్ష్యాన్ని 28 ఓవర్లకు 202కు కుదించారు. కడపటి వార్తలు అందేసరికి దక్షిణాఫ్రికా 9.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. ఆమ్లా(21), డుమిని(3) క్రీజులో ఉన్నారు. బుమ్రా(1/15)కు వికెట్ దక్కింది.

ధవన్ ధమాకా: తొలుత టాస్ గెలిచిన భారత్..బ్యాటింగ్ ఎంచుకున్నది. గాయపడ్డ కేదార్ జాదవ్‌కు బదులుగా శ్రేయాస్ అయ్యర్‌ను తుది జట్టులోకి తీసుకుంది. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన వాండరర్స్ పిచ్‌పై ఆదిలోనే టీమ్‌ఇండియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లేమితో నానా తంటాలు పడుతున్న రోహిత్‌శర్మ(5)..మరోమారు రబాడ(2/58)కు బలయ్యాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ ఆఖరి బంతికి రబాడకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి రోహిత్ వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కెప్టెన్ కోహ్లీ(75)..ధవన్(109)కు జతకలిశాడు. కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్న వీరిద్దరు అడపాదడపా బౌండరీలతో ఆకట్టుకున్నారు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా 53/1 స్కోరుతో నిలిచింది. సిరీస్‌లో తమదైన ఫామ్‌ను కొనసాగిస్తూ కోహ్లీ, ధవన్ స్కోరుబోర్డును పరిగెత్తించారు. వీరిద్దరిని విడదీసేందుకు దక్షిణాఫ్రికా కెప్టెన్ మక్రామ్ ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో ధవన్ తొలుత అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు చెలరేగిన కోహ్లీ..ఎంగ్డీ బౌలింగ్‌లో కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. భారీ స్కోరు దిశగా వెళుతున్న భారత్‌కు కోహ్లీ రూపంలో దెబ్బతగిలింది. షాట్ ఆడే క్రమంలో కవర్స్‌లో డివిలీయర్స్ క్యాచ్‌తో కోహ్లీ నిష్క్రమించాడు. దీంతో రెండో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లీ పెవిలియన్ చేరినా.. వెనుకకు తగ్గని ధవన్ తనదైన జోరు కొనసాగిస్తూ రహానే(8)తో కలిసి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. అయితే వాతావరణం సరిగ్గా అనుకూలించకపోవడంతో మ్యాచ్‌కు 53 నిమిషాల పాటు అంతరాయం కల్గింది.

89 పరుగులకు 5 వికెట్లు: మ్యాచ్ తిరిగి మొదలైన తర్వాత భారత్‌కు అస్సలు కలిసిరాలేదు. 89 పరుగుల తేడాతో 5 వికెట్లు కోల్పోయింది. ఈ కారణంగా ఓ దశలో 300పైగా స్కోరు సాధిస్తుందనుకున్న టీమ్‌ఇండియా..289/7 పరిమితమైంది. సెంచరీ హీరో ధవన్..మోర్కెల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ మరుసటి ఓవర్లోనే రహానే పెవిలియన్ చేరాడు. అప్పటికే క్రీజులో ఉన్న అయ్యర్(18)కు ధోనీ(42 నాటౌట్) జత కలిశాడు. వీరిద్దరు స్ట్రైక్ రొటేట్ చేస్తూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. బౌండరీలతో జోరుమీద కనిపించిన అయ్యర్..ఎంగ్డీ బౌలింగ్‌లో భారీషాట్‌కు పోయి ఔటయ్యాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా(9)మరోమారు నిరాశపరుస్తూ కెప్టెన్ మక్రామ్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్‌కు వెళ్లాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా ధోనీ మాత్రం తనదైన శైలిలో బ్యాటింగ్ కొనసాగించాడు. ఆఖరి ఓవర్లో భువనేశ్వర్(5) రనౌట్ అయ్యాడు. ఈ కారణంగా ఆఖరి పదోవర్లలో భారత్ కేవలం 59 పరుగులకే పరిమితమైంది. కుల్దీప్‌యాదవ్(0) నాటౌట్‌గా నిలిచాడు. ఎంగ్డీ(2/52), రబాడ(2/58) రెండేసి వికెట్లు తీశారు.



స్కోరుబోర్డు

స్కోరుబోర్డు: భారత్: రోహిత్‌శర్మ(సి&బి) రబాడ 5, ధవన్(సి)డివిలీయర్స్(బి)మోర్కెల్ 109, కోహ్లీ(సి)మిల్లర్(బి)మోరిస్ 75, రహానే(సి)రబాడ(బి)ఎంగ్డీ 8, అయ్యర్(సి)మోరిస్(బి)ఎంగ్డీ 18, ధోనీ 42 నాటౌట్, హార్దిక్(సి) మక్రామ్(బి)రబాడ 9, భువనేశ్వర్(రనౌట్) 5, కుల్దీప్ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 18; **మొత్తం: 50 ఓవర్లలో 289/7; వికెట్ల పతనం:** 1-20, 2-178, 3-206, 4-210, 5-247, 6-262, 7-282; **బౌలింగ్:** మోర్కెల్ 10-0-55-1, రబాడ 10-0-58-2, ఎంగ్డీ 10-0-52-2, మోరిస్ 10-0-60-1, ఫెల్కువాయో 6-0-38-0, డుమిని 4-0-20-0.

దక్షిణాఫ్రికా: మక్రామ్ (ఎల్బీ)బుమ్రా 22, ఆమ్లా 22 నాటౌట్, డుమిని 4 నాటౌట్; ఎక్స్‌ట్రాలు:3; **మొత్తం:**9.4 ఓవర్లలో 51/1; **వికెట్ల పతనం:** 1-43,

బౌలింగ్: భువనేశ్వర్ 4-0-27-0, బుమ్రా 4-0-15-1, కుల్దీప్ 1-0-3-0, హార్దిక్ 1-0-6-0.

గులాబీ జెర్సీలో ఎందుకు?



వాండరర్స్ స్టేడియం గులాబీ రంగు పులుముకుంది. నాలుగో వన్డే మ్యాచ్‌కు వేదికైన జొహన్నెస్‌బర్గ్ వాండరర్స్ మైదానంలో ఎటు చూసిన గులాబీ వాతావరణం కనిపిస్తున్నది. దక్షిణాఫ్రికా క్రికెటర్లే కాదు మ్యాచ్ చూడటానికి వచ్చిన అభిమానులు కూడా గులాబీ రంగు దుస్తుల్లో దర్శనమిచ్చారు. దేశంలో రొమ్ము క్యాన్సర్‌పై సరైన అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిగస్తులను ఆదుకునే సదాశయంతో నిధుల సేకరరణ నిమిత్తం క్రికెట్ దక్షిణాఫ్రికా(సీఎస్‌ఏ) పింక్ వన్డే మ్యాచ్‌కు పూనుకుంది. అయినా సీఎస్‌ఏకు ఇదేం కొత్త కాదు. గతంలోనూ ఐదుసార్లు ఇలా గులాబీ రంగు దుస్తులతో మ్యాచ్‌లు నిర్వహించింది. ఈ అన్ని మ్యాచ్‌ల్లోనూ సఫారీలనే విజయం వరించడం విశేషం. ఈ మ్యాచ్ ద్వారా వచ్చే నిధులను జొహన్నెస్‌బర్గ్‌లోని చార్లొట్టె మ్యాక్సెకె రొమ్ము క్యాన్సర్ క్లినిక్‌కు అందజేయనున్నారు. అయితే ఈసారి నిధుల సేకరణ లక్ష్యాన్ని ఒక మిలియన్ ర్యాండ్ వరకు నిర్దేశించుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీనిపై సీఎస్‌ఏ సీఈవో హర్గున్ లోర్గాత్ ట్విట్టర్ వేదికగా స్పందించాడు. 'ఏడాదికోసారి నిర్వహించే గులాబీ వన్డే మ్యాచ్ మాకందరికీ ఎంతో ప్రత్యేకమైనది. దీని ద్వారా దేశంలో రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితులకు అవగాహన కల్పించడం, వారిని ఆదుకోవడానికి ఉపయోగపడుతుంది. పింక్‌డ్రైవ్ ద్వారా అభిమానులందరినీ ఏకం చేస్తున్నాం' అని ట్వీట్ చేశారు. ఇదిలా ఉంటే స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న బిడ్‌వెస్ట్..మ్యాచ్‌లో ఒక్కో బౌండరీకి 1000 ర్యాండ్‌లు, క్యాచ్‌కు, సిక్స్‌కు 10 వేల ర్యాండ్‌లను విరాళమిచ్చేందుకు ముందుకొచ్చింది. మరి ఈ మ్యాచ్ ద్వారా ఎన్ని నిధులు వస్తాయో చూడాలి.



ఈ నెల 24 నుంచి 'తెలంగాణ ఫ్రీడంకప్'

- టీసీఏ కార్యదర్శి గురువారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ప్రీమియర్ లీగ్(టీఎస్‌పీఎల్) విజయవంతమైందని టీసీఏ అధ్యక్షుడు యెండల లక్ష్మినారాయణ, టీసీఏ కార్యదర్శి గురువారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా యెండల మాట్లాడుతూ హెచ్‌సీఏ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటస్వామి మెమోరియల్ టీ20 లీగ్‌లో జిల్లా నుంచి కేవలం ఇద్దరు క్రికెటర్లనే ఆడిస్తూ గ్రామీణ క్రికెటర్లను మోసం చేస్తున్నారన్నారు. వ్యక్తిగత పనుల కోసమే హెచ్‌సీఏను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇష్టానుసారం రెండు క్లబ్‌లకు రూ.9 నుంచి రూ.10 కోట్లు కేటాయించారని.. ఈ నిధులు ఎలా ఖర్చు చేశారో లెక్కలు కూడా లేవన్నారు. గ్రామీణ క్రికెటర్లకు మరో అవకాశంగా 'తెలంగాణ ఫ్రీడంకప్' నిర్వహిస్తున్నామని గురువా రెడ్డి తెలిపారు.

పన్ను మినహాయింపు ఇస్తేనే..

- భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ!

దుబాయ్: భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ-2021 ఆతిథ్యం సందిగ్ధంలో పడింది. పన్ను మినహాయింపు ఇస్తేనే భారత్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తామని, లేదంటే ప్రత్యామ్నాయ వేదికలకు తరలిస్తామని ఐసీసీ మెలిక పెట్టింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని బీసీసీఐకి విజ్ఞప్తి చేసింది. వాస్తవానికి 2021 చాంపియన్స్ ట్రోఫీతో పాటు 2023 వన్డే వరల్డ్‌కప్‌నకు కూడా భారతే ఆతిథ్యమివ్వాల్సి ఉంది. అయితే ఒక్క చాంపియన్స్ ట్రోఫీకి పన్ను మినహాయింపు ఇవ్వకపోతే తమకు దాదాపు రూ. 650 కోట్ల నష్టం వస్తుందని ఐసీసీ వెల్లడించింది.

తెలంగాణ బాలుర జట్టు శుభారంభం



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17 జాతీయ బాలబాలికల హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలురు జట్టు శుభారంభం చేసింది. త్రిపుర జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 25-07 స్కోరుతోవిజయం సాధించి ముందంజ వేసింది. శనివారం మహబూబ్ నగర్ జడ్పీ మైదానంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ టోర్నీలో మొత్తం 27 జట్లు తలబడనున్నాయి.

దక్షిణాఫ్రికాకు ఊరట

మూడో వన్డేలో సఫారీ మహిళల జట్టు గెలుపు

2-1తో సిరీస్ భారత్ వశం



పోచెఫ్‌స్ట్రూమ్: ఐసీసీ వన్డే చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత మహిళా జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మిథాలీ సేన 2-1తో సిరీస్‌ను ముగించింది. భారత్ విధించిన 241 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా మహిళల జట్టు 49.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. డుప్రీజ్ (90 నాటౌట్)కు తోడు వోల్వార్ట్ (59) కెప్టెన్ నీకెర్క్ (41 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో పాండే, బిస్త్, పూనమ్‌కు తలా వికెట్ దక్కింది.
అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మిథాలీ సేన నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తిశర్మ (79) వేద కృష్ణమూర్తి (56) రాణించగా..ఆఖర్లో శిఖా పాండే 31 పరుగులతో అజేయంగా నిలిచింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఇస్మాయిల్‌కు 4, ట్రయాన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డుప్రీజ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా స్మృతి మందన(219 పరుగులు) నిలిచారు. ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఫిబ్రవరి 13 నుంచి మొదలవుతుంది.

సంక్షిప్త స్కోర్లు: భారత మహిళలు: 240 ఆలౌట్ (దీప్తి 79, వేద 56, షబ్నిమ్ 4/30)

దక్షిణాఫ్రికా మహిళలు: 241/3, 49.2 ఓవర్లు (డుప్రీజ్ 90, వోల్వార్ట్ 59, బిస్త్ 1/38).



రన్నరప్ గద్వాల

- అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీలు

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ నగరపంచాయతీలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో స్థానిక గద్వాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో హోస్పేట్, గద్వాల జట్లు తలపడగా.. హోస్పేట్ జట్టు నెగ్గింది. దీంతో గద్వాల జట్టు రన్నరప్ స్థానంతో సంతృప్తి చెందింది.





మొబైల్ చూస్తుంటే మలద్వారం ఊడిపోయింది!

మరుగుదొడ్డిలో అరగంట గడిపిన ఫలితం



బీజింగ్: అప్పట్లో పేపరు పట్టుకుని మరుగుదొడ్డిలో కూర్చోవడం చాలామందికి అలవాటుగా ఉండేది. ఇప్పుడు సెల్‌ఫోన్ పేపరు స్థానాన్ని ఆక్రమిస్తున్నది. కాస్త ప్రశాంతంగా కూర్చుని వార్తలు, గేములు మెసేజ్‌లు అంటూ కాలక్షేపం చేయడానికి ఇంతకన్నా మంచిదారి లేదని కొంతమంది భావిస్తుంటారు. కానీ ఈ అలవాటు ప్రమాదకర పర్యవసానాలకు దారితీయొచ్చు. చైనాలోని గ్వాంగ్‌డంగ్ రాష్ట్రంలో ఉన్న జోంగ్‌షాన్ ప్రాంతంలో ఓ వ్యక్తి మరుగుదొడ్డి సీటు మీద కూర్చుని మొబైల్‌ను చూస్తూ కాలాన్ని మరిచిపోయాడు. అరగంటపైగానే ఒళ్లుమరిచి మొబైల్‌లోక విహారం సాగించాడు. దీంతో తీవ్ర వత్తిడిపెరిగి మలవిసర్జన ద్వారం ఊడివచ్చిందట. రెక్టల్ ప్రోలాప్స్ సమస్య కారణంగా మలద్వారం బయటకు వచ్చి బుడిపెలా తయారైందట. చిన్న ఆధారంతో వేలాడుతున్న మలవిసర్జన ద్వారాన్ని చూసుకుని సదరు వ్యక్తి లారెత్తిపోయాడు. డాక్టర్లు ఆపరేషన్ చేసి కాపాడారు.

'ప్యాడ్‌మ్యాన్'పై పాక్‌లో నిషేధం

కరాచీ, ఫిబ్రవరి 10: అక్షయ్‌కుమార్ తాజా చిత్రం 'ప్యాడ్‌మ్యాన్' సినిమాను పాకిస్థాన్‌లో నిషేధించారు. రుతుక్రమంపై సాగే ఈ సినిమాకు అనుమతి ఇచ్చేందుకు ఆ దేశ ఫెడరల్ సెన్సార్ బోర్డు (ఎఫ్‌సీబీ) తిరస్కరించింది. 'ఇలాంటి సినిమా మా ఆచార, వ్యవహారాలకు విరుద్ధం, ఇక్కడ సినిమా విడుదల చేసేందుకు అంగీకరించబోం' అని ఎఫ్‌సీబీ సభ్యుడు ఇషాక్‌అహ్మద్ తెలిపారు. నిషిద్ధ అంశంతో తెరకెక్కించిన ప్యాడ్‌మ్యాన్‌ను విడుదల చేయబోమని, ఆ చిత్రానికి ధ్రువీకరణ పత్రం ఇవ్వబోమని పంజాబ్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు కూడా స్పష్టంచేసింది.